www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 శుక్రవారం

# వెలుతురు

రంగారెడ్డి। 22, మార్చి 2024
సంపుటి: 5 సంచిక: 302, పేజీలు: 12, వెల: రూ.5/-
తెలుగు దిన పత్రిక

## చెన్నై సౌత్ నుంచి తమిళిసై పోటీ



**చెన్నై,మార్చి21(వెలుతురు):** లోక్‌సభ ఎన్నికల కోసం తమిళనాడులో తొమ్మిది మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితాను బీజేపీ గురువారం విడుదల చేసింది.
తమిళనాడు బీజేపీ చీఫ్ కె.అన్నామలై కోయంబత్తూరు నుంచి, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెన్నై (సౌత్), కేంద్రమంత్రి ఎల్.మురుగన్ నీలగిరి నుంచి, నైనార్ నాగేంద్రన్ తిరునల్వేలి నుంచి పోటీ చేయనున్నారు. ఈ జాబితాలో రాధాకృష్ణన్, టీఆర్ పరివేందర్, నరసింహన్, ఏసీ షణ్ముగం కూడా ఉన్నారు. ఇక రాధాకృష్ణన్ కన్యాకుమారి నుంచి, నాగేంద్రన్ తూత్తుకుడి నుంచి, టీఆర్ పరివేందర్ పెరంబళూర్ నుంచి, కృష్ణగిరి నుంచి సి. నరసింహన్ పోటీ చేయనున్నారు. వెల్లూరు బరిలో ఏసీ షణ్ముగం ఉన్నారు. ఇటీవలే తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్ పదవికి రాజీనామా చేసిన అనంతరం తమిళిసై సౌందర రాజన్ సొంత గూటికి చేరుకున్నారు. ముందుగా అనుకున్నట్లే చెన్నై సౌత్ నుంచి ఆమె లోక్ సభ ఎన్నికల బరిలో ఉండనున్నారు.

## కాంగ్రెస్ ఖాతాల స్తంభన

# మోడీ కుట్ర

- ఎన్నికల్లో అడ్డుకునేలా కుట్ర చర్యలు
- కాంగ్రెస్‌పై మోడీ కక్షసాధింపు చర్యలు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే దుర్మార్గం
- ఎన్నికల్లో కాంగ్రెస్ పాల్గొనకుండా చేసే యత్నం
- ఇసికి తెలిపినా చర్యలు శూన్యం
- బిజెపి ఎన్నికల బాండ్లపై విచారించాలి
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతల ఆగ్రహం



**న్యూఢిల్లీ,మార్చి21(వెలుతురు):** లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్‌ను ఇబ్బందులకు గురి చేసేందుకు కాంగ్రెస్ ఖాతాలను స్తంభింప చేశారని, ప్రధాని మోడీ ఇందుకు బాధ్యుడని కాంగ్రెస్ తీవ్రంగా ఆరోపించింది. ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌పై కక్షసాధింపు చర్యలకు దిగారని మండిపడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, జైరామ్ రమేశ్ తదితరులు గురువారం ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్, ఎన్నికల బాండ్ల అంశాలపై నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ పార్టీని దెబ్బతీసేందుకే ప్రధాని మోదీ తీవ్ర చర్యలకు పాల్పడుతున్నారని వీరంతా మండిపడ్డారు. ఎన్నికల వేళ డబ్బులేకపోవడంతో ప్రచారం చేసులేకపోతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి పాల్పడుతున్న నేరపూరిత చర్య ఇదని మండిపడ్డారు. మా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఈ రోజుల్లో అకౌంట్లు పనిచేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో మీకు తెలుసు. ఎలాంటి లావాదేవీలు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్ చేయడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గేతో పాటు.. ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు మండిపడ్డారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తమ పార్టీకే కాదని మొత్తం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. ప్రజలు పార్టీ కోసం ఇచ్చిన

మిగతా..2లో



## ఆ ఐదు స్థానాలపై

# బిఆర్ఎస్‌లో ఉత్కంఠ

- ఎటూ తేల్చుకోలేక పోతున్న గులాబీబాస్
- పోటీ చేసేందుకు పలువురు విముఖత
- అభ్యర్థుల ఎంపికపై తర్జనభర్జన
- మెదక్ స్థానంలో హరీష్‌ను నిలిపే ఆలోచన

**హైదరాబాద్,మార్చి21(వెలుతురు):** ఐదు లోక్‌సభ స్థానాల్లో అబ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. కొందరు పోటీకి విముఖంగా ఉండడం కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. ఈ క్రమంలో అబ్యర్థుల ఎంపిక ఆలస్యం అవుతోందని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీ నేతలు తమ అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బిజీబిజీగా ఉన్నాయి. మొత్తం 17 పార్లమెంటు స్థానాలకు గానూ పలువురు అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించేశాయి. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ ఎంపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించేశారు. అయితే ఐదు స్థానాలపై మాత్రం పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. మెదక్, సికింద్రాబాద్, నల్గొండ, భువనగిరి, హైదరాబాద్ స్థానాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ ఐదు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన కాస్త ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెండింగ్ స్థానాల అభ్యర్థుల కోసం కేసీఆర్ మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. నేతలు పార్టీ వీడుతుండటం కూడా అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారింది. నల్గొండ నుంచి బరిలో నిలపడానికి మొదట గుత్తా అమిత్ రెడ్డి పేరును బీఆర్ఎస్ పరిశీలించింది. అయితే అమిత్ రెడ్డి పోటీకి నో చెప్పడంతో సైదిరెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సైదిరెడ్డి కూడా బీజేపీలోకి వెళ్లడంతో అభ్యర్థి కోసం గులాబీ బాస్ తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నల్గొండ కోసం కంచర్ల కృష్ణారెడ్డి,

మిగతా..2లో

## ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలన్నదే లక్ష్యం

- అదే లక్ష్యంతో పనిచేస్తున్నాం: కిషన్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి21(వెలుతురు):** హైదరాబాద్ నగరంలోని బాగ్ అంబర్‌పేట్ డివిజన్ లో కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో లోక్ సభ ఎన్నికలకు నగారా మోగింది అని తెలిపారు. వచ్చే ఎన్నికలు దేశం కోసం జరిగే ఎన్నికలు.. నరేంద్రమోడీకి ఎంత మెజారిటీ వస్తదో నిర్దేశించే ఎన్నికలు.. ప్రస్తుతం దేశంలో భారతీయ జనతా పార్టీకి 302 స్థానాలు ఉన్నాయి.. వచ్చే ఎన్నికల్లో 370 సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు అని ఆయన చెప్పారు. ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.. దేశంలో గతంలో ఎన్నడూ లేని మెజారిటీని దేశ ప్రజలు నరేంద్రమోడీకి కట్టబెట్టబోతున్నారు.. దేశంలో శాంతి భద్రతలు కాపాడటం కోసం.. దేశంలో సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం నరేంద్రమోడీ నాయకత్వంలో నీతివంతమైన ప్రభుత్వం మళ్లీ రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారు అని కిషన్ రెడ్డి అన్నారు.దేశ గౌరవాన్ని పెంచాలంటే..

మిగతా..2లో

## ఇండోనేషియా కొత్త అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంటో

**ఇండోనేషియా,మార్చి21(వెలుతురు):** ప్రపంచంలో మూడో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండోనేషియాకు కొత్త అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంటో(72) ఎన్నికైనట్లుగా ఆ దేశ ఎన్నికల సంఘం బుధవారం తెలిపింది. రక్షణ మంత్రిగా ఉన్న ప్రబోవో ప్రస్తుతం అధ్యక్షుడు కాబోతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జోకో విడోడో పదవీకాలం ముగియడంతో కొత్త అధ్యక్షుడిగా సుబియాంటో ఇండోనేషియా పగ్గాలు చేపట్టనున్నారు. ఇండోనేషియా ఆర్మీలో పనిచేసిన ఆయన రక్షణ మంత్రిగా పనిచేశారు. సుబియాంటో, అతని వైస్ ప్రెసిడెంట్ 96 మిలియన్ల కన్నా ఎక్కువ ఓట్లు సాధించారు. మొత్తం కౌంట్‌లో దాదాపుగా 58.6 శాతం ఓట్లు వచ్చాయి. దీంతో తొలి రౌండ్ మెజారిటీతోనే వీరి విజయం కన్ఫామ్ అయింది. పోటీలో ఉన్న అనీస్ బస్వేదర్ దాదాపు 41 మిలియన్ ఓట్లు, 24.9 శాతం ఓట్లు సాధించారు.ఇండోనేషియా 5వ అధ్యక్ష

మిగతా..2లో



## హెచ్‌ఎండిఏలో అక్రమాలు

- ప్రభుత్వానికి భారీగానష్టం




**హైదరాబాద్,మార్చి21(వెలుతురు):** హెచ్‌ఎండిఏలో తవ్విన కొద్దీ అక్రమార్కులు బయటపడుతున్నారు. కృష్ణకుమార్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ మేరకు కృష్ణకుమార్, శివబాలకృష్ణ అక్రమాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. కృష్ణకుమార్ ను ఇప్పటికే ప్రభుత్వం సస్పెండ్ చేసింది. హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ ఎలానింగ్ ఆఫీసర్ గా పని చేస్తున్న కృష్ణ కుమార్ బడా బిల్డర్లతో కుమ్మక్కై టీడీఆర్ ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలు నష్టం చేశారనే అభియోగాలు ఉన్నాయి. బిల్డర్లకు లబ్ధి చేకూర్చే విధంగా ֶ÷ల్స్ క్లియర్ చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. కృష్ణకుమార్ చేసిన పని వల్ల ప్రభుత్వానికి రూ.3800 కోట్లు నష్టం జరిగిందని ఏసీబీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఆయనతో పాటు మరో ఇద్దరు హెచ్‌ఎండీఏ ప్లానింగ్ అధికారుల పాత్ర పై ఏసీబీ ఆరా తీస్తోంది. బడా బిల్డర్ల ప్రాజెక్టుల ప్లానింగ్ లో టీడీఆర్ విలువ తగ్గించి

మిగతా..2లో




## ఇసిల నియామకంలో

# స్టే ఇవ్వలేం..

- జోక్యం చేసుకుంటే గందరగోళానికి దారితీయగలదు
- కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పని భావించలేం
- సుప్రీంకోర్టులో పిటిషన్లపై విచారణలో ధర్మాసం వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి21(వెలుతురు):** ఇసిల నియామకం అంశంలో స్టే ఇచ్చేందుకు సుప్రీం నిరాకరించింది. ఇద్దరు కమిషనర్ల నియామకాన్ని కూడా తప్పుపట్టలేమని తేల్చి చెప్పింది. లోక్‌సభ ఎన్నికల ముందు ఈసీల నియామకం అంశం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం నూతనంగా తీసుకొచ్చిన చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. చట్టంపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ దశలో నిలిపివేస్తే అది తీవ్ర గందరగోళానికి దారితీస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఇటీవల ఈసీలుగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్ నియామకాలను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. కొత్తగా నియమితులైన వారిపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. ఎన్నికల సంఘం

మిగతా..2లో



## మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా

# ఎగరాలి

- ఇక్కడ గెలిచేది సిఎం అబ్యర్థిగా గుర్తించాలి
- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- మల్కాజిగిరిపై సిఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్,మార్చి21(వెలుతురు):** మల్కాజిగిరి, కొడంగల్ తనకు రెండు కళ్లలాంటివని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానం ఎన్నిక అభ్యర్థిది కాదని, ముఖ్యమంత్రిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నేతలతో సీఎం సమావేశం నిర్వహించారు. తనను సీఎంను చేసింది మల్కాజ్‌గిరి గెలుపేనని గుర్తు చేశారు. అప్పుడు నాయకులు అమ్ముడు పోయినా కార్యకర్తలను భుజాలపై ఎత్తుకొని మోసి తనను ఢిల్లీకి పంపించారని అన్నారు. 2,964 బూత్‌లలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని చెప్పారు. కేసీఆర్ పతనం 2019లో మల్కాజ్ గిరి నుంచే మొదలైందని అన్నారు. మల్కాజిగిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాను సీఎంగా ఉన్నానంటే.. ఆ గొప్పతనం మల్కాజిగిరి కార్యకర్తలదేనన్నారు. ఆనాడు కొందరు నాయకులు అమ్ముడుపోయినా.. కార్యకర్తలు భుజాలపై మోసి గెలిపించి తనను దిల్లీకి పంపించారని గుర్తు చేశారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి. నాటి గెలుపు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసింది.

మిగతా..2లో

## కాంగ్రెస్‌లో చేరిన ముథోల్ మాజీ ఎమ్మెల్యే

- విఠల్ రెడ్డికి కండువా కప్పి ఆహ్వానించిన రేవంత్



**హైదరాబాద్,మార్చి21(వెలుతురు):** పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు కీలక నేతలు పార్టీని వీడారు. కొందరు బీజేపీలో చేరుతుండగా మరికొందరు కాంగ్రెస్ లోకి జంప్ అవుతున్నారు. దీంతో కారు పార్టీ ఖాళీ అవుతుందన్న ప్రచారం జరుగుతోంది. తాజాగా బీఆర్ఎస్‌కు చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరిపోయారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో విఠల్ రెడ్డిని కాంగ్రెస్ లో చేరారు. ఆయన కండువా కప్పి పార్టీలోకి మంత్రి సీతక్క ఆహ్వానించారు. ముథోల్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా విఠల్ రెడ్డి గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన విఠల్ రెడ్డి ఆ తరువాత బీఆర్ఎస్ లోకి వెళ్లారు.
2018లో కూడా ఆ పార్టీ నుంచే పోటీ చేసి మరోసారి విజయం సాధించారు. అయితే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దీంతో ఆయన తన పాతగూడు కాంగ్రెస్ లో చేరారు. విఠల్ రెడ్డి తండ్రి గడ్డన్న కూడా ముథోల్ నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. గడ్డెన్న మంచి నాయకుడిగా పేరుంది.

# ఓట్లడిగే బిజెపి నేతలను నిలదీయండి

**15 లక్షలు ఖాతాల్లో ఎందుకు పడలేదో అడగండి**

**రెండుకోట్ల ఉద్యోగాలపై నిలదీయాల్సిందే**

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సూచన**

**జగిత్యాల,మార్చి21(వెలుతురు):** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు గెలవబోతుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని అన్నారు. అయితే తమ తప్పులు కప్పి పుచ్చుకునేందుకు బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ తలచుకుంటే బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో నేతలు ఎవరూ ఉండరని అన్నారు. ఓట్లడగానికి వచ్చిన బిజెపి నేతలను ఉద్యోగాల గురించి నిలదీయాలన్నారు. అలాగే రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో అడగాలన్నారు. అలాగే కాతాల్లో 15 లక్షల సంగతి ఏమైందో చెప్పాలని అన్నారు. 15 లక్షలు ఖాతాల్లో పడితే బిజెపికి, పడనివారు కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి రమ్మని తాము ఎవరిని అడగటం లేదని.. స్వచ్ఛందంగా నేతలే తమ పార్టీలో చేరుతామని వస్తున్నారని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొంతమంది నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి చర్యలకు పాల్పడదని.. అధికారం ఎక్కడ కోల్పోతామని కేసీఆర్ భయపడి ఇష్టారీతిగా ఫోన్లను ట్యాప్ చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ మీద తాము కక్ష పూరితంగా కేసులు పెట్టలేదన్నారు. జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోయిన ఫొటోలు, వీడియోలను చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్‌లోనని.. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వలు గుర్తించి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తున్నదని అన్నారు. కానీ కేసీఆర్ చేయాల్సిన పనులు చేయకుండా బాధ్యత విస్మరించి తమపై రాళ్లేయడం తగదన్నారు. కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికీ తెలిసిందేనని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్కసీటు గెలిస్తే గొప్పని చెప్పారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని... అన్నారు. తాము చెప్పిందే చేస్తున్నామని.. గత పాలకుల అవినీతి మీద పోరాడుతున్నామన్నారు. కేసీఆర్ వల్ల దెబ్బతిన్న వ్యవస్థను ప్రభుత్వం దారిలో పెడుతున్నదని చెప్పారు. 5 ఎకరాలకు రైతుబంధు ఇస్తామని మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెప్పామని.. చెప్పినట్లే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని అన్నారు. రాళ్లురప్పలు, కొండలు గుట్టలకు రైతుబంధు రాదన్నారు.

## ఇండోనేషియా కొత్త అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంటో

**మొదటిపేజీ తరువాయి..**
ఎన్నికలకు ఫిబ్రవరి 14న జరగగా ఈరోజు ఫలితాలు వెలువడ్డాయి. వరసగా మూడోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన సుబియాంటో ఈ సారి గెలుపొందారు. రెండుసార్లు ఆయన విడోడో చేతిలో ఓడిపోయి, ఈ సారి గెలిచారు. ప్రస్తుత అధ్యక్షుడు జోకో విడోడో కొడుకు 36 ఏళ్ల జిబ్రాన్ రాకబుమింగ్ రాకా ఉపాధ్యక్షుడిగా సుబియాంటో ఎంచుకోవడంతో ఆయన గెలుపు మరింత సులభమైంది. అక్టోబర్ నెలలో సుబియాంటో అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నారు.

## ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలన్నదే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..
పేద ప్రజలకు సంక్షేమం అందాలంటే.. దేశంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలంటే మోడీనే మళ్లీ రావాలని 140 కోట్ల మంది ప్రజలు ఆకాంక్షిస్తున్నారు అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రపంచ దేశాల ముందు దేశ గౌరవాన్ని పెంచిన వ్యక్తి నరేంద్రమోడీనే.. నరేంద్ర మోడీ గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఒక్క రోజు సెలవు తీసుకోకుండా దేశం కోసం ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించి 17కు 17 సీట్లు గెలిపించి.. దేశంలో మూడవసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ నాయకత్వంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో భాగస్వామ్యులు చేయాలని కోరుతున్నాను అని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి తెలిపారు.

## హెచ్ఎండిఏలో అక్రమాలు

మొదటిపేజీ తరువాయి..
ప్రభుత్వానికి తక్కువ ఫీజులు కట్టించేలా చేసి గవర్నమెంట్ కు నష్టం కలిగించేలా చేశారు కృష్ణకుమార్. శివ బాలకృష్ణపై ఏసీబీ కేసు నమోదు కాగానే కృష్ణకుమార్ అమెరికాకు వెళ్లిపోయారు. ఆయనను అమెరికా నుంచి హైదరాబాద్ కు రప్పించడానికి ఏసీబీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా.. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కృష్ణకుమార్ ను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్ నంబర్లు, వాటి యజమానులు ఎవరు అన్న విషయాలను పరిశీలించకుండానే టీడీఆర్ కింద పరిహారాన్ని ఇవ్వాలని సిఫారసు చేశారు. దీంతో ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## చిత్రపురి కేసులో నిజాలు బయటపెట్టాలి: ఆర్ఎస్పీ

**హైదరాబాద్,మార్చి21(వెలుతురు):** చిత్రపురి సిటీలో రూ.3 వేల కోట్ల భూదందా జరిగిందని ఆరోపణ వస్తే ఆధారాలతో స్పందించాల్సింది పోయి దౌర్జన్యంగా అక్రమ కేసు పెట్టి, సెల్‌ఫోన్‌ను సీజ్ చేయడం ఏంటి రేవంత్ రెడ్డి గారు అని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. అంటే కుంభకోణం బరాబర్ జరిగిందన్న మాట. దాని నుండి ప్రజల దృష్టి మరల్చడానికే తమ యువనేత, తెలంగాణ పోరాట యోధుడు మన్నె క్రిశాంక్ ఫోన్ సీజ్ చేశారు. దీన్నే పోలీసు భాషలో అటెన్షన్ డైవర్షన్ అంటరు. ఈ గ్యాంగ్‌లు బ్యాంకుల ముందు తచ్చాడుతూ ఖాతాదారుల మీద రంగు చల్లి వాళ్ల పైసలనెత్తుకొని పారిపోతారు. ఈ గ్యాంగ్‌లు నేడు తెలంగాణలో రాజ్యమేలుతున్నవి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# నేను సీఎం కావాలన్న ఆలోచనే లేదు...

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**పార్లమెంట్ ఎన్నికల తరువాత నేనే సీఎం అనడం ఊహాజనితం**

**హైదరాబాద్, (వెలుతురు):**
కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం కావాలనే ఆలోచనలేదు అలా అనుకోవడంలేదని, అలాగని ఏ పార్టీకి తాను టచ్‌లో కూడాలేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఒకరు సీఎం కావాలంటే హైకమాండ్ కూడా కొన్ని ఈక్వేషన్స్ చూస్తుంది కదా..! ఎవ్వరికీ (బీజేపీ) టచ్ లోకి వెళ్ళలేదు. అదంతా ప్రచారం అని కొట్టిపారేశారు. గురువారం మహానాడు ప్రతినిధితో మనసువిప్పి మాట్లాడారు. మా ప్రభుత్వం ఎవరి ఫోన్ ట్యాపింగ్ చేయదు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు గెలవబోతున్నాం. బీఆర్ఎస్ మీద మేము కక్ష పూరితంగా కేసూలు పెడుతున్నామంటున్నారు. అవన్నీ గత ప్రభుత్వంలో వారు అధికార దుర్వినియోగంతో చేసిన తప్పులు అన్నీ కనబడుతున్నాయన్నారు. జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోవడం వంటీ ఫోటోలు. వీడియోలు పెట్టి కొన్ని మీడియా సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వెసే ప్రయత్నం చేస్తున్నాయి. మా ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్‌లో రాబోయే ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని నీటి



నిల్వలు ఉంచాల్సిన బాధ్యత వారిపై ఉంది, కాని చేయాల్సిన పనులు చేయకుండా భాధ్యత విస్మరించి మాపై రాళ్ళేయడం తగదన్నారు. కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికి తెలిసిందే. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒకటి రెండు ఎంపీ సీట్లు గెలిస్తే గొప్ప అనుకోవాలి. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ. మాకు ఎంఐఎం మద్దతు తెలపుతుంది. ఇతర పార్టీల నుండి మా పార్టీలోకి రమ్మని మేం ఎవరిని అడగటం లేదు. వారికై వారు స్వచ్ఛందంగా వస్తున్నారు. మేం గేట్లు ఎత్తలేదు. ఎత్తితే వరద ఆగదు. మేం చెప్పిందే చేస్తున్నం. గత పాలకుల అవినీతి మీద పోరాడుతూనే. డిస్టర్బ్ అయిన వ్యవస్థను దారిలో పెడుతున్నం. 5ఎకరాలకు రైతు బంధు అని చెప్పినట్టే ఇస్తున్నాం. జీతాల చెల్లింపుల్లో కొంత ఆలస్యం అయిన మాట వాస్తవమే. ఆ దిశగా పరిష్కారం కోసం పనిచేస్తున్నాం. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడేందుకు వెనుకాడబోము 14 స్థానాలు గ్యారెంటీగా గెలుస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ అవినీతి సొమ్ము అంతా కక్కిస్తాం అని హెచ్చరించారు. ధరణిలో జరిగిన అవినీతిని బయటకు తీస్తాం అన్నారు. ప్రధానిని కలిస్తే పొల్యూట్ అయినట్టు కాదు. రెండు సంవత్సరాలు కంటే ఎక్కువగా ఉన్న అధికారులను మొత్తం మార్చేస్తాం. రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేస్తాం...ధరణి లో మంచిని ఉంచుతాం.. భూమాత పోర్టల్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

# ఆ ఐదు స్థానాలపై బిఆర్ఎస్‌లో ఉత్కంఠ

**మొదటిపేజీ తరువాయి..**
కడారు అంజయ్య యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే బీఆర్ఎస్ అధినేత మాత్రం కంచర్ల కృష్ణారెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక భువనగిరిలోనూ అదే పరిస్థితి నెలకొంది. భువనగిరి కోసం మొదట మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పేరును బీఆర్ఎస్ పార్టీ దాదాపు ఖరారు చేసింది. కానీ పైళ్ల కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో మరో అభ్యర్థి కోసం కేసీఆర్ కసరత్తు మొదలుపెట్టారు. ప్రస్తుతం భువనగిరి రేసులో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, దూదిమెట్ల బాలరాజు ఉన్నారు. మరోవైపు సికింద్రాబాద్ నుంచి తలసాని సాయికిరణ్ పోటీకి విముఖత చూపడంతో మరో అభ్యర్థి కోసం బీఆర్ఎస్ అన్వేషణ సాగిస్తోంది. సికింద్రాబాద్ కోసం పద్మారావు, దాసోజు శ్రావణ్, రావుల శ్రీధర్ రెడ్డి పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి పద్మారావును పోటీ చేసేందుకు బీఆర్ఎస్ ఒప్పిస్తున్నట్లు తెలుస్తోంది. అటు మెదక్ అభ్యర్థిపైనా పీటముడి ఇంకా వీడలేదు. మొదట మెదక్ కోసం ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి పేరును కేసీఆర్ పరిశీలించారని సమాచారం. వెంకట్రామిరెడ్డి పోటీకి ఆసక్తి చూపకపోవడంతో ఒంటేరు ప్రతాపరెడ్డి పేరును అధినేత పరిశీలిస్తున్నారు. అలాగే హైదరాబాదులో పోటీ నామ మాత్రమే కావడంతో మిగిలిన నాలుగు స్థానాలపైనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకటి, రెండు రోజుల్లోనే పెండింగ్ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఉండే అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచార వ్యూహాలను రచిస్తున్నారు. ఇకపోతే మెదక్ సీటు మరింత ప్రతిష్టాత్మకం కావడంతో ఇక్కడ గెలుపు గుర్రాలపై ఆలోచన చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమానికి ముందు నుంచి బీఆర్ఎస్ ఇక్కడ గెలుస్తోంది. 2009లో టీఆర్ఎస్ నుంచి విజయశాంతి, 2014లో మెదక్ నుంచి కేసీఆర్ ఎంపీగా గెలిచారు. మళ్లీ ఉప ఎన్నికల్లోనూ, 2019 లోక్ సభ ఎన్నికల్లోనూ కొత్త ప్రభాకర్ రెడ్డి టీఆర్ఎస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఒక్క మెదక్ తప్ప..మిగతా ఆరు స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక్కడ సిద్దిపేట నుంచి హరీశ్ రావు, గజ్వేల్ నుంచి కేసీఆర్, దుబ్బాక నుంచి కొత్త ప్రభాకర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలిచారు. మెదక్ లో బీఆర్ఎస్ కు మంచి పట్టు ఉన్నా ప్రస్తుతం లోక్ సభకు పోటీ చేసేందుకు ఎవర్ని బరిలోకి దింపాలనేదానిపై అధిష్టానం తర్జనభర్జనలో పడింది. లోక్‌సభ ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుస్తామనుకుంటున్న స్థానాన్ని ఎలాగైనా వదులుకోవద్దని బీఆర్ఎస్ చూస్తోంది. కాంగ్రెస్ నుంచి నీలం మధు పేరు వినిపిస్తోంది. బీజేపీ నుంచి రఘునందన్ రావు బరిలో దిగారు. ఇక బీఆర్ఎస్ నుంచి మెదక్ లోక్‌సభకు తాజాగా హరీశ్ రావు లేదా కేసీఆర్ పోటీచేయాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు. కీలక నేతలు బరిలో దిగితే ఖచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే హరీశ్ రావు మెదక్ నుంచి పోటీ చేస్తే పార్టీ క్యాడర్ లో జోష్ వస్తుందంటున్నారు. కేసీఆర్ కూడా హరీశ్ ను పోటీ చేసేందుకు మొగ్గుచూపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఎవ్వరూ కాదంటే మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేరును కూడా పరిశీలిస్తున్నారు. మొత్తంగా మిగిలిన ఐదు స్థానాల్లో గులాబీ బాస్ ఎవర్ని బరిలోకి దింపుతారో అన్న ఉత్కంఠ కలుగుతోంది. ఇక నాగర్‌కర్నూలులో మాత్రం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ ఖాయమని అంటున్నారు.

# ఇసిల నియామకంలో స్టే ఇవ్వలేం..

**మొదటిపేజీ తరువాయి..**
స్వతంత్ర సంస్థ. అది పాలనాయంత్రాంగం కింద పనిచేస్తుందని చెప్పకూడదు. ఈసీల నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పు అని భావించలేం. ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ సమయంలో సమతుల్యత పాటించాల్సిన అవసరం చాలా ముఖ్యం' అని ధర్మాసనం అభిప్రాయపడింది. 2023 చట్టం రూపొందించక ముందు ఎన్నికల కమిషనర్ల నియామక తాత్కాలిక కమిటీలో ప్రధాని, సీజేఐ, లోక్‌సభలో విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై కేంద్రం బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. కొత్త చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది. ఇదిలావుంటే భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా లేని ఎంపిక కమిటీ నూతన ఎన్నికల కమిషనర్లను నియమించడం సరైందేనని సుప్రీంకోర్టులో కేంద్రం పేర్కొంది. 2023 చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది. ఈ మేరకు న్యాయమంత్రిత్వశాఖ సర్వోన్నత న్యాయ స్థానంలో ప్రమాణపత్రం దాఖలు చేసింది. 2023 చట్టం ప్రకారం హడావుడిగా కొత్త ఈసీల నియామకం జరిపామన్నది సరికాదని స్పష్టం చేసింది. ఎంపిక కమిటీలో న్యాయసభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం లేదా ఏ సంస్థ అయినా స్వతంత్రంగా ఉంటుందనుకోవడం అపోహ అని పేర్కొంది. పూర్తి కార్యనిర్వాహక విచక్షణతో నియమించిన కాలంలోనూ ఎన్నికల కమిషనర్లు తటస్థంగా, ప్రభావవంతంగా విధులు నిర్వహించారు. ఒక ఉన్నత రాజ్యాంగ కార్యాలయంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాజ్యాంగంలోనే రక్షణ ఉంది. అది ఆయనకు నిష్పక్షపాతంగా పనిచేసే అవకాశం కల్పిస్తుందని తెలిపింది. ఈసీల ఎంపిక కోసం రూపొం దించిన జాబితాను విపక్షాలతో పంచుకోలేదన్న ఆరోపణలను మంత్రిత్వశాఖ కొట్టిపారేసింది. ఈ నెల 13నే లోక్ సభలో విపక్షనేత అధీర్ రంజన్ చౌధరీకి జాబితాను సమర్పించామని తెలిపింది. అందులోంచే నూతన ఈసీల నియామకం జరిగిందన్న విషయాన్ని గుర్తుచేసింది. ఇటీవల ఖాళీ అయిన రెండు ఎన్నికల కమిషనర్ల పదవులను మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్‌లతో 2023 చట్టం ప్రకారం ఏర్పాటైన కొత్త కమిటీ భర్తీ చేసిన సంగతి తెలిసిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలు – సర్వీసు షరతులు, పదవీకాలం చట్టం– 2023ను ప్రజాస్వామ్యయుతంగా, అందరినీ కలుపుకొనేలా రూపొందించామని పిటిషన్‌లో న్యాయమంత్రిత్వశాఖ తెలిపింది. 2023 చట్టం రూపొందకముందు ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ప్రధాని, సీజేఐ, విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని కాంగ్రెస్ నేత జయా ఠాకూర్‌తో పాటు ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్) సవాల్ చేసింది.

# మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

మొదటిపేజీ తరువాయి..
కేసీఆర్ పతనం 2019లో మల్కాజిగిరి నుంచే మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. 100 రోజులు పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేశాం. మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిది. మల్కాజిగిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావాలన్నా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా తుపాను వచ్చినట్లు గెలిచినా.. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఆశించిన స్థాయిలో రాలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 4 స్థానాలు గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేది. అందుకే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఇప్పుడు కాంగ్రెస్ జెండా



ఎగరాలి. అప్పుడే మన ప్రాంతం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ గెలవాలి. హోలీ పండగలోగా అధిష్ఠానం అభ్యర్థులను ప్రకటిస్తుంది. కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత నాది. ఉదయం 7 గంటలకే నాయకులు బస్తీ బాట పట్టాల్సిందే. ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించుకోవాలి. మల్కాజిగిరి క్యాంపెయిన్ మోడల్ రాష్ట్రమంతా అనుసరించేలా చేయాలి. ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నిక అభ్యర్థిది కాదు..ముఖ్యమంత్రిది. నా బలం.. నా బలగం మీరే' అని సీఎం వివరించారు. ఈ ఎన్నికల్లో కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదని సీఎం భరోసా ఇచ్చారు. నాయకులు కార్యకర్తలే తన బలం.. బలగమని, ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉదయం 7 గంటలకే బస్తీ బాట పట్టాలని అన్నారు. మల్కాజ్ గిరి మోడల్ క్యాంపెయిన్ రాష్ట్రమంతా అనుసరించేలా ఉండాలన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానంతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలోనూ గెలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మధుయాష్కి గౌడ్, మైనంపల్లి హన్మంతరావు, సునీతా మహేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఖాతాల స్తంభన మోడీ కుట్ర

**మొదటిపేజీ తరువాయి..**
విరాళాలను వాడుకోకుండా చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎన్నికల వేళ ప్రచారం కోసం ప్రకటనలు ఇవ్వలేకపోతున్నాం. మా నేతలను ఎక్కడికీ పంపించలేకపోతున్నాం. విమాన ప్రయాణాలు పక్కనబెట్టండి.. కనీసం రైలు టికెట్లు కొనడానికీ మా వద్ద డబ్బుల్లేవ్ అని రాహుల్ గాంధీ తెలిపారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ ఖాతాలను ఫ్రీజ్ చేయడం కాదని, భారత ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమని ఆయన దుయ్యబట్టారు. ఈ రోజు దేశంలో ప్రజాస్వామ్యం అనేదే లేకుండా పోయింది. అది అబద్ధంగా మారింది. దేశంలో 20శాతం ఓటర్లు మాకు మద్దతుగా ఉన్నారు. కానీ మేం రెండు రూపాయలు కూడా చెల్లించలేక పోతున్నాం. ఎన్నికల్లో పోరాడకుండా మా సామర్థ్యాన్ని అడ్డుకుంటున్నారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కేంద్రంపై రాహుల్ మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యమే లేదన్నారు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తే ఎన్నికల్లో ఎలా పోటీ చేయగలమన్నారు. ఎవరిదైనా బ్యాక్ అకౌంట్ మూసివేసినా, ఏటీఎం కార్డు పని చేయకుండా చేస్తే జీవించగలరా.. ప్రస్తుతం తాము ఎన్నికల్లో ప్రచారం చేసే పరిస్థితి లేకుండా బీజేపీ కుట్రకు పాల్పడిందన్నారు. ఎన్నికలకు 2 నెలల ముందు ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌ను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకూడదనేదే బీజేపీ ఉద్దేశంగా కనిపిస్తోందని రాహుల్ ఆరోపించారు. అంతకుముందు సోనియా గాంధీ మాట్లాడుతూ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. మా బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను బలవంతంగా లాగేసుకుంటున్నారు. కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రధాని మోదీ వ్యవస్థీకృతంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఓవైపు ఎన్నికల బాండ్ల వ్యవహారం.. మరోవైపు దేశంలోని ప్రధాన ప్రతిపక్షం ఆర్థిక లావాదేవీలపై దాడి జరుగుతోంది. ఇన్ని సవాళ్ల నడుమ ఎన్నికల్లో మేం సమర్థంగా ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం అని ఆమె అన్నారు. ఎలక్టోరల్ బాండ్లు తీవ్రమైన అంశమని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలిపారు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, కాంగ్రెస్‌ను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టే కుట్ర కనిపిస్తోందని, కేంద్రం తీరు సరిగా లేదని, కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ అకౌంట్లపై ముప్పేట దాడి జరుగుతోందని, అకౌంట్లను ఫ్రీజ్ చేయడమనేది దారుణమైన విషయమని సోనియా గాంధీ మండిపడ్డారు. నిధుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ డిమాండ్ చేశారు. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా బీజేపీకి 56 శాతం నిధులు వస్తే.. కాంగ్రెస్‌కు 11 శాతం ఫండ్స్ మాత్రమే వచ్చాయన్నారు. బీజేపీకి రూ.వేల కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఎలా వచ్చాయని ఆమె ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్‌ల వల్ల బీజేపీ భారీగా లాభపడిందన్నారు. తాము ప్రజల నుంచి న్యాయబద్ధంగా సేకరించిన నిధులను ఐటీ ఫ్రీజ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అధికార పక్షం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని.. దేశ చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదని మండిపడ్డారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో జరుగుతున్న పరిణామాలు అసాధారణమైనవని, అప్రజాస్వామికమైనవని సోనియా అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ను అర్థికంగా ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతుందని సోనియా గాంధీ ఆరోపించారు. కేంద్రం తీరు సరిగ్గా లేదన్న ఆమె.. కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలిగించాలని కోరారు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీని బలహిన పరిచే కుట్రలు జరుగుతున్నా యని చెప్పారు. నిధుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగాలంటే తమ బ్యాంకు ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయాలని కోరారు. అభ్యర్థులకు ఇచ్చేందుకు డబ్బు లేదన్నారు. సమయం చూసి కాంగ్రెస్‌ను దెబ్బ తీస్తున్నారని దుయ్యబట్టారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఎవరు లబ్ధి పొందారో దేశం మొత్తానికి తెలుసని మరో కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు.

ఇది అత్యంత తీవ్రమైన అంశమని అన్నారు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసిందని ఆరోపించారు. అధికార పార్టీ వైఖరి ఎంతో ప్రమాదకరమని అన్నారు. బీజేపీ వేల కోట్ల రూపాయిలు విరాళాలుగా తీసుకుని.. కేవలం మా బ్యాంకు ఖాతాలను ఎందుకు స్తంభింపజేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలు, ఆదర్శాలకు భారత్ పేరు గాంచిందని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన విషయం ప్రజలకు తెలిసిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిష్పక్షపాతమైన ఎన్నికలు తప్పనిసరన్నారు. ప్రతి ఒక్కరికీ సమానమైన అవకాశాలు ఉండాలని ఖర్గే పేర్కొన్నారు. మోదీ పాలనలో భారతదేశ ప్రతిష్ట దిగజారు తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖాతాలను సీజ్ చేయడం ద్వారా ఎన్నికల్లో పోటీకి సంబంధించి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఓ రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డంకులు సృష్టించడం సరికాదని.. ఖర్గే అభిప్రాయపడ్డారు. ఎక్కడ చూసినా బీజేపీ ప్రకటనలే కనిపిస్తు న్నాయి. తమ బ్యాంకు ఖాతాలు స్తంభిపజేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకెన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తాము ప్రచారం చేసుకోలేకపోతున్నామన్నారు. పోస్టర్లు వేయించడానికి వీలులేని పరిస్థితులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజలకు తమకు మద్దతు ఇవ్వాలని అజయ్ మాకెన్ కోరారు. బీజేపీతో సహా ఏ రాజకీయ పార్టీ ఆదాయపు పన్ను చెల్లించనప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 బ్యాంకు ఖాతాలను ఎందుకు ఫ్రీజ్ చేశారని ఆయన ప్రశ్నించారు.



## పల్లివాడ గ్రామంలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఏర్పాటు చేసిన NAC సంస్థ


### కత్తెరలు బహుకరణ చేసిన పల్లివాడ సింగిల్ విండో డైరెక్టర్ కల్లూరి సైదమ్మ నగేష్

**వెలుతురు న్యూస్: యాదాద్రి జిల్లా:**
రామన్నపేట మండలం పల్లివాడ గ్రామంలో కుట్టుమిషన్ నేర్చుకున్న మహిళలకు కత్తెర్ల బహుకరణ చేసిన సింగిల్ విండో డైరెక్టర్ కల్లూరి సైదమ్మ నగేష్ NAC సంస్థ వారు మహిళలకు పల్లివాడ గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క ఈ శిక్షణ గతమూడు నెలలుగా పల్లివాడ గ్రామంలో పూర్తి చేసుకున్న వారికి తమ సొంత డబ్బులతో సహకారంగా ఉంటుందని ప్రతి మహిళ తన సొంత కాళ్ళ మీద నిలబడి వాళ్ల యొక్క సొంత అవసరాల సహకారంగా కుట్టు మిషన్లు NAC సంస్థ వాళు ృ అందించడం సందర్భంగా వారికి మా వంతు సహాయంగా కత్తెరలు అందజేసి వారి కొంత సహకారంగా ఉంటుందని చెప్పి వారికి సహకారాన్ని అందజేయడం జరిగింది. తదనంతరం కుట్టుమిషన్ శిక్షణ సభ్యులు గ్రామ మాజీ ఉపసర్పంచ్ సింగిల్ విండో డైరెక్టర్ కు చిరు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో NAC కుట్టు మిషన్ శిక్షణ టీచర్ నవ్య మేడం. పల్లివాడ సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి పావిరాల మత్స్యగిరి యాదవ్, మాజీ వార్డు సభ్యులు బైకానీ నర్మద నరసింహ, జనాపాల లక్ష్మణ్, గట్టు నరసింహ కుట్టు మిషన్ శిక్షణ సభ్యులు నాంపల్లి ఉమారాణి, కల్లూరి మాధవి, మల్లెపాక వసంత, శ్రీలక్ష్మి నికిత, పూజ, బొడ్డు శిరీష మరియు కుట్టు మిషన్ శిక్షణ సభ్యులు పాల్గొన్నారు.




## తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌గా మామిండ్ల జ్యోతీ కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక

**తూప్రాన్, వెలుతురు మార్చి, 21:**
తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ గా 4వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి మామిండ్ల జ్యోతీ కృష్ణ ముదిరాజు గురువారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆర్డీవో జయ చంద్రా రెడ్డి ప్రకటించారు. గురువారం ఉదయం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కు పది మంది కౌన్సిలర్లు ఒక ఎమ్మెల్సీ హాజరు కాగా ఎన్నికల నియమావళినీ ఎన్నికల అధికారి ఆర్డీవో జయ చంద్రా రెడ్డి చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ గా 4వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల జ్యోతీ కృష్ణ ముదిరాజు ను చైర్మన్ గా కౌన్సిలర్ భగవాన్ రెడ్డి ప్రపోజ్ చేయగా మరో కౌన్సిలర్ కోడిప్యాక నారాయణ గుప్త బలపర్చాడు. దీనితో మామిండ్ల జ్యోతీ కృష్ణ ముదిరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ




స్వీకారం చేయించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహికొద్దీన్ చైర్మన్ ఛాంబర్ లో గ్రీన్ ఇంక్ పెన్ను లు ఇవ్వగా అధికార లాంచనాలతో భాధ్యతలు స్వీకరించిన జ్యోతీ కృష్ణ ముదిరాజు మాట్లాడుతూ తన సహచర తోటి కౌన్సిలర్ల ధన్యవాదాలు తెలిపారు. తన కు ఇచ్చిన పదవి భాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించి అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి అందరినీ కలుపుకొని ముందుకు తీసుకెల్లుతానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా గతంలో మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ పై అవిశ్వాసం పెట్టిన సంగతి అందరికి తెలిసిందే. కాగా అవిశ్వాసం నెగ్గి ఇంఛార్జి చైర్మన్ గా కొనసాగిన నందాల శ్రీనివాస్ ఎప్పటి లాగే వైస్ చైర్మన్ గా కొనసాగుతారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఫర్మాలిటి ప్రకారం సాదా సీదాగా ప్రమాణ స్వీకారం జరిగింది.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి ...

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా, (వెలుతురు న్యూస్):** భారత ఎన్నికల సంఘం పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 16న వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని, జూన్ 6వ తేదీ వరకు ఇది అమలులో ఉంటుందని, అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకర్లు గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక జిల్లా స్థాయి బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష రూపాయలకు పైగా డబ్బుల లావాదేవీలు జరిపితే ఖచ్చితంగా వివరాలు తెలియజేయాలని అన్నారు. జిల్లాలో ఏటీఎంల్లో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్ లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈఓ నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలని అన్నారు. లాకర్స్‌లో గోల్డ్‌ను పర్యవేక్షించి, క్యాష్ జనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించాలని, వెహికిల్ నంబర్ లను తనిఖీ చేయాలని వివరించారు. అలాగే ప్రతి రోజూ క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చుల వివరులు కొత్త ఖాతాను తెరవలసి ఉంటుందని సూచించారు. ఎన్నికలలో విధులు నిర్వహించుటకు బ్యాంకులలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు ఎపిక్ కార్డు వివరాలతో పూర్తి సమాచారం అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎల్డీఎం కుసుమ, వివిధ బబ్యాంక్లు ప్రతినిధులు, ఎలక్షన్ సూపర్డెంట్ సైదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బి బి పాటిల్

# జహీరాబాద్ సీటును మోదీకి బహుమతిగా ఇద్దాం...

**జహీరాబాద్‌లో ఊపందుకున్న చేరికలు.. వలసల జోరు**

**గెలుపే లక్ష్యంగా కదం తొక్కుతున్న కార్యకర్తలు**

**బీబీ పాటిల్ సమక్షంలో చేరిన వివిధ పార్టీలకు చెందిన 450 మంది కార్యకర్తలు**

**సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమం కోసం మోదీ కృషి**

**జహీరాబాద్, 21 మార్చి, వెలుతురు :**
గత పదేళ్లుగా నరేంద్ర మోడీ 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' అనే నినాదంతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి బి బి పాటిల్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బి బి పాటిల్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. జహీరాబాద్ లో వలసల జోరు ఊపందుకుంది. జహీరాబాద్ లోని బీజేపీ కార్యాలయంలో జహీరాబాద్ నియోజకవర్గం ఐదు మండలాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు దాదాపు 450 మంది బిజెపిలో చేరారు. వారికి బి బి పాటల్ పార్టీ కండువా కప్పి పార్టీలో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమం కోసం మోదీ గత పది సంవత్సరాలుగా విశేషంగా కృషి చేస్తున్నారని జహీరాబాద్ బిజెపి ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. గత పది సవత్సరాలుగా జహీరాబాద్ నియోజకవర్గం ను అభివృద్ధి చేశానని తెలిపారు. గత పదేళ్లలో జహీరాబాద్ నియోజకవర్గంను అభివృద్ధి చేసేందుకు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నానని, ఇప్పుడు మోదీ ప్రభుత్వంలో ఇంకా ఎక్కువ నిధులు తీసుకు వచ్చి నియోజక వర్గంను మరింత అభివృద్ధి చేయడానికి మోడీకి జహీరాబాద్ సీటును బహుమతిగా ఇద్దామని ఎంపీ పేర్కొన్నారు. కార్యకర్తల ఇంత పెద్ద క్యాడర్ ఉండి కూడా, నన్ను నాయకునిగా స్వీకరించినందుకు ప్రతీ కార్యకర్తను కలుపుకుని పని చేస్తానని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్క కార్యకర్త బూత్ స్థాయిలో పనిచేసి ప్రజలను తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యవంతం చేయాలని, మోదీ గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జి ఎస్ రాజశేఖర్ రెడ్డి, కులకర్ణి, మాణిక్య రావు, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

### - జిల్లా కలెక్టర్ శశాంక



**రంగారెడ్డి జిల్లా,(వెలుతురు న్యూస్):**
ప్రతి ఓటరు ఓటు తప్పనిసరిగా హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ శశాంక సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రానున్న చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల నేపథ్యంలో స్వీప్ పై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఆయుధం అని, ఇప్పటికే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించ ుకోవాలని, 18 సం.లు నిండిన వారు విధిగా ఎపిక్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. చేవెళ్ళ పార్లమెంట్ నియోజక వర్గానికి చేవెళ్ళ, మహేశ్వరం, రాజేంద్ర నగర్, శేరిలింగంపల్లి, పరిగి, తాండూర్, వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఉంటాయని, అందులో ఎక్కువ నియోజక వర్గాలు అర్బన్ ప్రాంతంలో ఉన్నందున ఓటింగ్ శాతం తక్కువ నమోదు అవుతుందని తెలియజేశారు. ఈ ప్రాంతాలలో ఉన్న కళాశాల విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

ప్రజలలో చైతన్యం తెచ్చేందుకి 5కె రన్ నిర్వహించాలని, వాల్ పోస్టర్స్ ద్వారా, ప్రచారం చేయాలని అన్నారు. గ్రేటర్ కమ్యూనిటి రెసిడెన్షియల్ అసోసియేషన్ వారితో సమావేశాలు నిర్వహించి ఓటింగ్ శాతం పెంచాలన్నారు. మహిళా సంఘాల ద్వారా, విద్యార్థుల ద్వారా వారి కుటుంబాలలో ఓట్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణరెడ్డి, జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీలత, డీపీఓ సురేష్ మోహన్, డీఈఓ సుసింధర్ రావు, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీదేవి, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# కొత్తపేటలో నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు

**రంగారెడ్డి జిల్లా,(వెలుతురు న్యూస్):**
కొత్తపేటలో నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు సంబంధిత అధికారులను ఆదేశించారు.
గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కొత్తపేటలో నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్, మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులకు సంబంధించి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు








రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో చర్చించడం జరిగింది. ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్తపేట టీమ్స్ హాస్పిటల్ పనులను వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు, వైద్య ఆరోగ్య జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. టీమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్ అండ్ టి ఇంజనీర్స్ వివరించారు. నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను తనిఖీ చేసారు. హాస్పటల్ నిర్మాణ పనుల పురోగతి పై ఆరా తీస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సెక్రెటరీ ఆదేశించారు.

ఈ పర్యటనలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టీమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ విమల థామస్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, తహశీల్దార్లు జానకి, విజయలక్ష్మి, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# సంపాదకీయం..

## బిజెపికి దక్షిణాధిపత్యం సాధ్యమేనా?

దక్షిణ రాష్ట్రాల్లో పాగా వేస్తే తప్ప తాము కోరుకున్న 400 మార్కును దాటలేమని మోడీ ద్వయానికి బాగా తెలుసు. అందుకే వారు దక్షిణాది వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఉత్తరాదిలో రాముడు రక్షిస్తాడన్న ధీమా వచ్చేసింది. రామనామం ఉత్తరాదిలో ఊపేస్తోంది. అనన్య సాధ్యమైన అయోధ్య సాకారం అయ్యింది. దీంతో ఉత్తరాదిలో బిజెపికి తిరుగులేదన్న విధంగా పరిస్థితులు ఉన్నాయి. కానీ దక్షిణాది పరిస్థితి వేరు. కర్నాటక కూడా చేజారిపోయింది. తెలంగాణలో వచ్చిన అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నారు. ఇప్పుడేమో తెలంగాణలో 17 సీట్ల కోసం నానా తంటాలు పడుతున్నారు. అందుకే తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ ఎక్కువ కష్టపడు తున్నారు. దక్షిణాదిని ఈసారి గుప్పిట పెట్టుకోవాలని ఆయన పట్టుదలగా ఉన్నారని కనిపిస్తోంది. తమిళనాట అన్నాడిఎంకె దూరమైనా చిన్నాచితక పార్టీలతో జతకట్టారు. గవర్నర్‌గా ఉన్న తమిళసై మళ్లీ రాజకీయ అరంగేట్రం చేశారు. బిజెపిని ముందునుంచి ప్రజలు ఉత్తరాది పార్టీగానే గుర్తిస్తూ వచ్చారు. అయితే దానిని తిరగరాస్తూ కర్నాటకలో కాలుమోపారు. కానీ స్థానిక నాయకత్వం నిర్లక్ష్యం, అవినీతి కారణంగా మొన్నటి అసెంబ్లీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బిజెపి జాతీయవాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం యత్నిస్తోంది. భారతదేశంలో బిజెపి అంతటా విస్తరించిందని చెప్పుకోవడం కూడా అవసరం. అందుకే విజయం కోసం భారతీయ జనతాపార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. గత పదేళ్ల బిజెపి పాలనా కాలం తీసుకుంటే అన్ని రాష్ట్రాల్లో విస్తరించేందుకు చేయని ప్రయత్నం లేదు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా అభివృద్ధి, సెంటిమెంట్ ఎజెండాలను కలుపుకుని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈశాన్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధికి పెద్దపీట వేసింది. బెంగాల్ లోను, దక్షిణ రాష్ట్రాల్లో గెలుపు కోసం బూత్‌లెవల్ కార్యాచరణను అమలు చేస్తోంది. క్షేత్రస్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచుకోగలిగిన శక్తిని బీజేపీ ప్రదర్శిస్తోంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్తలు దండిగా ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారు అలుపెరగకుండా ప్రయత్నాలన్ని చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే కర్నాటకలో ఎత్తులు,పొత్తులతో అధికారం చేజిక్కించు కున్నారు. కర్ణాటక విజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2014లోనే ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో తగినంత ఉనికితో ఎప్పటి నుంచో సత్తా చాటుతోంది. గత పార్లమెంటు ఎన్నికలలో నాలుగు స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో తన ఉనికిని విస్తరించుకోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. అక్కడక్కడా ఉనికిలో ఉన్నప్పటికీ దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. బీజేపీకి, మోదీకి అదే అంతిమలక్ష్యంగా మారింది. అందుకే దక్షిణాదిపై ఎక్కువగా దృష్టి సారించారు. ఉత్తరాదిలో ఈసారి మరిన్ని సీట్లు పెరిగే అవకాశమున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఆ సంఖ్యను మరింత పెంచుకోవడం కోసం దక్షణాదిలో ప్రత్యేక ప్రయత్నం మొదలు పెట్టారని చెప్పాలి. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి పరిస్థితి ఆశాజనకంగా ఉంది. మోడీ వ్యక్తిగత ఛరిష్మా కూడా పనిచేస్తోంది. ఆ రెండు రాష్ట్రాల్లో గతం కంటే ఓట్లు,సీట్లు పెంచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కర్ణాటకలో ఇప్పటికే కాంగ్రెస్ పాలన మీద విముఖత కలిగిందన్న ప్రచారం మొదలయ్యింది. ఈ క్రమంలో అక్కడ పార్లమెంట్ సీట్లు అధికంగా వస్తాయని అంచనా వేస్తున్నారు. గతంలో ఉన్న బలాన్ని నిలుపుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి ఏర్పాటు కావడంతో అక్కడ విజయం సాధించడం ద్వారా కొంత మేలు కలిగే అవకావం ఉంది. ఈ కలయిక దీర్ఘకాలికంగా బీజేపీ విస్తరణ ప్రయత్నాలకు తోడ్పడగలదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభావం గణనీయంగానే పోరిగింది. ఇప్పుడది ఆ పార్టీకి కీలకమయిన విజయం అవుతుందని భావిస్తోంది. తెలంగాణలో అధికప్రభావం చూపగలిగితే కనుక, బీజేపీ వెంటనే రెండో స్థానానికి, అతి త్వరలో అధికారస్థానానికి చేరుకోగలుగుతుంది. తెలంగాణలో బలం పెంచుకోవడంతో పాటు ఆంధ్రాలో నాలుగు సీట్లు సంపాదించుకుంటే లక్ష్యం నెరవేరి నట్లే. నిజానికి తెలంగాణ బీజేపీకి ముందునుంచి అనుకూలంగానే ఉన్నా దానిని సక్రమంగా వినియోగించు కోవడంలో బిజెపి తప్పటడుగులు వేసింది. బీఆర్ఎస్‌లో కొందరిని, కాంగ్రెస్‌లో కూడా కొందరిని తమ వైపు తిప్పుకుని చక్రం తిప్పగల అవకాశం బీజేపీకి వస్తుంది. ఇకపోతే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా దక్షిణ భారతదేశంలో తమిళనాడుతో పాటు మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి మొదటి దశలో 42 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. తమిళనాడులో ఒకే దశలో ఎన్నికలు పూర్తి కానున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం తమిళనాడులోని 39 స్థానాలకు గాను డీఎంకే 24, కాంగ్రెస్ 8, సీపీఐ, సీపీఎం చెరో రెండు సీట్లు, వీసీకే, ఐయూఎంఎల్ ఒక్కో సీటు, అన్నాడీఎంకే ఒక్కో సీటు గెలుచుకున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో గౌరవప్రదమైన స్థాయిలో సీట్లు గెలవడంపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ప్రధానంగా తమిళనాడులోని 39 స్థానాల్లో మిత్రపక్షాలతో కలిసి పోటీ చేస్తుంది. ఈసారి కనీసం 5 నుంచి 10 స్థానాలు ఎన్డీయే కూటమి గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. తమిళనాడులో గత బీజేపీకి ప్రస్తుత బీజేపీకి పూర్తిగా తేడా కనిపిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతూ వస్తోంది. పాదయాత్రలతో పాటు.. డీఎంకే అవినీతిపై ఆయన ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు విడుదల చేశారు. దీంతో డీఎంకే సైతం బీజేపీని టార్గెట్ చేయడం మొదలుపెట్టింది. దీంతో డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పోరు.. డీఎంకే, బీజేపీగా మార్చేశారు అన్నామలై. ప్రధాని మోదీ సైతం తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. దీంతో తమిళనాడులో బీజేపీ ఏ మేరకు ప్రభావం చూపిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## ఆ తరవాత వచ్చేది ఇక కేజ్రీవాలే

ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై జైలు నుంచి సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన లేఖ రాశారు. ఇప్పటి వరకూ కవితను టార్గ్గెట్ చేస్తూ ఆయన ఎన్నో లేఖలు విడుదల చేశారు. కవితకు.. తనకు మధ్య జరిగిన ఛాటింగ్ వివరాలను సైతం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇన్నాళ్లుగా తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, రాజకీయ కక్ష సాధింపు అంటూ చెప్పినవన్నీ అబద్దాలని తేలింది. ఇన్నాళ్లకు నిజం బయటికొచ్చిందని.. చేసిన పనుల కర్మ ఫలం ఇప్పుడు వెంటాడుతోందని సుఖేష్ లేఖలో పేర్కొన్నారు. నిజం శక్తి ఏంటో తెలుసుకోవాలి. ఎదుర్కోవాల్సి ఉంటుంది. నన్ను ఎవరూ ఏమి చేయలేరని అనుకునేవారు. కానీ కొత్త భారతదేశంలో చట్టమే అన్నింటికన్నా శక్తివంతమైంది. నేను గతంలో మీడియాకు విడుదల చేసిన లేఖల్లో 2 అంశాలు పొందుపరిచాను. అందులో ఒకటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవుతుంది.. రెండోది తిహార్ క్లబ్‌లో చేరేందుకు కవితకు కౌంట్ డౌన్ మొదలైంది. ఈ రెండూ ఇప్పుడు నిజమయ్యాయని అనిపిస్తోంది. కవిత అరెస్టుతో అవినీతి పండోరా బాక్స్ ఓపెన్ అయింది. కవితతో పాటు ఆమె అవినీతి సహాయకులు, అవినీతి రాజు అరవింద్ కేజ్రీవాల్ చేసిన అక్రమాలన్నీ బయటపడతాయన్నారు. వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసి సింగపూర్, హాంగ్‌కాంగ్, జర్మనీ వంటి దేశాలకు పంపిన



విషయాలు బయటికొస్తాయి. ఇది ఎవరికి అర్థం కావాలో వారికి అర్థమైందని అనుకుంటున్నాను. అక్కా!..నేను వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్ల ద్వారా బయటపెట్టిన నెయ్యి డబ్బాల కథలు, రేంజ్ రోవర్ కలెక్షన్ కథలు, గోవా కథలు, కాంట్రాక్ట్ కథలు దర్యాప్తులో నిజమని తేలాయి. బయటపడే మార్గమే లేదు అక్కా. ఇప్పటికైనా నా విన్నపం ఒక్కటే.. అవినీతి సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ ను కాపాడేందుకు నిజాన్ని దాచే ప్రయత్నం చేయవద్దు. ఎందుకంటే ఈ దేశ ప్రజలు, న్యాయస్థానాలు నిజం తెలుసుకున్నాయి. ఇందుకు కావాల్సినంత సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నాయి. ఏదేమైనా ఈడీ, సీబీఐ కన్‌ఫ్రంటేషన్ లో భాగంగా మిమ్మల్ని త్వరలోనే ముఖాముఖి చూస్తాను అక్కా.. మా గ్రేటెస్ట్ తిహార్ జైలుకు స్వాగతం అక్కా.. మీ మరో సోదరుడు, అవితిని సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ మీకు జైల్‌లో లగ్జరీ జీవితం అందంచేందుకు అన్ని ఏర్పాట్లు చేసి ఉంటారు. ఈ లేఖను ముగించే ముందు మరొక్క మాట చెప్పదల్చు కున్నా.. 'సినిమా ఇంకా మిగిలే ఉంది'. కేజ్రీవాల్ జీ.. తదుపరి ఇక మీరే. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదు. సినిమా క్లైమాక్స్‌కు చేరుకుంది.

కేజ్రీవాల్ జీ.. నా సోదరసోదరీమణులకు తిహార్ క్లబ్‌కు స్వాగతం పలుకుతున్నాను' అని సుఖేష్ చంద్రశేఖర్ లేఖలో పేర్కొన్నారు.


# ముంచుకొస్తున్న రెడ్ సీ ఉపద్రవం

ప్రపంచ నౌకా వాణిజ్యంలో కీలకమైన ఎర్ర సముద్రం ద్వారా ప్రయాణం సాగించే వాణిజ్య నౌకలపై హూతీ తిరుగుబాటుదారుల దాడులు అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలను తీవ్రంగా కలవరపరుస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచాన్ని చుట్టుముట్టిన ఆర్థిక మాంద్యానికి తోడు సరకుల రవాణా వ్యవస్థను హూతీలు దెబ్బ తీయడం వల్ల ద్రవ్యోల్బణం మరింతగా విజృంభిస్తుందని ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. సంక్షుభిత గాజాపై ఇజ్రాయెల్ యుద్ధానికి ప్రతీకారంగా ఎర్ర సముద్రంలో దాడులు చేస్తున్నామని హూతీలు ప్రకటించారు. హూతీలను నిరోధించి ఎర్ర సముద్రం ద్వారా నౌకా రవాణాను సురక్షితం చేయడానికి అమెరికా, యుకె మిలిటరీ దాడులను ఉధృతం చేసినా హూతీలు వెనక్కి తగ్గడం లేదు.

ఎర్ర సముద్ర నౌకలపై దీర్ఘ కాల దాడుల ఫలితంగా ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆయిల్, గ్యాస్, బియ్యం, గోధుమలు వంటి నిత్యావసరాల ధరలు మరింతగా పెరిగి పేద దేశాల్లో ఆకలి చావులు కూడా సంభవిస్తాయని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అయినా పెద్దన్నలా వ్యవహరించే అగ్ర రాజ్యాలు గాజా సంక్షోభాన్ని పరిష్కరించడానికి బదులు హూతీలపై దాడులు చేయడం అగ్నికి ఆజ్యం పోయడమేనని వారు అంచనా వేస్తున్నారు. హూతీల దాడుల ఫలితం ప్రస్తుతం కొన్ని దేశాలకే పరిమితమైనా మున్ముందు భారత్‌తో సహా అన్ని దేశాలు పెరిగే ధరలతో సతమతంకాక తప్పదని ఆర్థికవేత్తలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నా పెద్ద దేశాల పాలకులు మేల్కోవడం లేదు. ప్రపంచ వాణిజ్యంలో కీలకమైన ఎర్ర సముద్రంలో ఇప్పటి దాకా 40 వాణిజ్య నౌకలపై దాడులు జరిగాయి.

ఈ దారిలో ఉద్యోగాలు చేయడమంటే ప్రాణాలతో చెలగాటమేనని నౌకల సిబ్బంది చెబుతున్నారు. నౌకల యజమానులు కూడా పెరిగిన కార్గో బీమా రేట్లతో ఎర్ర సముద్రం పేరు చెబితేనే వణికిపోతున్నారు. యూరప్, ఆసియా, ఆస్ట్రేలియాల మధ్య సూయజ్ కెనాల్, ఎర్ర సముద్రం ద్వారా ప్రయాణం దగ్గరి దారి అని ప్రపంచానికి తెలుసు. ఇలా కాకుండా మరో రూటులో ప్రయాణం మరింతగా ఖర్చులు పెంచుతుంది. ప్రపంచ వాణిజ్యంలో 15 శాతం నౌకాయానం ఎర్ర సముద్రం ద్వారానే జరుగుతుందంటే ఈ దారి ప్రాముఖ్యత ఏమిటో అర్థమవుతుంది. గడిచిన రెండు రోజులుగా హూతీ తిరుగుబాటుదారులు అమెరికా యుద్ధ నౌకలపై క్షిపణులు, డ్రోన్ల సాయంతో చేస్తున్న దాడులకు అమెరికా దళాలు ఎదురు దాడి చేసి డ్రోన్లను, క్షిపణులను ధ్వంసం చేశాయి. సోమవారం రాత్రి 'ఎంఎస్‌సి స్కై %××%' అనే వాణిజ్య నౌకపై కూడా హూతీలు భీకర దాడులు చేయడంతో సముద్రం మరింతగా ఎరుపెక్కింది.

ఆ నౌక సిబ్బంది సాయం కోరడంతో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ కోల్‌కతా ఎర్ర సముద్రానికి యుద్ధ



ప్రాతిపదికగా చేరుకొని నౌకలోని 23మంది సిబ్బందిని కాపాడారు. ఇలాంటి సంఘటనలు అక్కడ నిత్యకృత్యంగా మారాయి. హూతీల దాడుల కారణమో మరేమిటో తెలియదు గాని ఎర్ర సముద్రం అడుగున నిర్మించిన మూడు డేటా కేబుల్స్ తెగిపోయి అంతర్జాతీయంగా 25శాతం డేటా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడినట్లు టెలికం సంస్థలు ప్రకటించాయి. ప్రపంచంలోని దిగ్గజ సంస్థలైన అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి కంపెనీలు లక్షల కోట్లతో ఈ కేబుల్స్‌ను నిర్మించాయి. ప్రపంచ కమ్యూనికేషన్‌కు కీలకమైన ఇంటర్‌నెట్‌కు ఈ కేబుల్సే కీలకం. ఇటీవలి కాలంలో ఇంటర్‌నెట్ అంతరాయాలకు కేబుల్స్ తెగిపోవడం కూడా ఒక కారణంగా టెలికాం సంస్థలు చెబుతున్నాయి. హూతీల దాడుల ప్రభావం ఇలా బహుముఖంగా వుండడం కూడా ప్రపంచాన్ని కలవరపరిచే అంశంగా చెప్పవచ్చు.

ఇప్పటికే హూతీల దాడుల వల్ల ఒక ట్రిలియన్ డాలర్ల వాణిజ్యం దెబ్బ తిన్నదని అంచనా. దాడుల భయంతో కార్గో ఇన్సూరెన్స్‌ను కూడా కంపెనీలు 0.6 నుంచి 2 శాతానికి పెంచాయి. దీనివల్ల షిప్పింగ్ ఛార్జీలు కూడా 100 నుంచి 150 శాతం పెరిగాయి. ఎగుమతులు, దిగుమతుల వ్యయం పెరగడంతో అనేక దేశాల్లో నిత్యావసర వస్తువులతో పాటు వివిధ రంగాల వినియోగ వస్తువులు కూడా పెరుగుతున్నాయి. ఆర్థిక మాంద్యంతో ఉపాధి పోవడం, సరకుల ధరలు పెరగడంతో అన్ని వర్గాలకు జీవన వ్యయం భారంగా మారుతున్నది. యుద్ధాలను నివారించే ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలు ఎర్ర సముద్రం సంక్షోభానికి తాత్కాలిక పరిష్కారాలు కనుగొనే బదులు అసలు మూలాన్ని గుర్తించి ఆ దిశగా శాశ్వత పరిష్కార ఆలోచించకుంటే అన్ని దేశాలకు మున్ముందు ఆర్థిక గండాలే.

# సమగ్ర భూసంస్కరణలెప్పుడు?

వలస పాలనలో గ్రామీణ స్వయం పోషక రైతాంగ వ్యవసాయం విచ్ఛిన్నం ఫలితంగా రైతాంగ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, భూస్వామ్య విధానం, ధనిక రైతాంగ ఒక కొత్త వర్గంగా అభివృద్ధి చెందడం జరిగింది. ఈ పరిస్థితులు పెట్టుబడిదారీ వ్యవసాయం మొలకెత్తి వృద్ధి చెందడానికి, ఉత్పత్తి విధానం తగినంతగా మార్పు చెందకపోవడంతో పెట్టుబడిదారీ వ్యవసాయానికి బదులు సంకర రూపాలు ఏర్పడ్డాయి. వలస పూర్వపు రోజుల నుండి ఇప్పటి వరకు భారత వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన పరిణామాలను అధ్యయనం చేస్తే వ్యవసాయంలో మార్పులు సంభవించాయని చెప్పడం సరైందే. ఈ మార్పులను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధం అభివృద్ధి చెందినట్లు పొరపాటుగా భావించడం గతంలోనూ అనేక సార్లు జరిగింది. వ్యవసాయంలో సామ్రాజ్యవాద చౌరబాటును సులభతరం చేసేందుకు 1970లో భారత ప్రభుత్వం ప్రణాళికలు, బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా వ్యవసాయ రంగానికి కొన్ని వసతులు కల్పించింది. బడా భూస్వామ్య వర్గానికి నష్టం జరగకుండా గ్రామీణ, పట్టణాల్లో చర్యలు తీసుకుంది.

ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొనే పేరుతో బడా పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చింది. ఈ ప్రక్రియ ఉప ఉత్పత్తిగా మాత్రమే వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలకు కొంత దోహదపడింది. అయితే ఇది పెట్టుబడిదారీ వ్యవసాయాన్ని తీసుకుని రాలేకపోయింది. అనేక మంది వ్యవసాయ ఆర్థిక వేత్తలు ఈ వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధ పరిమితులను, వైఫల్యాలను గుర్తించడంలో విఫలమయ్యారు. భారత వ్యవసాయాన్ని సరిగా అధ్యయనం చేస్తే అందులో పెట్టుబడిదారీ అభివృద్ధి ప్రధాన ధోరణిగా గాని, పెరుగుతున్న ధోరణిగా లేదు. ప్రస్తుత సామ్రాజ్యవాదం వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను నయావలస పరివర్తన వైపుకి లాగుతున్నది. భారత దేశంలో ఉన్న దాని మిత్రవర్గాలతో కుమ్మక్కైన ఫైనాన్స్ పెట్టుబడి, ఆ మిత్రుల సహకారంతో వ్యవసాయ ఉత్పత్తులపై అంతకంతకూ ఎక్కువ ఆధిపత్యం చెలాయిస్తున్నది. హరిత విప్లవ ఆరాధకులు దీనిని చూడడంలో విఫలమవుతున్నారు.

పరిణామాల ఫలితాన్ని నిర్ధారించే నిర్ణయాత్మకశక్తి వర్గపోరాటం మాత్రమేనని, వర్గాలుగా విభజించబడిన సమాజ పరిణామ చరిత్ర చాటి చెబుతున్నది. సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ చౌరబాటుకు వీలుగా తెరుచుకొన్న నేటి భారత సామాజిక వ్యవస్థలో ఒక వైపుకు లాగుతున్నది. భారత అర్థ భూస్వామ్య విధానంలో ఇప్పటివరకు భూ సంబంధాల్లో మౌలికమైన మార్పులు చోటు చేసుకోలేదు. భూకేంద్రీకరణలో తీవ్ర అసమానతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దేశంలో 13.8%గా వున్న భూకామందుల వద్ద మొత్తం భూమిలో 47.3% భూమి ఉంది. 4.9%గా వున్న పెద్ద భూస్వాముల వద్ద మొత్తం భూమిలో 32% భూములు వున్నాయి. 84% గా ఉన్న చిన్న, సన్నకారు రైతులు 47% భూమిని మాత్రమే కలిగి




ఉన్నారు. వ్యవసాయ పరికరాల్లో కూడా తీవ్ర వ్యత్యాసం ఉంది. 25 ఎకరాలు పైబడిన కమతాలు గల ప్రతి 100 కుటుంబాలకు 38 ట్రాక్టర్లు ఉన్నాయి. 10 నుండి 25 ఎకరాల లోపు భూ కామందుల ప్రతి వంద కుటుంబాలు 18 ట్రాక్టర్లు వున్నాయి.

ఒక ఎకరం నుంచి 5 ఎకరాలు కలిగి ప్రతి 100 చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలు ఒక ట్రాక్టర్ మాత్రమే వున్నాయి. కోత మిషన్లు, నాట్ల యంత్రాలు సంపన్న భూకమతాల రైతులే కలిగి ఉన్నారు. బ్యాంకు రుణాలను కూడా వీరే అత్యధికంగా పొందుతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు ట్రాక్టర్లు, యంత్రాలు పొంద గలిగే పరిస్థితి లేదు. బ్యాంకు రుణాలు కూడా చాలా తక్కువ మంది పొందగలుగుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవసాయంలో భూమి కొద్ది మంది వద్ద పోగుబడి వేల ఎకరాల భూఎస్టేట్‌దారులుగా మారతారు. చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోయి భూఎస్టేట్లలో కూలీలుగా మారతారు. పంటలు ప్రజల అవసరాల కోసం కాకుండా వ్యాపార సరళిలో పండిస్తారు. ఏ పంట వలన ఎక్కువ లాభం వస్తుందో ఆ పంటనే పండిస్తారు. పంట అమ్మకాల ద్వారా వచ్చే మిగులును భూఎస్టేట్‌ను విస్తరించటానికి తిరిగి పెట్టుబడిగా మారుస్తారు. ఇదే పెట్టుబడిదారీ వ్యవసాయం. అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఉన్నది ఈ పెట్టుబడిదారీ వ్యవసాయమే.

సేద్యంలో వచ్చిన కొన్ని మార్పులను ఎవరూ నిరాకరించరు. రైతాంగం కుటుంబ అవసరాల రీత్యా మిగులు ఆదాయం కోసం పంట దిగుబడులను పెంచే ఆలోచన చేయడం, ఎరువుల వినియోగం పెంచడం, సేద్యంలో ట్రాక్టర్లు, కోత మిషన్లు, నాట్ల యంత్రాలు రావడం సేద్యంలో వచ్చిన మార్పులుగా వున్నాయి. ఈ మార్పులేవీ వ్యవసాయాన్ని పెట్టుబడిదారీ వ్యవసాయంలోకి మార్చలేకపోయాయి. భారత దళారీ బూర్జువా వర్గం పూర్తి చేయని బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని నేడు నూతన ప్రజాతంత్ర విప్లవం ద్వారా అర్ధ వలస, -అర్ధ భూస్వామ్య వ్యవస్థను సమూలంగా మార్చి, విప్లవ భూసంస్కరణల ద్వారా పేదలకు భూ పంపిణీ జరిగినప్పుడే, భూకేంద్రీకరణ బద్దలవుతుంది. సోషలిస్టు వ్యవస్థలో ఏర్పాటు అయ్యే సమష్టి వ్యవసాయ క్షేత్రాల ద్వారా మాత్రమే సేద్యం పారిశ్రామికవంతం అవుతుంది. అందుకోసం రైతాంగం ఉద్యమించాలి.

# సుప్రీం ఆదేశాలతో దారికొచ్చిన పతంజలి

తప్పుడు ప్రకటనల కేసులో కోర్టుకు సమాధానం చెప్పాలంటూ పతంజలి ఆయుర్వేదాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశించిన తరుణంలో కంపెనీ కీలక ప్రకటన చేసింది. సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడంతో పాటు బేషరతుగా క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి తప్పు చేయబోనని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ అన్నారు. బాబా రామ్‌దేవ్‌తో పాటు ఆచార్య బాలకృష్ణలు ఏప్రిల్ 2న స్వయంగా హాజరు కావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆదేశాలు ఉన్నప్పటికీ తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసినందుకు కోర్టు నోటీసు జారీ చేసింది. గతంలో జారీ చేసిన నోటీసులకు పతంజలి ఆయుర్వేదం ఎండీ ఆచార్య బాలకృష్ణ సమాధానం ఇవ్వకపోవడంపై జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టుకు ఇచ్చిన హామీని ప్రాథమికంగా ఉల్లంఘించినందుకు ఆయనపై ధిక్కార చర్యలు ఎందుకు ప్రారంభించకూడదని ప్రశ్నించింది. కొవిడ్ టీకాతో పాటు మెడిసిన్ల కు వ్యతిరేకంగా రామ్‌దేవ్ ప్రచారం నిర్వహిస్తున్నారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐఎంఏ ఆరోపించింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ క్రమంలో పతంజలి ఆయుర్వేద ఎండీ ఆచార్య బాలకృష్ణగురువారం సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారు. తమ కంపెనీకి చెందిన ఉత్పత్తులపై వచ్చిన వాణిజ్య ప్రకటనల కేసులో ఆయన సారీ తెలిపారు. తప్పుడు యాడ్స్ ఇస్తున్నారని పతంజలి సంస్థకు రెండు రోజుల





క్రితం సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది.

ఈ నేపథ్యంలో ఆ కంపెనీ సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేసింది. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ ఆషానుద్దిన్ అమనుల్లా ఆ కేసును వాదించారు. ఏప్రిల్ 2వ తేదీన కోర్టు ముందు హాజరుకావాలని బాలకృష్ణకు ఆదేశాలు జారీ చేశారు. అయితే కోర్టు ఆదేశాల పట్ల తనకు ఎనలేని గౌరవం ఉందని, తమ ఉల్లంఘనల పట్ల క్షమాపణలు చెబుతున్నట్లు అఫిడవిట్‌లో బాలకృష్ణ తెలిపారు.

భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు రాకుండా తమ కంపెనీ జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో
# వంగేటి ప్రభాకర్

**మేడిపల్లి, వెలుతురు:**
మేడ్చల్ లీగల్ సెల్ చైర్మన్ వంగేటి ప్రభాకర్ రెడ్డి..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం జూబ్లీ హిల్స్ క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణములో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**వెలుతురు న్యూస్ కల్వకుర్తి నియోజకవర్గం:**
కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం రావిచెడు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ శాసన సభ్యులు శ్రీ గుర్క జయపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు CL. శ్రీనివాస్ యాదవ్, కడ్తాల్ జడ్పిటిసి దశరథ్ నాయక్, ఎంపీటీసీ



బొప్పిడి గోపాల్, మాజీ ఎంపీటీసీలు వసంత, రంగయ్య, జోగు వీరయ్య,గంప శ్రీను , పి ఎ సి ఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, బాలకృష్ణ, లింగం ,శ్రీశైలం యాదవ్,కస్నానాయక్ భాస్కరరావు, రమేష్, రాజేందర్ యాదవ్,లింగం,రవి,కృష్ణ,సాయి తదితరులు పాల్గొన్నారు..

## మృతురాలు కుటుంబానికి బియ్యం అందచేత

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:**
సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన దొడ్డి గోపమ్మ ఆకస్మాతుగా మరణించడం జరిగింది..వారి దశదినకర్మ కు జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



ముద్దంగుల నర్సింహ మృతిని కుటుంబ సభ్యులకు క్వింటల్ బియ్యం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంచాల నర్సింహా, మాజీ వార్డ్ మెంబర్ మంచాల యేసు ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంచాల మల్లయ్య ,సాతిరి రమేష్,సాతిరి గణేష్ ,దొడ్డి మధు, దొడ్డి దీపక్ తదితరులు పాల్గొన్నారు..

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కలిసిన మర్రిబావి తండా కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:**
సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని మర్రిబావి తండా,గ్రామస్తులు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,ని వారి నివాసంలోని కలిసి గ్రామం లోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నీటి సమస్యల గురించి తెలియజేశారు.ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి వెంటనే నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెగావత్ రాజు,గ్రామ శాఖ ధర్మానాయక్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,శ్రీను నాయక్,సభవాత్ నాయక్,సేవా నాయక్,శ్రీధర్ నాయక్,రాజేందర్ నాయక్,తదితరులు,పాల్గొన్నారు.



## వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మోడీకి
# పోటీ ఎవరో కనిపించడం లేదు

### చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**శంకర్‌పల్లి మార్చి 21 (వెలుతురు):**
చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం శంకర్పల్లి మండలం సంకేపల్లి గ్రామంలో వివిధ పార్టీల నుండి మాజీ సర్పంచ్లు, ఉప సర్పంచ్ లు వార్డు మెంబర్లు భారతీయ జనతా పార్టీలోకి పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలోకి చేరడం జరిగింది.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి ఎన్నికల్లో ప్రతిపక్షాల నుండి పోటీపడే నాయకుడే కనపడటం లేదు అని అన్నారు. దేశ భద్రత విషయంలో ఎప్పుడు కూడా రాజీపడని నేత మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు.

సమాజంలో గొప్ప మార్పు తెచ్చిన వ్యక్తి నరేంద్ర మోడీ. నూటికి నూరు శాతం బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం స్వచ్ భారత్ దిశగా అడుగులు వేయించిన నాయకుడు. ఇప్పుడు జనమందరికి తెలిసింది.

5 కిలోల ఉచిత బియ్యం, ఎరువుల సబ్సిడీ, గ్రామాల్లో జరిగిన ప్రతి అభివృద్ధి పని కేంద్రం ప్రభుత్వం ద్వారా జరిగినవే అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాములు గౌడ్.



రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి, జాయింట్ కన్వీనర్ సింగాపురం రమేష్, సీనియర్ నాయకులు సంకెపల్లి పరమేశ్వర రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఇందిరా లక్ష్మణ్, చేకుర్త కృష్ణ రెడ్డి, నారగుడేం నర్సింహా రెడ్డి, యువ నాయకులు వైభవ్ రెడ్డి, మరియు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు హాజరు అయినారు.



## ఝరసంఘం మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకుల
# విస్తృతస్థాయి సమావేశం

### ముఖ్య అతిధులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్

**జహీరాబాద్, 21 మార్చి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరసంఘం మండలంలోని వాసవి కళ్యాణ మండపంలో బి ఆర్ ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, జహీరాబాద్ బి అర్ ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం, మాజీ ఆత్మ చైర్మన్ పెంట రెడ్డి పాల్గొన్నారు. వారికి మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి వారి ఆలయం దర్శించి ,ప్రత్యేక పూజలు



చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాణిక్ రావు మండల పార్టీ ముఖ్య నాయకులకు జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ను పరిచయం ఉదేశించి మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్ నిజస్వరూపం తెలిసిపోయిందని అన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఎలాయితే నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా రాత్రి అనకా పగలు అనక కష్టపడి పనిచేసి విజయం సాధించామో అలాగే వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ని భారీ మెజారిటీ తో గెలిపించిబి ఆర్ ఎస్ అధినేత కెసిఆర్ కి కానుకగా అందిదాం అని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటేశం, జెడ్పీటీసీ వినీల నరేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్, మాజీ ఆలయ చైర్మన్ నర్సింహ గౌడ్, సీనియర్ నాయకులు ప్రభు పటేల్,జి నర్సింలు, వెంకట్ రెడ్డి, శంకర్, అజీం మైనారిటీ ఎల్గొయి, మాజీ సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు జగదీష్, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు హాఫీజ్, కొల్లూరు రాజు, బర్దిపూర్ రాజు, సొసైటీల చైర్మన్ లు డైరెక్టర్ లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ మృతికి కారణమైన ఆర్ఎంపి డాక్టర్ గఫర్‌పైన
# క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలి

### సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై మహేందర్ డిమాండ్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
ఈ సందర్భంగా సిపిఐఎంఐ న్యూడెమోక్రసీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి వైమహేందర్ డి ఎం హెచ్ ఓ ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది అనంతరం ఆయన మాట్లాడుతూపరిగి పట్టణ కేంద్రంలో యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ గఫర్ వద్ద శ్రీనివాస్ అనే యువకుడు చాతిలో నొప్పి అని చెప్పగా వైద్యము చేసి ఎక్కువ మోతాదులో మందు ఇచ్చిన ఐదు నిమిషాలలో యువకుడు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందడం జరిగింది ఆర్ఎంపీ తన పరిధిని మించి వైద్యం చేయడం వల్లనే శ్రీనివాసు మృతి చెందడం జరిగింది గతంలో కూడా గఫర్ వైద్యం వికటించి ఒక మహిళ మృతి చెందడం జరిగింది. వరుస మరణాలు సంభవిస్తున్న యధావిధిగా కొనసాగుతున్న సుపత్రి యాసీన్ ఫస్ట్ఎయిడ్ సెంటర్‌ను సీజ్



చేసి ప్రజల మరణాలకు కారణమవుతున్న గఫర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకొని శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని అన్నారు కార్యక్రమంలో సిపిఐఎంఐన్యూ డెమోక్రసీ నాయకులు రాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఐఎన్టియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా సైదులు

**వెలుతురు హైదరాబాద్ మార్చ్ 21, 2024:**
నల్లగొండ జిల్లా కు చెందిన వడ్డెబోయిన సైదులు ను ఐ ఎన్ టి యు సి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్దారం హైదరాబాద్ లోని రాష్ట్ర కార్యాలయంలో నేడు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష పదవి స్వీకరించటం సంతోషంగా ఉందని సైదులు అన్నారు. కార్మిక కుటుంబం నుండి వచ్చిన తనను రాష్ట్ర కమిటీ గుర్తించి ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదములు తెలిపారు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా అనేక మంది కార్మికులకోసం, కర్షకుల కోసం అనేక సంఘాలలో పనిచేసి వారి సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేసిన పరిజ్ఞానం సమస్యలలో ఉన్న వారిని రక్షించటంతో పాటు, కాంగ్రెస్ పార్టీకి లబ్ది చేకూరే




విధంగా పనిచేసే గత అనుభవం కూడా కలిసి వస్తుందని ప్రగాఢ నమ్మకంతో ఎటువంటి గడ్డు పరిస్థితులనైనా ఎదురుకొనే అనుభవం అనేక స్వచ్ఛంద కార్యక్రమాలతో ప్రజలతో మమేకం అవ్వటంలో ప్రధాన పాత్ర పోషించిన అనుభవం ఇప్పుడు నాకు కలిసి వచ్చే అంశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోరింగ్ శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ్యాతరి సుదర్శన్, మహిళా విభాగం అధ్యక్షులు శరణ్యా రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్మదా రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు మేరావత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల ఆరోగ్యమే మా లక్ష్యం

## మహిళకు ఎల్ఓసీ అందించిన తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడిపల్లి వెలుతురు:**
పేదల ఆరోగ్యమే తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం నాడు ఎన్. ఐ. ఎన్ కాలనీ, ఘట్కేసర్ కి చెందిన మాజుల్ సమాద్ అనారోగ్య సమస్యల కారణంగా ఆస్పత్రిలో చికిత్స కోసం జాయిన్ కావడంతో అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు గుండెకు శస్త్ర చికిత్స చేయాలని అనడంతో వారు వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితులలో ఉండడంతో దానికి స్పందించిన బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పడతం లోకేష్ కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకు వెళ్ళడంతో ముఖ్యమంత్రి కార్యాలయం నుండి రూ.80000/- మంజూరు చేయడంతో అతనికి విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతని తల్లి మాట్లాడుతూ తన కొడుకుకి అవసరమైన చికిత్స అందించిన ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నాడు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మంజూరైన లేటర్ తన కుటుంబ సభ్యులకు అందించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి, కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్, విశ్వం గుప్త పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన

# కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్ రెడ్డి

**జహీరాబాద్, 2, మార్చి, వెలుతురు :**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్ మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్ రెడ్డి వారి స్వగృహంలో గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకొని రాష్ట్ర ఫిలిం డెవలప్ మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించినందుకు



కృతజ్ఞతగా వారిని శాలువాతో సత్కరించారు.

ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రివ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసిరి సీతక్క, వేం నరేందరష రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వెడ్మ బొజ్జు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా

# జైపాల్ నాయక్‌ను గెలిపించండి

### - కళాశ్రీ భిక్షనాయక్

**జహీరాబాద్, 21 మార్చి, వెలుతురు :**
జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఉమ్మడి మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు, తెలంగాణ ఉద్యమకారులు జైపాల్ నాయక్, ఎంపీ గా పోటీ చేయనున్నారని కళాకారులు కళాశ్రీ భిక్షు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారా



గిరిజన జాతి కోసం అహర్నిశలు కృషి చేసే నాయకుడు జైపాల్ నాయక్ అని కొనియాడారు. రాబోయే జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలోని ఆందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జూక్కల్, కామారెడ్డి ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటును జైపాల్ నాయక్ కు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజప్తి చేశారు.



**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:**
గురువారం రోజున హిమాయత్ నగర్ డివిజన్లోని ఓల్డ్ కామేలాలో నడుస్తున్న శివరాజ్ పైప్లైన్ పనులకు కారణంగా తాగునీరు పైపు పగిలి కొన్ని రోజులుగా నీరు రావట్లేదని బస్తీ వాసులు కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ కి ఫోన్ చేసి తెలియజేయడంతో ఆమె హుటా హుటిగా అక్కడికి వెళ్లి కాంట్రాక్టర్ మరియు అధికారులతో మాట్లాడి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్, మహేష్, జగదీష్, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోని NIRD&PRలో గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్‌లో కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ స్కోపింగ్ వర్క్‌షాప్ విజయవంతంగా జరుగుతోంది



**హైదరాబాద్ వెలుతురు 21-మార్చి-2024:**
నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (NIRD&PR) మార్చి 21-22, 2024 నుండి రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (RD&PR)లో ఏఐ రెండు రోజుల అంతర్జాతీయ స్కోపింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. గ్రామీణాభివృద్ధి మరియు పంచాయితీ రాజ్‌కు అంకితమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడానికి వర్క్‌షాప్ ఒక వేదికగా పనిచేస్తుంది. ఈ సహకార ప్రయత్నం వాటాదారులను నిమగ్నం చేయడం మరియు RD&PR కార్యక్రమాలలో వివిధ నేపథ్య రంగాలపై దృష్టి పెట్టడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. కీనోట్ సెషన్‌లు మరియు ప్యానెల్ చర్చలను కలిగి ఉన్న ఈ వర్క్‌షాప్ వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య, పథకం అమలు, ఆడిట్ ప్రక్రియలు మరియు గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక అంశాలలో ఏఐ అప్లికేషన్‌లతో సహా కీలకమైన నేపథ్య రంగాల్లోకి ప్రవేశించింది. USA, బెల్జియం మరియు భారతదేశానికి చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు మరియు విధాన నిపుణులతో సహా ప్రఖ్యాత జాతీయ మరియు అంతర్జాతీయ నిపుణులు ఈ కార్యక్రమంలో తమ అంతర్దృష్టులు మరియు నైపుణ్యాన్ని పంచుకున్నారు. వారి సహకారం RD&PRలో ఏఐ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభివృద్ధికి సిఫార్సులను రూపొందిస్తుంది. అదనంగా, వర్క్‌షాప్‌లో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, అధ్యాపకులు మరియు విద్యార్థి సంఘాల నుండి సుమారు 30 మంది విద్యా నిపుణులు చురుకుగా పాల్గొనడం, నిపుణుల ప్యానెల్‌లతో పాటు చర్చలను సుసంపన్నం చేయడం జరిగింది. NIRDPR డైరెక్టర్ జనరల్ డాక్టర్. జి. నరేంద్ర కుమార్ ఐఏఎస్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు, కార్యాచరణ సామర్థ్యం, ప్రభావం మరియు జవాబుదారీతనం మెరుగుపరచడానికి RD&PRలో ఏఐ యొక్క కీలక పాత్రను నొక్కిచెప్పారు, చివరికి మెరుగైన సేవా బట్వాడా మరియు ప్రజల విశ్వాసాన్ని పెంచారు. అలాగే, డాక్టర్ చంద్ర శేఖర్ కుమార్, ఐఏఎస్ , అదనపు కార్యదర్శి, MoPR, పంచాయత్ రాజ్ సిస్టమ్స్‌లో ఏఐ ప్రాముఖ్యతను ప్రస్తావించారు. ప్రకాష్ కుమార్, ఐఏఎస్ (Rtd), వాధ్వాని సెంటర్ సీఈఓ , Dr. E.G. రాజన్, పెంటగ్రామ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మరియు ప్రొఫెసర్ కేఏస్ . రాజన్, ఐఐఐటి హైదరాబాద్, ప్రొఫెసర్ & రిజిస్ట్రేటర్, ప్రొఫెసర్ రవీంద్ర S. గావలి, ప్రొఫెసర్ NIRDPR వివిధ సాధనాలు & నమూనాలను ప్రదర్శించారు మరియు RD&PRలో ఏఐ యొక్క ఆవశ్యకతను హైలైట్ చేశారు. డాక్టర్ ఎం.వి. రవిబాబు, అసోసియేట్ ప్రొఫెసర్ & హెడ్, సెంటర్ ఫర్ ఐసీటీ. కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

మరింత సమాచారం కోసం, దయచేసి సంప్రదించండి: డా.ఎం.వి.రవిబాబు అసోసియేట్ ప్రొఫెసర్ & హెడ్ (i/c) ఐసీటీ కోసం కేంద్రం, NIRDPR మొబైల్: 9441900326

# రమ సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి కన్వీనర్‌గా చీదర వీరన్న నియామకం

**తొర్రూర్ వెలుతురు:**
తొర్రూర్ పట్టణ కేంద్రంలోని మహబూబాద్ రోడ్‌లో గల కే వి బి నగర్ లో ఉన్న శ్రీ హరి హర క్షేత్రం ఆలయ ప్రాంగణంలో నెలకొని ఉన్న శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి కన్వీనర్ గా చీదర వీరన్న ను నియమించినట్లు బుధవారం హరిహర క్షేత్ర ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు దారం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా చీదర వీరన్న మాట్లాడుతూ తనపై నమ్మకంతో కన్వీనర్ బాధ్యతను అప్పజెప్పినందుకు విశ్వాసంతో భక్తిశ్రద్ధలతో అందరినీ కలుపుకొని పోయి ఆలయ అభివృద్ధి కొరకై కృషి చేస్తానని అన్నారు. అంతేకాకుండా నన్ను నియమించిన ఆలయ బాధ్యులు, దారం ప్రసాద్, పదవి రావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉసిరి చెట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు అనంతరం దారం ప్రసాద్ మాట్లాడుతూ తొర్రూర్ పరిసర ప్రాంతంలో మొదటిసారిగా ఆలయ ప్రాంగణంలో రమా సత్యనారాయణ స్వామి ఆలయమును ఏర్పాటు చేశామని స్వామి వారి వ్రత పర్వదినం కార్తీక శ్రావణమాసంలో భక్తులు వ్రతములు పూజలు చేసుకుని స్వామివారి కృపకు పాత్రులు కావచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాంతాల సోమిరెడ్డి, వల్లపు మధు, వనమాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ చంద్రమౌళికి గౌరవ డాక్టర్ ప్రధానం

**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:**
అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా ప్రముఖ కవి విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళి కీ ఫ్రెండ్షిప్ మినిస్ట్రీ వారు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు రామకృష్ణ చంద్రమౌళి సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన దాశరథి రంగా చార్యులు లాగా ప్రజల వైపు ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తి. ముఖ్యంగా ఈయనలో కనిపించిన మంచి గుణాలు. ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకునే స్వభావం కలిగిన మనిషి. చిన్నతనం నుండే కవితలు రాయడం పాటలు రాయడం ఈయన దినచర్య వారు రాసిన కవితలు ఆ రోజుల్లోనే ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి తదితర పత్రికల్లో అచ్చుయ్ వచ్చేవి.

తన 50 సంవత్సరాల సాహితీ జీవితంలో చంద్రమౌళి చంద్రికలు చంద్రమౌళి భారతం రెండు పుస్తకాలు వచ్చాయా ఈ రెండు పుస్తకాలు సాహితీ లోకంలో అందరి ఆదరణ పొందిన పుస్తకాలు ఇలాంటి మంచి సేవ కార్యక్రమాలు చేసినందుకుగాను సాహిత్య సేవ కానీ సమాజసేవ కానీ సామాజిక స్పృహగాని పరిసరాల పట్ల గాని జంతువుల పట్ల పక్షుల పట్ల దయ కలిగిన వ్యక్తి ఇలాంటి వ్యక్తికి వారు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం చాలా సంతోషకరం ఈ డాక్టర్ అవార్డు అందుకున్న రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ నా పైన మరింత బాధ్యత పెరిగిందని సమాజం పట్ల సాహిత్యం పట్ల బాధ్యతతోమెలుగుతానని ఆయన పలికారు.



నల్లకుంటలో శ్రీధర్ ప్లాజాలో వారి కుటుంబ సభ్యులు నైబర్స్ అందరూ కలిసి రామకృష్ణ చంద్రమౌళి యొక్క గొప్పతనాన్ని కొని యాడారు. మా మధ్యలో ఉంటూ మా అపార్ట్మెంట్లో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు సాయితీ సేవలు సమాజ సేవలు చేసుకుంటూ మా మధ్యలోనే ఉంటూ ఈరోజు గౌరవ డాక్టరేట్ అందుకోవడం ఎంతో సంతోషమని వారు ఆనందం వ్యక్తి చేశారు.

## హైదరాబాద్ జిల్లాలోని ఆయుష్ క్లినిక్, పాలిక్లినిక్, హాస్పిటల్స్

# తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి...

### జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి

**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:**
హైదరాబాద్ జిల్లా పరిదిలో నిర్వహిస్తున్న ఆయుష్ క్లినిక్కులు, పాలిక్లినిక్కులు, హాస్పిటల్స్, కూడా అల్లోపతి క్లినిక్కులు, హాస్పిటల్స్ మాదిరిగా తప్పనిసరిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు G.O.MS No. 64 తేదీ 14-06-2024 మరియు తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ Rc No Spl/CEA/DPH & FW/2024 తేదీ 28 -02 - 2024 ప్రకారము ఆయుష్ అనగా ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హెూమియో క్లినిక్కులు, పాల్లి క్లినిక్కులు, హాస్పిటల్స్ , జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి) నుండి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డాక్టర్. వెంకటి తెలిపారు. ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హెూమియో వైద్యంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తెలంగాణ ప్రభుత్వ బోర్డు అఫ్ ఇండియన్ మెడిసిన్ , పాసుపోర్టు ఆఫీస్ వెనుక, సికింద్రాబాద్ నందు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకొనడానికి అర్హులు. ఆ రిజిస్ట్రేషన్ సర్టిపికెట్లు కలిగి వున్నవారు



మాత్రమే జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారికి రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్. వెంకటి తెలిపారు.

దరఖాస్తు ఫారం లో పేర్కొన్న అన్ని సర్టిఫికెట్లను జతపరిచి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయము, హైదరాబాద్ జిల్లా, పాట్నీ, సికింద్రాబాద్ నందు దరఖాస్తులు సమర్పించిన యెడల, 10 పని రోజులలో ఆయా సెంటర్స్ లకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను జారీ చేస్తామని, తదుపరి జిల్లా అధికారిక వెబ్సైటు www. hyderabad.telangana.gov.in ప్రదర్శిస్తామని, అదే విదంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయము, హైదరాబాద్ జిల్లా నోటీసు బోర్డులో ఉంచుతామని, ఆయా క్లినిక్స్ , పోలీక్లినిక్కులు, హాస్పిటల్స్ పై ఏమైనా పిర్యాదులు ఉన్నట్లయితే 45 రోజులలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారికి తెలియపర్చవలెనని, పిర్యాదులు లేనట్లయితే 45 రోజులలో తనిఖీ బృందాలతో తనికీ చేయించి, నివేదిక అందిన తర్వాత పర్మనెంట్ రిజిస్ట్రేషన్ (5 సంవత్సరాలకు) సర్టిఫికెట్లు జారీ చేస్తామని Dr వెంకటి తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారము ప్రతి క్లినిక్, పోలీక్లినిక్కులు, హాస్పిటల్స్ , మరియు దయాగ్నొస్టిక్ సెంటర్ అల్లోపతి కానీ ఆయుష్ కానీ తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేనిచో క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డాక్టర్ వెంకటి తెలిపారు.

# ఆయన ఏమైనా బందిపోటా?

- పార్టీలో చేరుకుంటే అక్రమ కేసులు
- అధికారం ఎవరికి శాశ్వతం కాదు
- ప్రజాపాలన గాలికి
- ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి శిక్ష వేస్తాం
- పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు



**హైదరాబాద్, (వెలుతురు):** ప్రజలకు సేవ చేయడం కంటే ప్రతిపక్షాలను వేదించడమే కాంగ్రెస్ పని అయిపోయింది. పార్టీలో చేరుకుంటే అక్రమ కేసులు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనని గాలికి వదిలేసింది. అక్రమ కేసులు పెట్టి ఎమ్మెల్యే లను గుంజుకునే ప్రయత్నం చేస్తుంది. వందలమంది వెళ్లి మూడు గంటలకు అరెస్ట్ చేయాల్సిన అవసరం ఎం వచ్చింది.

ఆయన ఏమైనా బందిపోటా? ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వ కుండా ఎలా అరెస్ట్ చేశారు? అధికారం ఎవరికి శాశ్వతం కాదు అన్న విషయాన్ని పోలీసులు గుర్తు పెట్టుకోవాలి. బెయిల్ వచ్చే సెక్షన్లతో కేసులు ఉన్న ఏదో ఒక రకంగా జైలుకు పంపాలని చూస్తున్నారు. బెదిరించి, లొంగ దీసుకుని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలి అనుకుంటున్నారు.

ప్రజలకి సేవ చేయడానికి మీకు అవకాశం ఇచ్చారు. మంత్రి ఆదేశాలతో మేము దాడులు చేస్తున్నామని స్వయంగా ఆర్డీఓ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు అక్కడ క్రషర్లు ఉన్నాయి. వాటికి పర్మిషన్ లేకున్నా లీజ్ అయిపోయినా నడుస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తూ ఇదంతా చేస్తున్నారు. ఇప్పటికి మూడు కేసులు పెట్టారు.

ప్రజా సమస్యలు గాలికి వదిలేశారు. గ్రామాల్లో తాగు నీరు రావట్లేదు.. పంటలు ఎండి పోతున్నాయి, ఇవి పట్టించుకోరు. ప్రతిపక్షాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంలో న్యాయ పోరాటం చేస్తాం. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి శిక్ష వేస్తాం. మా పార్టీ నాయకుల మెడపై కత్తి పెట్టి కాంగ్రెస్ లోకి రావాలని బెదిరిస్తున్నారు. పార్టీ మారక పోతే అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారు, ప్రలోభాలకు గురి.చేస్తున్నారు.



## కేంద్రానికి ఎన్నికల సంఘం షాక్

- వాట్సాప్‌లో 'వికసిత్ భారత్' సందేశాలు వద్దు

**హైదరాబాద్, (వెలుతురు):** వాట్సాప్‌లో 'వికసిత్ భారత్' సందేశాలను పంపడం ఆపి వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గత పదేళ్లలో కేంద్రం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ 'వికసిత్ భారత్ సంపర్క్' పేరిట కేంద్రం వాట్సాప్ లో ఓ మెసేజ్ పంపుతోన్న సంగతి తెలిసిందే.

## రైలు టికెట్లు కొనడానికీ డబ్బుల్లేవ్

- రాహుల్ గాంధీ ఆవేదన



**హైదరాబాద్, (వెలుతురు):** కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఈ రోజుల్లో అకౌంట్లు పని చేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో మీకు తెలుసు.. ఎలాంటి లావాదేవీలు చేయలేని పరిస్థితి.. ఎన్నికల వేళ ప్రచారం కోసం ప్రకటనలు ఇవ్వలేక పోతున్నాం. మా నేతలను ఎక్కడికీ పంపించలేక పోతున్నాం.. విమాన ప్రయాణాలు పక్కన బెట్టండి.. కనీసం రైలు టికెట్లు కొనడానికీ కూడా మా వద్ద డబ్బుల్లేవ్ అని రాహుల్ గాంధీ తెలిపారు.

# మోదీ మళ్లీ గెలవాలి

- మోదీతోనే భారత్ కు ప్రపంచస్థాయి గుర్తింపు:
- మెక్ ఇన్ ఇండియాతో చైనా ఉత్పత్తులకు చెక్ పడింది
- భారత్ ఎదుగుదలపై చైనా, పాకిస్తాన్ కుట్ర చేస్తున్నాయ్
- అంతర్జాతీయ స్థాయిలో అనేక శక్తులు మోదీకి వ్యతిరేకంగా పని చేస్తున్నాయి
- వాటిని ఓడించాలంటే ప్రతి ఒక్కరూ ఓటింగ్ లో పాల్గొనాలి
- అభివృద్ధి, సుస్థిర పాలన కోసం మరోసారి మోదీని గెలిపిద్దాం
- తెలంగాణలో 17 సీట్లలో బీజేపీ అభ్యర్థులను ఆదరించాలి
- బాగ్ అంబర్ పేట్ డివిజన్ బస్తీ పర్యటనలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, (వెలుతురు):** ప్రపంచస్థాయిలో భారత్ గౌరవం మరింత పెరగాలంటే ప్రధానిగా మోదీ మళ్లీ గెలవాలని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ జి.కిషన్ రెడ్డి తెలిపారు. గత పదేండ్ల మోదీ పాలనతోనే దేశానికి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు వచ్చిందని అన్నారు. మెక్ ఇన్ ఇండియా కార్యక్రమంతో చైనా ఉత్పత్తులకు చెక్ పడిందని, ఇప్పుడు ఆ దేశం.. పాకిస్తాన్ తో కలిసి మోదీ గెలవకుండా కుట్ర చేస్తున్నాయని గుర్తు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక శక్తులు మోదీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ ఓటింగ్ లో పాల్గొనాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ మేరకు గురువారం ఆయన బాగ్ అంబర్ పేట డివిజన్ లో బస్తీ పర్యటన చేశారు. అనంతరం సీఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. "సుమారు14 పార్టీలతో దేశంలో ఎన్డీయే కూటమి ఏర్పడింది. నిన్న తమిళనాడులో ప్రాంతీయ పార్టీలను కలిసి మాట్లాడి ఎన్డీయే కూటమిలోకి ఆహ్వానించాను. వచ్చే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి. అమెరికా లాంటి అగ్రదేశాలు కూడా కష్టం వచ్చినప్పుడు నరేంద్రమోదీని సంప్రదిస్తున్నాయి.

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మోదీని కలిసి రష్యా - ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఏదో రకంగా ఆపాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచానికి ఒక నాయకుడిగా, దేశానికి ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో ఎక్కడా కూడా కనిపించని దేశం నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాలను శాసించే స్థాయిలో ఉందని పాక్, చైనా దేశాలు సహించలేకపోతున్నాయి. మేక్ ఇన్ ఇండియాతో చైనా వెనకబడిపోయింది. ఆ కారణంగా చైనా దేశం భారత్ మీద కక్ష గట్టి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడించాలని కుట్రలు చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో మీ కాలనీలో ఎక్కువ ఓటింగ్ జరగాలి"అని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు

### మార్పు కనిపిస్తోంది..

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నరేంద్ర మోదీ నాయకత్వంలో మొదటిసారి దేశంలో మార్పు కనిపిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. "దేశ అభివృద్ధి, దేశ గౌరవాన్ని వ్యతిరేకించే శక్తుల ఓట్లు ఎక్కువ పోలయ్యే అవకాశం లేకపోలేదు. దాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు దేశం కోసం, అభివృద్ధి కోసం, దేశ గౌరవం కోసం, ఆధ్యాత్మికం కోసం పోలింగ్‌లో పాల్గొనాలి. అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ ఆలయం, రాష్ట్రంలో కూడా అనేక దేవాలయాలను అభివృద్ధి చేసుకుంటున్నాం.

పేదవారి సంక్షేమం కోసం నరేంద్రమోదీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోంది. పేదవారి ఇంట్లో టాయిలెట్ల నిర్మాణం నుంచి మొదలు చంద్రయాన్-3 వరకు అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతోంది. త్రిపుల్ తలాక్ రద్దు చేసి దేశంలోని10 కోట్ల ముస్లిం మహిళలకు విముక్తి కల్పించారు. హైదరాబాద్ నుంచి 4 వందే భారత్ రైళ్లను మోదీ కల్పించారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, చర్లపల్లి రైల్వే స్టేషన్లను ఆధునీకరణ చేస్తున్నాం. కేంద్రప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి నన్ను, నరేంద్రమోదీని ఆశీర్వదించాలని కోరుతున్న"అని అన్నారు.

### 400 సీట్లు లక్ష్యం

దేశంలో లోక్ సభ ఎన్నికలకు నగారా మోగిందని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఈ ఎన్నికలు దేశం కోసం జరిగే ఎన్నికలని, నరేంద్ర మోదీకి ఎంత మెజారిటీ వస్తదో నిర్దేశించే ఎన్నికలని తెలిపారు. "ప్రస్తుతం దేశంలో భారతీయ జనతా పార్టీకి 302 స్థానాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో 370 సీట్లు వస్తాయని అంచనా. ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. మాకు పూర్తి విశ్వాసం ఉంది. దేశంలో గతంలో ఎన్నడూ లేని మెజారిటీని దేశ ప్రజలు మోదీకి ఇవ్వబోతున్నారు.

దేశంలో శాంతి భద్రతలు కాపాడటం కోసం, దేశంలో సుస్థిర మైన ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం మోదీ నాయకత్వంలో నీతివంతమైన ప్రభుత్వం మళ్లీ రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారు. దేశ గౌరవాన్ని పెంచాలంటే, పేద ప్రజలకు సంక్షేమం అందాలంటే, దేశంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలంటే మోదీ మళ్లీ రావాలని140 కోట్ల మంది ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

ప్రపంచ దేశాల ముందు దేశ గౌరవాన్ని పెంచిన వ్యక్తి నరేంద్రమోది. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఆయన ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించి 17కు 17సీట్లు గెలిపించి, దేశంలో మూడవసారి నరేంద్రమోదీ నాయకత్వంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో భాగస్వాములను చేయాలని కోరుతున్న"అని కిషన్ రెడ్డి కోరారు.

## నిఫ్ట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల..

**న్యూఢిల్లీ మార్చ్ 21(వెలుతురు):** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైనింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. దేశ వ్యాప్తంగా 60 నగరాల్లోని 72 సెంటర్లలో ఫిబ్రవరి 5వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన ఫలితాలు విడుదల చేసి, స్కోర్ కార్డులను ఎన్‌టీఏ తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ ప్రవేశ పరీక్ష తర్వాత ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదల చేసి ఎన్‌టీఏ.. ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించింది. ఆ తర్వాత నిపుణులతో వెరిఫై చేసిన అనంతరం ఫైనల్ కీతో పాటు తాజాగా ఫలితాలను ప్రకటించింది.

# ప్రకృతి శాశ్వతం

- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, (వెలుతురు):** ప్రకృతి మాత్రమే శాశ్వతమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమించేందుకు ప్రేరణ లభిస్తుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడమే అర్థవంతమైన జీవితమని మంత్రి తెలిపారు.

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ తన భావాలను పంచుకున్నారు. అడవులను సంరక్షించుకునే దిశగా ప్రజలకు అవగాహన కలిగించే నిమిత్తం ప్రతి యేడు మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని జరుపు కుంటున్నామని మంత్రి సురేఖ అన్నారు.

అడవుల ప్రాముఖ్యత, అడవులతో మనిషికున్న అనుబంధం, అడవుల సంరక్షణకు అనుసరించాల్సిన కార్యాచరణ, అడవులను సంరక్షించుకోకపోతే తలెత్తె విపత్కర పరిస్థితులను అటవీ దినోత్సవం సందర్భంగా అవలోకనం చేసుకోవాల్సిన అవసరము న్నదని మంత్రి అన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఈ యేడు "అడవులు మరియు ఆవిష్కరణలు : మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు" థీమ్‌తో ప్రపంచవ్యాప్తంగా అటవీ దినోత్స వాన్ని నిర్వహించుకుంటున్నామని మంత్రి తెలిపారు.

"పట్టణీకరణ, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికీ అంతరించి పోతున్నాయి. భూ విస్తీర్ణానికి అనుగుణంగా అడవుల విస్తరణ లేకపోవడంతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కఠిన సమస్యలు ఎదుర్కొంటున్నాం. పర్యావణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నాం" అని మంత్రి సురేఖ పేర్కొన్నారు.

మానవ మనుగడకు జీవనాధారాలైన గాలి, ఆహారానికి ఆలవాలమైన అడవులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉన్నదని మంత్రి పేర్కొన్నారు. మానవాళి మనుగడకు, భవిష్యత్ తరాలు



ఆరోగ్యంగా జీవించడానికి అడవులను సంరక్షించుకోవాల్సిన అత్యయిక పరిస్థితి నెలకొందని అన్నారు. వన్య ప్రాణులకు ఆవాసాలైన అడవులను కాపాడు కుంటేనే జీవవైవిధ్యం వర్ధిల్లుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందిస్తేనే అడవుల విస్తీర్ణంలో వృద్ధి నమోదవుతుందని, ఈ దిశగా ప్రజలు కలిసి రావాలని మంత్రి సురేఖ ప్రజలకు పిలుపు నిచ్చారు. తెలంగాణలో 24.05 శాతం ఉన్న అడవుల విస్తీర్ణాన్ని జాతీయ అటవీ విధానం ప్రకారం 33 శాతానికి పెంచే దిశగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు. ఓ వైపు ఉన్న అడవులను సంరక్షించుకుంటూనే, మరోవైపు అటవీ సంపదను పెంచేందుకు సమర్పణ, సంకల్పంతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరిత యజ్ఞంలో భాగస్వా ములైన అటవీ శాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు, ప్రజలకు మంత్రి సురేఖ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధాని మోదీపై సోనియాగాంధీ ఫైర్



గురువారం పార్టీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ అగ్ర నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడాన్ని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో దేశంలో ప్రజాస్వామ్యం బతికి బట్ట కట్టడం కష్టమని పార్టీ సీనియర్ నేత అజయ్ మాకెన్ మండిపడ్డారు.

**ఢిల్లీ, (వెలుతురు):** కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడంపై దేశ ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఖర్గే, మాజీ చీఫ్ సోనియా, రాహుల్ గాంధీ లతో పాటు సీనియర్ నేతలు మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీని ఇబ్బందులకు గురి చేసి, ఎన్నికల్లో గెలవాలని మోదీ దురాలోచన చేస్తున్నారని సోనియా గాంధీ విమర్శించారు. పార్టీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడంపై గురువారం తొలిసారిగా స్పందించిన సోనియా. ప్రధాని మోదీపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఇలా పార్టీ ఫండ్స్ ను కట్టడి చేయడం సరికాదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా దెబ్బ తీయాలనే ఉద్దేశంతో సిస్టమేటిక్ గా వ్యవహరించారంటూ మోదీని దుయ్యబట్టారు. కాగా, కాంగ్రెస్ పార్టీ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ కూడా మోదీపై ఇవే ఆరోపణలు గుప్పించారు. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా దేశంలో పెద్ద మొత్తంలో లబ్ది పొందిన పార్టీ ఏదనేది అందరికీ తెలుసని చెప్పారు. ఈ మేరకు



## అక్రమం బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు

# రూ.7.47 లక్షల మద్యం స్వాదీనం

**హైదరాబాద్ మార్చ్ 21 (వెలుతురు):** సైబరాబాద్ కమిషరేట్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు చేశారు. కమిషనరేట్‌లోని 8 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్‌వోటీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 796.05 లీటర్ల మద్యాన్నీ స్వాదీనం చేసుకున్నారు.

దీనివిలువ రూ.7.47 లక్షల ఉంటుందని పోలీసులు తెలిపారు. ఒక్క పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే 480 లీటర్స్ మద్యాన్ని మేడ్చల్ పోలీసులు పట్టుకున్నారు.

# ఉక్రెయిన్ రాజధానిపై రష్యా మిస్సైల్ దాడులు

**నివాస భవనాలు, పారిశ్రామిక సౌకర్యాల ధ్వంసం**

**క్షిపణులను కూల్చివేసినట్లు సైనిక అధికారులు వెల్లడి**

**కివ్,మార్చి21(వెలుతురు):** ఉక్రెయిన్ రాజధాని కివ్‌పై రష్యా మిస్సైల్ దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో కనీసం 13 మంది గాయపడ్డారు. నివాస భవనాలు, పారిశ్రామిక సౌకర్యాలను ధ్వంసం చేశారు. కాగా అన్ని క్షిపణులను కూల్చివేసినట్లు సైనిక అధికారులు చెప్పారు. గురువారం తెల్లవారుజామున జరిగిన దాడి ఇటీవలి వారాల్లో బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో నగరాన్ని లక్ష్యంగా చేసుకున్న మొదటి భారీ దాడి అని దాని సైనిక పరిపాలన అధిపతి సెర్హి పాప్కో తెలిపారు. “44 రోజుల విరామం తర్వాత, శత్రువు కివ్‌పై మరో క్షిపణి దాడిని ప్రారంభించింది,” అని పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా కనీసం 13 మంది గాయపడ్డారని కివ్ మేయర్ విటాలి క్లిట్స్కో తెలిపారు. ఉక్రెయిన్ వైమానిక రక్షణ రాజధానిని లక్ష్యంగా చేసుకున్న 31 రష్యన్ క్షిపణులను కూల్చివేసినట్లు వైమానిక దళ కమాండర్ చెప్పారు. రష్యా సైన్యం వ్యూహాత్మక బాంబర్లను ఉపయోగించిందని, పొరుగు ప్రాంతాలలో సంక్లిష్టమైన విన్యాసాలను అనుసరిస్తూ తన భూభాగం నుండి కొన్ని క్షిపణులను ప్రయోగించిందని, క్షిపణులు వివిధ దిశల నుండి నగరాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని పాప్కో చెప్పారు. దాదాపు మూడు గంటల పాటు ఎయిర్ అలర్ట్‌లు కొనసాగాయి. క్షిపణి శిథిలాలు అనేక నివాస భవనాలు, పారిశ్రామిక ప్రదేశాలు, కిండర్ గార్టెన్‌లను తాకినట్లు క్లిట్స్కో చెప్పారు. సెంట్రల్ డిస్ట్రిక్ట్ షెవ్‌చెంకివ్‌స్కీలోని బహుళ అంతస్తుల భవనంలోని అపార్ట్‌మెంట్‌లలో ఒకదానిలో మంటలు చెలరేగడంతో నివాసితులు ఖాళీ చేశారు. ఈ దాడిలో సమీపంలోని పలు ఇళ్లలో అద్దాలు పగిలిపోయి, ప్రైవేట్ కార్లు తగలబడిపోయాయని పాప్కో తెలిపారు.కివ్‌కు సహాయం చేయడానికి “రాజకీయ సంకల్పం” చూపించాలని ఉక్రేనియన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ పాశ్చాత్య దేశాలకు పిలుపునిచ్చారు.

# రాజకీయ హత్యలపై ఇసి సీరియస్

**మూడు జిల్లాల ఎస్పీలను పిలిచి మాట్లాడిన మీనా**

**తగిన వివరణ ఇవ్వాలని ఆదేశాలు**

**అమరావతి,మార్చి21(వెలుతురు):** గిద్దలూరు, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో జరిగిన రాజకీయ హత్యలు, మాచర్లలో వాహనం తగలబెట్టిన ఘటనలను ఈసీ సీరియస్‌గా తీసుకుంది. ఈ మూడు హింసాత్మక ఘటనలపై ప్రకాశం, పల్నాడు, నంద్యాల జిల్లాల ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కె.రఘువీరారెడ్డిల నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా వివరణ తీసుకున్నారు. ముగ్గురు ఎస్పీలు గురువాం సీఈవో మీనా ఎదుట హాజరుకాగా.. ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.
శాంతిభద్రతలు కాపాడే విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారని సూటిగానే ప్రశ్నించినట్లు సమాచారం. రాజకీయ హత్యల దాకా పరిస్థితులు దిగజారే వరకు ఎందుకు వేచి చూడాల్సి వచ్చిందని ఎస్పీలను ప్రశ్నించారు. మాచర్ల నియోజకవర్గం చాలా కాలంగా సున్నిత ప్రాంతాల జాబితాలో ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేశారని పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని నిలదీశారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత హెచ్చరికలు జారీ చేసినా ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో నేరుగా ఈసీ నిఘా పెట్టిందన్నారు. ముగ్గురు ఎస్పీలు ఇచ్చిన వివరణల నివేదికలను సీఈవో కేంద్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు.

# 23 మంది వలంటీర్లపై వేటు

**రాజమహేంద్రవరం,మార్చి21(వెలుతురు):** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిధిలో 23 మంది వాలంటీర్లను సస్పెండ్ చేశారు. వైకాపాకు అనుకూలంగా పని చేస్తున్నారని ఇటీవల వారిపై తెదేపా నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వాలంటీర్లను సస్పెండ్ చేస్తూ రిటర్నింగ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించకుండా వైకాపా నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో
పాల్గొన్న 45 మంది వాలంటీర్లను అధికారులు బుధవారం విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. వాలంటీర్లు ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# ప్రణీత్ రావు కేసులో మలుపులు

**అమెరికాకు చెక్కేసిన మాజీ అధికారి ప్రభాకర్ రావు**

**పోలీసులు అనుమానాలు?**

**హైదరాబాద్,మార్చి21(వెలుతురు):** గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు టాప్ చేసినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్ రావు వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్‌లో ప్రణీత్‌కు అండగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాను సమాచారాన్ని ధ్వంసం చేశానని ప్రణీత్‌రావు వెల్లడించిన సంగతి తెలిసిందే. 2018 నుంచే అక్రమ ట్యాపింగ్ దందా మొదలైనట్లు పోలీసులు గుర్తించారు. ఇజ్రాయిల్ నుంచి అత్యాధునిక ఉపకరణాలు ఖరీదు చేయగా, రామ్ గోపాల్ కన్‌స్టలెంట్, అడ్వైజర్‌గా వ్యవహరించారు. ఆదిలాబాద్ ఘర్షణ సమయంలో అక్కడ వినియోగించినట్లు గుర్తించారు. ప్రణీత్‌రావు కేసులో మరో నలుగురికి నోటీసులు జారీ చేశారు.
కాగా, మాజీ ఐపీఎస్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు బంధువే ఈ ప్రణీత్ రావు. ప్రణీత్ కెరీర్‌లో అడుగడుగునా ప్రభాకర్ రావు అండగా ఉన్నట్లు సమాచారం. ప్రభాకర్ రావు నల్గొండ ఎస్పీగా ఉన్నప్పుడే ప్రణీత్ ప్రొబేషన్ క్లియరెన్స్ అయ్యింది. అలాగే.. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్ కాగానే.. ప్రణీత్‌కు ఎస్ఐబీలో పోస్టింగ్ లభించింది. ఇదిలా ఉంటే.. ఎస్ఐబీలో ఉన్న ఇతర ఇన్‌స్పెక్టర్లను కాదని ప్రణీత్‌ను వెనకేసు కొచ్చారని ప్రభాకర్‌పై ఆరోపణలు కూడా ఉన్నాయి. అందులో భాగంగానే నిబంధనలకు విరుద్ధంగా ప్రణీత్‌కు డీఎస్పీగా ప్రమోషన్ ఇప్పించారని ప్రభాకర్ బలమైన ఆరోపణ కూడా ఒకటి ఉండడం గమనార్హం.

### తమిళనాడు గవర్నర్

# కోర్టును ధిక్కరిస్తున్నాడు

**కేంద్రం ఏం చేస్తుందని సుప్రీం ఆగ్రహం**

**న్యూఢిల్లీ,మార్చి21(వెలుతురు):** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. డీఎంకే నేత కే పొన్ముడిని మంత్రివర్గంలో చేర్చుకునేందుకు గవర్నర్ నిరాకరించడంపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా మండిపడింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానిస్తూ.. ‘గవర్నర్ సుప్రీంకోర్టును ధిక్కరిస్తున్నారు”అని అన్నారు. గవర్నర్ రాజ్యాంగాన్ని అనుసరించకపోతే, ప్రభుత్వం ఏం చేస్తుంది..? అని కేంద్రాన్ని సుప్రీం ప్రశ్నించింది. పొన్ముడిని మంత్రిగా నియమించేందుకు గవర్నర్‌కి రేపటి వరకు సమయం ఇచ్చింది. అక్రమ ఆస్తుల కేసులో మద్రాసు హైకోర్టు పొన్ముడిని ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసింది. ఆ తర్వాత సుప్రీంకోర్టు అతని నేరాన్ని, రెండేళ్ల జైలు శిక్షను సుప్రీంకోర్టు నిలిపేసింది. తమిళనాడులో అధికార డీఎంకే అతడిని మళ్లీ మంత్రి వర్గంలోకి తీసుకునేందుకు ముందుకు వచ్చింది. అయితే, గవర్నర్ రవి దీనికి అంగీకరించకపోవడం స్టాలిన్ ప్రభుత్వం సుప్రీంకోర్టుని ఆశ్రయించింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది.”రేపు మీ వ్యక్తి మాట వినకుంటే.. రాజ్యాంగం ప్రకారం వ్యవహరించాలని గవర్నర్‌ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తాం. తమిళనాడు గవర్నర్ ప్రవర్తనపై తాము ఆందోళన చెందుతున్నాము. మేము కళ్లు తెరిచే ఉన్నాము, రేపు ఏం జరగాలో నిర్ణయిస్తాం” అని ప్రధాని న్యాయమూర్తి చంద్రచూడ్ కేంద్రానికి వార్నింగ్ ఇచ్చారు. గవర్నర్ సుప్రీంకోర్టుని ధిక్కరిస్తున్నారని అన్నారు. “ నాకు ఒక మనిషి(మంత్రి)పై భిన్నమైన అభిప్రాయం ఉండొచ్చు, కీనా మనం రాజ్యాంగ చట్టానికి లోబడి వెళ్లాలి. సీఎం ఆ వ్యక్తిని మంత్రిగా నియమించాలని అనుకుంటున్నారు. గవర్నర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో దీనిని చేయాలి. ఆయన రాష్ట్రానికి ఉత్సవ అధిపతి” అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఒక్కసారి శిక్షపై స్టే విధించిన తర్వాత మీరు కళంకితులని ఎలాంటి మచ్చలేదని చెప్పలేం అని జస్టిస్ పార్దీవాలా అన్నారు. గవర్నర్ రవికి, స్టాలిన్ ప్రభుత్వానికి ఘర్షణ తారాస్థాయికి చేరుకుంది. ఆయనను తొలగించాలని డీఎంకే సర్కార్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి లేఖ రాసింది. ఇక మంత్రిగా పొన్ముడి నియామకాన్ని అంగీకరించకపోవడంతో రాజ్‌భవన్, సర్కార్ మధ్య విభేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. రాజ్‌భవన్ బిల్లుల క్లియరింగ్‌లో జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వం గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# ఇండియాలో వేగంగా తగ్గిన సంతానోత్పత్తి

**రేటు 6.2 నుంచి 2కి తగ్గిన సంతానోత్పత్తి**

**ది లాన్సెట్ అధ్యయనంలో వెల్లడి**

**న్యూఢిల్లీ,మార్చి21(వెలుతురు):** ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో సంతానోత్పత్తి రేటు(ఫర్టిలిటీ రేట్) పడిపోతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు తక్కువ సంతానోత్పత్తి రేటును ఎదుర్కొంటున్నాయి. ఇదిలా ఉంటే ఇండియాలో కూడా సంతానోత్పత్తి రేటు 1950లో దాదాపుగా 6.2 శాతంగా ఉంటే 2021 నాటికి 2కి పడిపోయినట్లు ది లాన్సెట్ అధ్యయనం తెలిపింది. టోటల్ ఫెర్టిలిటీ రేట్(%ఖీ=%) 1950లో ఒక మహిళకు 4.8 కంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉంది. 2021లో ఒక్కో మహిళ 2.2 పిల్లలను మాత్రమే కలిగి ఉంది. ఈ గణాంకాలు 2050, 2100 నాటికి 1.8, 1.6 శాతానికి తగ్గుతాయని అంచనా వేయబడింది. 2021లో ప్రపంచవ్యాప్తంగా 12.9 కోట్ల పిల్లలు జన్మించారు, 1950లో దాదాపుగా 9.3 కోట్ల నుంచి 2016లో 14.2 కోట్ల పిల్లల జననాలకు తగ్గింది. భారతదేశంలో 1950లో 1.6 కోట్ల కంటే ఎక్కువ సజీవ జననాలు జరిగాయి, 2021లో ఇది 2.2 కోట్ల పిల్లల జననాలు జరిగాయి. 2050 నాటికి ఇది 1.3 కోట్లకు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం చాలా దేశాలు సంతానోత్పత్తి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అయితే, తక్కువ-ఆదాయ దేశాల్లో మాత్రం ఇప్పటికీ సంతానోత్పత్తి రేటు అధికంగానే ఉంది. ఈ దేశాలు 21 శతాబ్ధంలో కూడా అధిక ఫెర్టిలిటీ సమస్యలను ఎదుర్కొంటోందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా పశ్చిమ, తూర్పు సబ్ సహారా ఆఫ్రికాలోని కొన్ని దేశాలు ఇది ఎక్కువగా ఉంది. 2021 నుంచి 2100 వరకు ప్రపంచ సజీవ జననాల్లో తక్కువ ఆదాయ దేశాల వాటా 18 శాతం నుంచి 35 శాతానికి రెట్టింపు అవుతుందని, కొన్ని పేద దేశాల్లో ఎక్కువ మంది పిల్లలు పుడుతారని పరిశోధకులు అంచానా వేశారు. మారుతున్న వాతావరణ మార్పులు, అధిక సంతానోత్పత్తి తక్కువ ఆదాయ దేశాలు తరుచుగా వరదలు, కరువులు కారణంగా ఆహారం నీరు కొరత ఎదుర్కొంటుందని హీట్ రిలేటెడ్ వ్యాధులు, మరణాలు పెరుగుతాయని నివేదిక చెప్పింది. సంతానోత్పత్తి అనేది ఆర్థిక వ్యవస్థలు, భౌగోళిక రాజకీయాలు, ఆహార భద్రత, ఆరోగ్యం, పర్యావరణం ఇలా పలు అంశాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని చెప్పింది. ముఖ్యంగా మధ్య- ఉన్నత ఆదాయ దేశాలకు, తక్కువ ఆదాయ దేశాల మధ్య స్పష్టమైన జనాభా విభజనను చూపిస్తుందని నివేదిక పేర్కొంది. వృద్ధాప్య జనాభా సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వాలు నిధులను, ఇతర మార్గాలను గుర్తింకపోతే, ఇది జాతీయ ఆరోగ్య బీమా, సామాజిక భద్రత కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలపై ఎక్కువ ఒత్తిడి తెస్తుందని నివేదిక హెచ్చరించింది. ప్రపంచ జనాభా నిరంతర క్షీణత వనరులు, కర్బణ ఉద్గారాలపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు పర్యావరణ పురోగతికి అవకాశాలు అందించవచ్చు. ఇక తక్కువ ఆదాయదేశాల్లో సంతానోత్పత్తిని



తగ్గించడానికి గర్భనిరోధక వెసులుబాటు, విద్య వంటివి సహాయపడుతాయని పరిశోధకులు అంచనా వేశారు. పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రెజా మాట్లాడుతూ.. ఈ పరిశోధన ఇండియాకు తీవ్ర చిక్కులను కలిగి ఉందని, వృద్ధాప్య జనాభా, శ్రామిక శక్తి కొరత వంటి సవాళ్లను ప్రేరేపించవచ్చని హెచ్చరించారు. ఈ సవాళ్లకు భారత్ ఇప్పుడు కొన్ని దశాబ్ధాల దూరంగా ఉన్నప్పటికీ.. ఇప్పటి నుంచే సమగ్రమైన విధానంతో మనం పనిచేయాలని సూచించారు.

# తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్న మయన్మార్ సైన్యం

**యూఎన్ ప్రత్యేక ప్రతినిధి ఆండ్రూస్ వెల్లడి**

**మయన్మార్,మార్చి21(వెలుతురు):** మయన్మార్ సైన్యం ప్రస్తుతం తీవ్రమైన ఒడుదొడుకులు ఎదుర్కొంటుందని యూఎన్ ప్రత్యేక ప్రతినిధి టామ్ ఆండ్రూస్ తెలిపారు. దాన్ని ఆ ముప్పు తప్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. మయన్మార్ పై చాలా దేశాలు ఆంక్షలు విధించారని తెలిపారు. 2021లో అధికారంలోకి వచ్చిన జుంటా దళాలు గతంలో ఉన్న ప్రభుత్వాన్ని అణిచి వేశాయని వెల్లడించారు. మయన్మారు జుంటాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని యూఎన్ ప్రత్యేక ప్రతినిధి టామ్ ఆండ్రూస్ తెలిపారు. దీన్ని సమర్థవంతంగా అంతం చేయడానికి ప్రపంచం దేశాలు సహాయం చేయాలని అన్నారు. కొన్ని ఆంక్షలు విధించడం ద్వారా అది సాధ్యం అవుతుందన్నారు. జుంటా దళాల మధ్య భారీ ప్రాణనష్టం, ఫిరాయింపులు, లొంగుబాట్లు కారణంగా అవి బలహీన పడుతుందని వెల్లడించారు. ముఖ్యంగా రిక్రూట్ మెంట్ సవాళ్లను ఎదుర్కొనడంలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని వెల్లడించారు. ఫిబ్రవరి 2021లో తిరుగుబాటు చేసి జుంటా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ తర్వాత గత పదేళ్ళుగా అక్కడి అధికారంలో ఉన్న ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని నాశనం చేసిందని వెల్లడించారు. దీని కారణంగా దేశాన్ని మరోసారి రక్తశిక్తం చేసిందన్నారు. ప్రస్తుతం దేశంలో దీర్ఘకాలంగా ఉన్న జాతి తిరుగుబాటు దళాలను అణిచివేయడానికి ప్రస్తుతం జుంటా దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని అన్నారు. అయితే ప్రస్తుతం దేశంలో హింస, అస్థిరత, ఆర్థిక క్షీణత ఏర్పాడడానికి ప్రధాన కారణం జుంటా అని ఆండ్రూస్ వెల్లడించారు.జుంటా సింగపూర్ అందించే ఆయుధాల సరఫరాను చాలా వరకు తగ్గించిందని అన్నారు. ప్రస్తుతం జుంటాకు చైనా, రష్యా దేశాలే ప్రధానంగా ఆయుధ సమాగ్రిని సరాఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆదేశంలో ప్రపంచ దేశాలకు ఉన్న ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అవసరం ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ప్రపంచం ఇతర ఘర్షణపై తన కేంద్రీకరించడం వల్ల మయన్మార్ పై తమ దృష్టి సన్నగిల్లిందన్నారు. ఇలాంటి సమయంలో ప్రజాస్వామ్య, మానవ హక్కులను గౌరవించే మయన్మార్ ను నిర్మించడం చాలా అవసరం అని ప్రపంచ దేశాలకు తెలిపారు. అక్కడి ప్రజల మద్దతుగా అని దేశాలు సహకరించాలని కోరారు.

# పీఎం కిసాన్‌పై లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్

**17వ విడత నిధుల జమ మరింత ఆలస్యం..!**

**న్యూఢిల్లీ,మార్చి21(వెలుతురు):** ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం అనేది వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు ఆదాయ మద్దతును అందించే రైతుల సంక్షేమ పథకం. ఈ పథకం కింద అర్హులైన రైతులందరికీ ఒక్కో కుటుంబానికి రూ.6000 చొప్పున కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనం కల్పిస్తుంది. ఫిబ్రవరి 28న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 16వ విడతను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. మొత్తం రూ. 6,000 వార్షిక మొత్తంలో ప్రధానమంత్రి ఈ విడత రూ. 2,000 చొప్పున 9 కోట్ల మంది రైతుల ఖాతాలకు బదిలీ చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రధాని మోదీ విడుదల చేసిన మొత్తం రూ. 21 వేల కోట్లకు పైగా ఉంది. పీఎం-కిసాన్‌లో 9,01,67,496 మంది



రైతులు లబ్ధి పొందారు. అయితే పీఎం కిసాన్ 17వ విడత సొమ్ము త్వరలోనే కేంద్ర ప్రభుత్వం రిలీజ్ చేయనుంది. పీఎం కిసాన్ 17వ విడత నిధులు పొందాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. పీఎం కిసాన్ వెబ్ సైట్ ప్రకారం పీఎం కిసాన్ నమోదు చేసుకున్న అర్హులైన రైతులకు ఈ-కేవైసీ తప్పనిసరి. పీఎం కిసాన్ పోర్టల్లో ఓటీపీ - ఆధారిత ఈ-కేవైసీ అందుబాటులో ఉంది. బయోమెట్రిక్ ఆధారిత ఈ-కేవైసీ కోసం రైతులు సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాలను కూడా సంప్రదించవచ్చు.పీఎం-కిసాన్ పథకం షెడ్యూల్ ప్రకారం వాయిదాలు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి విడుదల చేస్తారు. గత ఏడాది నవంబర్లో విడుదల కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 16వ విడత విడుదలైంది. కాబట్టి పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత జూన్ 2024లో విడుదల అవుతుంది. అయితే లోక్ సభ ఎన్నికల కారణంగా ఇది ఆలస్యమయ్యే అకాశం ఉందని చెబుతున్నారు.

# భారత్ నుంచి జవాబుదారీతనం ఆశిస్తున్నాం...

**ఖలిస్తాన్ ఉగ్రవాది హత్యకుట్రపై అమెరికా**

**న్యూఢిల్లీ,మార్చి21(వెలుతురు):**
ఖలిస్తాన్ ఉగ్రవాది, సిఖ్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) సంస్థ చీఫ్ గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నాడనే ఆరోపణలతో భారత జాతీయుడు నిఖిల్ గుప్తాను చెక్ రిపబ్లిక్ అరెస్ట్ చేసింది. అమెరికా అధికారుల సూచన మేరకు గతేడాది నవంబర్‌లో అతడిని అదుపులోకి తీసుకుంది. ఇదిలా ఉంటే నిందితుడికి భారత ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అమెరికా గడ్డపై అమెరికన్ సిటిజన్ అయిన గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నడాన్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోంది. ఇప్పటికే ఈ విషయాన్ని అత్యున్నత స్థాయిలో భారత ప్రభుత్వానికి తన ఆందోళన తెలియజేసింది. దీనిపై భారత ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇదిలా ఉంటే హత్యకు కుట్ర పన్నిన వారిని బాధ్యులను చేసేందుకు భారత ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు అమెరికా తెలిపింది. ఈ విషయంలో భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం భారత్ నుంచి జవాబుదారీతనం ఆశిస్తున్నామని పేర్కొంది. అమెరికా-కెనడా ద్వంద్వ పౌరసత్వం కలిగిన పన్నూను హతమార్చేందుకు ఒక హంతకుడికి లక్ష డాలర్లను చెల్లించడానికి నిఖిల్ గుప్తా




అంగీకరించాడని అమెరికా ఆరోపిస్తోంది.పన్నూ మర్డర్ కుట్ర భారత్, అమెరికాల మధ్య తీవ్ర సమస్యగా దక్షిణ, మధ్య ఆసియా సహాయ కార్యదర్శి డొనాల్డ్ లూ బుధవారం వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వంలో పనిచేస్తున్న ఒకరి ఆదేశానుసారం భారతీయ పౌరుడు అమెరికన్ పౌరుడిని చంపడానికి ప్రయత్నించినట్లు యూఎస్ న్యాయశాఖ ఆరోపించింది. రష్యాలో అలెక్సీ నావల్నీ హత్యకు సంబంధించి యూఎస్ఏ 500 మందికి పైగా వ్యక్తులపై ఆంక్షలు విధించినట్లే , పన్నూ విషయంలో పరిశీలిస్తున్నారా అని ప్రశ్నించిన సమయంలో లూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియాలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ, ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతు ఇస్తున్న పన్నూను భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడిపై ఇండియాలో అనేక కేసులు నమోదయ్యాయి.

# రాజమౌళి ఫ్యామిలీకి తృటిలో తప్పిన ప్రమాదం

**జపాన్ పర్యటనలో ఉన్న జక్కన**

**నివాస అంతస్థులో కంపించిన భూమి**

**ఇబారకి ప్రిఫెక్చర్,మార్చి21(వెలుతురు):** ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఫ్యామిలీకి తృటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న జక్కన ఫ్యామిలీ.. భూకంపం బారి నుంచి బయటపడ్డారు. ఈ విషయాన్ని రాజమౌళి కుమారుడు ఎస్ఎస్ కార్తికేయ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తాము 28వ అంతస్థులో ఉండగా భూమి కంపించిందని, తాను భయాందోళనకు గురయ్యానని కార్తికేయ పేర్కొన్నారు. ‘మేం 28వ అంతస్తులో ఉన్నాం. బిల్డింగ్ నెమ్మదిగా కదలడం ప్రారంభమైంది. అది భూకంపం అని గ్రహించడానికి మాకు కొంత సమయం పట్టింది. నేను భయాందోళనకు గురయ్యా. కానీ మా చుట్టూ ఉన్న జపనీయులందరూ ఎలాంటి ఆందోళన చెందలేదు.
ఏదో వర్షం పడుతున్నంత ఈజీగా లైట్ తీసుకున్నారు. మొత్తానికి మేం భూకంపాన్ని ఎక్స్?పీరియెన్స్ చేశాం’ అని ఎస్ఎస్ కార్తికేయ ఎక్స్‌లో పేర్కొన్నాడు. భూకంపం సమయంలో తన స్మార్ట్ వాచ్‌లో వచ్చిన వార్నింగ్‌ని ఫోటో తీసి ఆయన షేర్ చేశాడు. ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాజమౌళి ఫ్యామిలీ సేఫ్‌గా ఇండియాకి తిరిగి రావాలని ఫాన్స్ కోరుకుంటున్నారు.భూకంప తీవ్రత 5.3గా నమోదయిందని అమెరికా జియోలాజికల్ సర్వే ఓ ప్రకటనలో వెల్లడించింది. తూర్పు జపాన్‌లోని దక్షిణ ఇబారకి ప్రిఫెక్చర్‌లో 46 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించింది. ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి ఫ్యామిలీ జపాన్ పర్యటనలో ఉంది. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్‌లతో తెరకెక్కించిన గ్లోబల్ హిట్ చిత్రం ‘ఆర్ఆర్ఆర్’ స్క్రీనింగ్ కోసం వారు అక్కడికి వెళ్లారు.

## ఆదివారమైనా సరే మార్చి 31న


# ఆ బ్యాంకులన్నీ పనిచేయాలి..

**ఆర్బీఐ కీలక ఆదేశాలు**

**మార్చి 31న దేశవ్యాప్తంగా తెరచివుండనున్న ఏజెన్సీ బ్యాంకుల బ్రాంచులు**

**ఆర్థిక సంవత్సరం 2023-24కి ముగింపు రోజు కావడంతో ఆర్బీఐ నిర్ణయం**

**ప్రభుత్వ కార్యకలాపాలకు సహకరించాలని కేంద్ర ప్రభుత్వం కోరడంతో సానుకూలంగా స్పందించిన కేంద్ర బ్యాంక్**



మార్చి 31వ తేదీ ఆదివారమే అయినప్పటికీ అన్ని ఏజెన్సీ బ్యాంకులు పనిచేయాలని కేంద్ర బ్యాంక్ ఆర్బీఐ ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక సంవత్సరం 2023-24కి మార్చి 31 చివరి రోజు కావడంతో ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన లావాదేవీలను నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏజెన్సీ బ్యాంకుల బ్రాంచ్‌లు తెరిచే ఉండాలని సూచించింది. ప్రభుత్వ రశీదులు, చెల్లింపులతో ముడిపడిన బ్యాంకుల బ్రాంచులు అన్నింటిని మార్చి 31న (ఆదివారం) తెరిచి ఉంచాలని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయడంతో ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అవసరమైన బ్రాంచులను తెరిచి ఉంచుతున్నామని, సేవలు లభిస్తాయంటూ ప్రచారం కల్పించాలని బ్యాంకులకు ఆర్బీఐ ఆదేశాలిచ్చింది. కాగా బ్యాంకులు సాధారణంగా అన్ని ఆదివారాలు, ప్రతి నెల 2, 4వ శనివారాల్లో మూసి ఉంటాయనే విషయం తెలిసిందే.

**అసలు ఏజెన్సీ బ్యాంకులు అంటే?**

అన్ని బ్యాంకుల మాదిరిగా ఏజెన్సీ బ్యాంకులు కూడా కమర్షియల్ బ్యాంకులే. అయితే ప్రభుత్వానికి సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించడానికి ఏజెన్సీ బ్యాంకులకు మాత్రమే ఆర్బీఐ అధికారం ఇస్తుంది. ఈ బ్యాంకులు ప్రభుత్వం తరపున వివిధ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. దేశవ్యాప్తంగా ప్రభుత్వ లావాదేవీలు, ప్రభుత్వ సేవలను సులభతరం చేయడంలో ఏజెన్సీ బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పన్నుల సేకరణ, ప్రభుత్వ చెల్లింపులు, పంపిణీతో పాటు ముఖ్యమైన పలు సేవలను అందిస్తున్నాయి.

**ఏజెన్సీ బ్యాంకులు ఇవే..**

ప్రభుత్వరంగ బ్యాంకులు(విలీనం తర్వాత)

1. బ్యాంక్ ఆఫ్ బరోడా, 2. బ్యాంక్ ఆఫ్ ఇండియా, 3. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, 4. కెనరా బ్యాంక్, 5. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 6. ఇండియన్ బ్యాంక్, 7. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, 8. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, 9. పంజాబ్ నేషనల్ బ్యాంక్, 10. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 11. యూకో బ్యాంక్, 12. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

**షెడ్యూల్డ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంకులు**


1. యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, 3. డీసీబీ బ్యాంక్ లిమిటెడ్, 4. ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్, 5. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లిమిటెడ్, 6. ఐసీఐసీఐ బ్యాంక్ లిమిటెడ్, 7. ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్, 8. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్, 9. ఇండస్ ఇండ్ బ్యాంక్ లిమిటెడ్, 10. జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్ లిమిటెడ్, 11. కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, 12. కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, 13. కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్, 14. ఆర్బీఎల్ బ్యాంక్ లిమిటెడ్, 15. సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్, 16. యస్ బ్యాంక్ లిమిటెడ్, 17. ధనలక్ష్మి బ్యాంక్ లిమిటెడ్, 18. బంధన్ బ్యాంక్ లిమిటెడ్, 19. సీఎస్‌బీ బ్యాంక్ లిమిటెడ్, 20. తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ జాబితాలో ఉన్నాయి. ఇక విదేశీ బ్యాంకుల జాబితాలో డీబీఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్ ఉంది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**540 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్**

**173 పాయింట్లు పెరిగిన నిఫ్టీ**

**3.55 శాతం పెరిగిన ఎన్టీపీసీ షేరు విలువ**



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ సానుకూలతలు మార్కెట్లకు అండగా నిలిచాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 540 పాయింట్లు లాభపడి 72,641కి చేరుకుంది. నిఫ్టీ 173 పాయింట్లు పెరిగి 22,011 వద్ద స్థిరపడింది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

ఎన్టీపీసీ (3.55%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (3.40%), టాటా స్టీల్ (2.99%), ఇండస్ ఇండ్ బ్యాంక్ (2.93%), టాటా మోటార్స్ (2.57%).

**టాప్ లూజర్స్:**

భారతి ఎయిర్ టెల్ (-0.83%), ఐసీఐసీఐ బ్యాంక్ (-0.24%), మారుతి (-0.23%), ఏసియన్ పెయింట్స్ (-0.06%).

# మోకాళ్లపై మెట్లెక్కి.. తిరుమల స్వామి వారిని దర్శించుకున్న జాన్వీకపూర్

**ఈ నెల 6న తన బర్త్‌డే సందర్భంగా స్నేహితులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్న జాన్వీ**

**స్నేహితులు శిఖర్ పహారియా, ఒరీతో కలిసి స్వామి వారి సేవలో పాల్గొన్న బాలీవుడ్ బ్యూటీ**

**ఆ సమయంలోనే జాన్వీ-శిఖర్ మోకాళ్లపై మెట్లెక్కారు**

**ప్రస్తుతం ఎన్టీఆర్, చరణ్ సరసన రెండు తెలుగు సినిమాల్లో నటిస్తున్న జాన్వీకపూర్**



అతిలోక సుందరి శ్రీదేవి పెద్ద కూతురు జాన్వీ కపూర్ తరచూ దర్శనం కోసం తిరుమలకు వస్తుంటారనే విషయం తెలిసిందే. ఈ నెల 6న కూడా జాన్వీ తన బర్త్‌డే సందర్భంగా స్నేహితులతో కలిసి స్వామి వారిని దర్శించుకుంది. తన స్నేహితులు శిఖర్ పహారియా, ఒరీతో కలిసి వెంకటేశ్వర స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఇలా స్వామి వారి సేవలో పాల్గొన్న సమయంలో తీసిన ఓ వీడియోను ఒరీ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసింది. తిరుమల యాత్ర ఎలా జరిగిందో అందులో వివరించిందామె. చెన్నైలోని జాన్వీ కపూర్ ఇంటి నుంచి కారులో మూడు గంటల ప్రయాణం తర్వాత తిరుమల చేరుకున్నట్లు ఆమె పేర్కొంది. ఆ తర్వాత జాన్వీ బంధువులతో కలిసి నడక దారిన తిరుమల చేరుకున్నామని తెలిపింది. ఈ క్రమంలో మోకాళ్ల మిట్ట వద్ద జాన్వీ-శిఖర్ మోకాళ్లపై మెట్లెక్కారు. దాదాపు 50సార్లు తానుకు ఇక్కడికి వచ్చినట్లు ఒరీ తెలియజేసింది. ఈ దేవాలయం అంటే తనకెంతో ఇష్టమని కూడా ఆమె చెప్పుకొచ్చింది. ఇక ప్రస్తుతం జాన్వీ రెండు బడా తెలుగు సినిమాల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. అందులో ఒకటి యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన దేవర చిత్రం కాగా, మరొకటి గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తేజ్‌తో. ఈ మూవీని ఉప్పెన ఫేం బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్నాడు. బుధవారం ఈ చిత్రం పూజా కార్యక్రమం జరుపుకుంది. ఈ కార్యక్రమం అనంతరం జాన్వీ తన తండ్రి బోనీ కపూర్‌తో కలిసి చెర్రీ నివాసానికి వెళ్లింది. అక్కడ దర్శకుడు బుచ్చిబాబుతో పాటు ఇతర చిత్రయూనిట్‌తో కలిసి కొద్దిసేపు సరదాగా గడిపారు. దీనికి సంబంధించిన ఫొటోలను జాన్వీకపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది.



## 'పారిజాత పర్వం' టీజర్

చైతన్య రావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలతో తెరకెక్కిన చిత్రం 'పారిజాత పర్వం'. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఏప్రిల్ 19న ఈ చిత్రం విడుదల చేయటానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న తరుణంలో తాజాగా ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేసారు. 'కిడ్నాప్ ఈజ్ ఏన్ ఆర్ట్' అనే లైన్‌తో ప్రధాన పాత్రలను పరిచయం చేయటంతో ప్రారంభమైన ఈ టీజర్ ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా సాగింది. కథంతా కిడ్నాపుల చుట్టూనే తిరుగుతుందని తెలుస్తోంది. భీమవరం నుంచి హైదరాబాద్ వచ్చిన వ్యక్తిగా సునీల్‌ను చూపించారు. శ్రద్ధాదాస్ ఈ మూవీలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

# మొటిమల క్రీములను ఫ్రిజ్‌లో చల్లబరిచాకే వాడండి.. డాక్టర్ల సూచన

**బెంజాయిల్ పెరాక్సైడ్ ఆధారిత మొటిమల ట్రీట్‌మెంట్స్‌లో బెంజీన్ అవశేషాలు బయటపడ్డ వైనం**

**అమెరికాలోని ఓ స్వతంత్ర ల్యాబ్ జరిపిన పరీక్షల్లో వెల్లడి**

**ఈ క్రీములను చల్లబరిస్తే క్యాన్సర్ కారకాల ప్రభావం చాలా వరకూ తగ్గుతుందన్న వైద్యులు**




బెంజాయిల్ పెరాక్సైడ్ ఆధారిత మొటిమల క్రీమ్‌లు, జెల్స్, వాష్‌లను ముందుగా ఫ్రిజ్‌లో చల్లబరిచాక వాడాలని అమెరికాలోని డెర్మటాలజిస్టుల అసోసియేషన్ ఒకటి తాజాగా సూచించింది. ఈ ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక బెంజీన్ రసాయన అవశేషాలు ఉన్నందుకు వీటిని నిషేధించాలంటూ స్వతంత్ర క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ వెలీషఉర్ సూచించింది. ఈ మేరకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థకు కూడా ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో డాక్టర్లు మొటిమల క్రీములను ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరచాలని సూచించారు. ఇలా చేస్తే క్యాన్సర్ కారక రసాయనాల ప్రభావం చాలా వరకూ తగ్గుతుందని అమెరికా ఆక్నే, రోసాసియా సొసైటీ (ఏఏఆర్ఎస్) బుధవారం ఓ ప్రకటన చేసింది. వెలీషఉర్ పరీక్షల ఫలితాలు తమను ఒకింత ఆశ్చర్యపరిచాయని ఏఏఆర్ఎస్ అధ్యక్షుడు జేమ్స్ డెల్ రోసో వ్యాఖ్యానించారు. గత ఐదు దశాబ్దాలుగా ఈ ట్రీట్‌మెంట్ ఉనికిలో ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో నిజానిజాలు తేల్చేందుకు మరింత పరిశోధన జరగాలన్నారు. మొటిమలు, ఇతర చర్మసంబంధిత సమస్యల చికిత్సలో బెంజాయిల్ పెరాక్సైడ్ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని ఏఏఆర్ఎస్ పేర్కొంది. మరోవైపు, వెలీషఉర్ ల్యాబ్ పిటిషన్‌పై అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ స్పందించింది. వెలీషఉర్ సమాచారాన్ని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. అమెరికాలోని ప్రముఖ బ్రాండ్స్ ప్రొయాక్టివ్, క్లియరాసిల్‌పై స్టెబిలిటీ పరీక్షలు నిర్వహించగా వాటిల్లోని బెంజీన్ కంటెంట్ పెరిగినట్టు వెలీషఉర్ ల్యాబ్ పేర్కొంది.

# హార్ట్ ఫెయిల్యూర్ మరణాన్ని ఐదేండ్ల ముందే గుర్తించవచ్చు.. తాజా పరిశోధనలో వెల్లడి

**బ్రిటన్ శాస్త్రవేత్తల తాజా పరిశోధనలో వెల్లడి**

**ఈ బృందంలో కీలకంగా భారత సంతతి ప్రొఫెసర్**

**800 ల మందిపై పదేళ్ల పాటు స్టడీ చేశామని వివరణ**



శరీరంలో అత్యంత కీలకమైన అవయవం గుండె.. నిర్విరామంగా పనిచేసే గుండె అకస్మాత్తుగా ఆగిపోయే ముప్పు హార్ట్ ఫెయిల్యూర్. వెంటనే తగిన చికిత్స అందకుంటే ప్రాణం దక్కదు. అయితే, అన్నిచోట్లా తగిన వైద్య సదుపాయాలు ఉండవు. దీంతో అప్పటిదాకా హాయిగా ఉన్న వ్యక్తి ఉన్నట్టుండి కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతుంటారు. ఈ ముప్పును ముందే గుర్తించగలిగితే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని శాస్త్రవేత్తలు చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా ఓ పరిశోధనలో ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలువడ్డాయి. గుండె వైఫల్యంతో చనిపోయే ప్రమాదాన్ని ఏకంగా ఐదేళ్ల ముందే గుర్తించే పద్ధతిని బ్రిటన్ శాస్త్రవేత్తల బృందం కనుగొంది. ఈ బృందంలో భారత సంతతికి చెందిన ప్రొఫెసర్ ప్రదీప్ ఝుంద్ కీలకంగా వ్యవహరించారు. ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలను గ్లాస్గో వర్సిటీ ప్రొఫెసర్ ప్రదీప్ తాజాగా వెల్లడించారు. రక్తంలో ఓ ప్రొటీన్ స్థాయులను బట్టి హార్ట్ ఫెయిల్యూర్ ముప్పు ఎంత ఉందన్నది తెలుసుకోవచ్చని చెప్పారు. యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్ ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ గ్లాస్గోలకు చెందిన పరిశోధకుల బృందం సంయుక్తంగా 800 మంది వాలంటీర్లపై పదేళ్ల పాటు ఈ స్టడీ నిర్వహించింది. 'ప్రస్తుతం రక్తంలో బీ టైప్ నాట్రీయూరేటిక్ పెప్టైడ్(బీఎన్ పీ) ప్రొటీన్ స్థాయులను లెక్కించడం ద్వారా హార్ట్ ఫెయిల్యూర్ ముప్పును గుర్తిస్తున్నారు. అయితే, ఎన్ పీవై ప్రొటీన్ స్థాయులను లెక్కించడం ద్వారా ఈ ముప్పును ఐదేళ్ల ముందే గుర్తించవచ్చని మా స్టడీ తేల్చింది" అని ప్రొఫెసర్ ప్రదీప్ చెప్పారు.

**ఎన్ పీవై ప్రొటీన్..**

రక్తాన్ని పంప్ చేసే శక్తి తగ్గినపుడు గుండెపై ఒత్తిడి పెరుగుతుంది.. దీనిని తట్టుకోవడానికి గుండె కండరాల్లోని నాడులు ఎన్ పీవై ప్రొటీన్ను రిలీజ్ చేస్తాయని ప్రొఫెసర్ ప్రదీప్ చెప్పారు. దీనివల్ల గుండె లయ తప్పడంతోపాటు రక్తనాళాలు కుచించుకుపోయి హార్ట్ ఫెయిల్యూర్ తో మరణించే ప్రమాదం పెరుగుతుందన్నారు. రక్త పరీక్షతో ఎన్ పీవై ప్రొటీన్ లెవల్స్ను గుర్తిస్తే.. హార్ట్ ఫెయిల్యూర్ ముప్పును నివారించే అవకాశం ఉందని చెప్పారు.

# నేడు ఐపీఎల్-2024 ప్రారంభం...

## మ్యాచ్ మధ్యలో స్వీడన్ డీజే ఆక్స్ వెల్ ప్రదర్శన

**ఐపీఎల్ 17వ సీజన్ కు సర్వం సిద్ధం**

**తొలి మ్యాచ్ లో సీఎస్కేతో తలపడనున్న ఆర్సీబీ**

**ఓపెనింగ్ సెర్మనీలో సందడి చేయనున్న అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్**

**గానమాధుర్యంతో ఉర్రూతలూగించనున్న ఏఆర్ రెహమాన్, సోను నిగమ్**

ఐపీఎల్-2024 సీజన్ కు సర్వం సిద్ధమైంది. రేపు (మార్చి 22) చెన్నైలోని చిదంబరం స్టేడియంలో తొలి మ్యాచ్ జరగనుంది. చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగే ఈ పోరులో ఇన్నింగ్స్ మధ్యలో సంగీత కచేరి ఏర్పాటు చేశారు. స్వీడన్ కు చెందిన ప్రముఖ డీజే, రికార్డ్ ప్రొడ్యూసర్, రీమిక్స్ స్పెషలిస్ట్ ఆక్స్ వెల్ తన ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించనున్నాడు. ఈ మేరకు ఐపీఎల్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇక, మ్యాచ్ కు ముందు ఓపెనింగ్ సెర్మనీలో అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, ఏఆర్ రెహమాన్, సోను నిగమ్ ఆడిపాడనున్నారు. రేపు సాయంత్రం 6.30 గంటలకు ఐపీఎల్ ప్రారంభ వేడుకలు మొదలవుతాయి. స్టార్ స్పోర్ట్స్ చానల్ లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చు.

## పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కన్నుమూత



పాకి?స్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సయీద్ అహ్మద్ (86) అనారోగ్య సమస్యల కారణంగా కన్నుమూశారు. డాషింగ్ బ్యాటర్‌గా పేరున్న అహ్మద్ పాక్ తరపున 41 టెస్టులు ఆడి ఐదు సెంచరీలు, 16 హాఫ్ సెంచరీల సాయంతో 2991 పరుగులు చేశాడు. రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్ బౌలర్ అయిన అహ్మద్ పాక్ తరపున 22 వికెట్లు పడగొట్టాడు. 1958లో వెస్టిండీస్‌తో జరిగిన బ్రిడ్జ్‌టౌన్ టెస్ట్‌లో అరంగేట్రం చేసిన అహ్మద్.. తన స్వల్ప కెరీర్‌లో మూడు మ్యాచ్‌ల్లో పాక్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అహ్మద్ క్రికెట్ కెరీర్‌కు 20 ఏళ్ల చిరు ప్రాయంలోనే ఫుల్ స్టాప్ పడింది. 1972-73 ఆస్ట్రేలియా టూర్‌లో అహ్మద్ తన చివరి టెస్ట్ మ్యాచ్ (మెల్‌బోర్న్) ఆడాడు. ఫిట్‌నెస్ విషయంలో క్రికెట్ బోర్డుకు తప్పుడు సమాచారం అందించాడన్న కారణంగా అతని కెరీర్‌కు అర్ధంతంగా ఎండ్ కార్డ్ పడింది. పాక్ దిగ్గజం హనీఫ్ ముహమ్మద్ విండీస్‌పై చారిత్రక ట్రిపుల్ సెంచరీ (337) సాధించిన ఇన్నింగ్స్‌లో అహ్మద్ అతని భాగస్వామిగా ఉన్నాడు.ఆ ఇన్నింగ్స్‌లో అహ్మద్ 65 పరుగులు చేశాడు. అహ్మద్ పాక్ జాతీయ జట్టుకు ఆరో కెప్టెన్‌గా వ్యవహరించాడు. అహ్మద్ సారథ్యం వహించిన మూడు మ్యాచ్‌లు డ్రాగా ముగిసాయి. సయీద్ అహ్మద్ మరణవార్తను ప్రస్తుత పీసీబీ ఛైర్మన్ మొహిసిన్ నఖ్వీ క్రికెట్ ప్రపంచానికి తెలియజేశారు. సయీద్ అహ్మద్ సోదరుడు యూనుస్ అహ్మద్ కూడా పాక్ టెస్ట్ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. యూనుస్ పాక్ తరపున నాలుగు టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. 1987లో భారత్‌లో పర్యటించిన పాక్ జట్టులో యూనస్ సభ్యుడిగా ఉన్నాడు. ఆ పర్యటనలో పాక్‌కు ఇమ్రాన్ ఖాన్ సారథ్యం వహించాడు





# రొయ్యల స్పెషల్స్

## గోంగూరతో రొయ్యల కూర

**కావలసినవి:**

రొయ్యలు: పావుకిలో, గోంగూర: 4 కట్టలు(సన్నవి), పచ్చిమిర్చి: 15, ఉల్లిపాయలు: రెండు, ఎండుకొబ్బరి పొడి: టీస్పూను, అల్లంవెల్లుల్లి: 2 టీస్పూన్లు, గరం మసాలా : టీస్పూను, కారం: టీస్పూను, పసుపు: అరటీస్పూను, కొత్తిమీర తురుము: టేబుల్‌స్పూను, ఉప్పు: తగినంత, నూనె: 4 టేబుల్‌స్పూన్లు,

**తయారుచేసే విధానం:**

బాణలిలో గోంగూర, సన్నగా చీల్చిన పచ్చిమిర్చి, ఉప్పు వేసి వేయించాలి. తరవాత మిక్సీలో వేసి ముద్దలా చేయాలి. మరో బాణలిలో నూనె వేసి కాగాక ఉల్లిముక్కలు వేసి వేగాక రొయ్యలు వేసి ఓ నిమిషం ఉడికించాలి. రొయ్యల్లోంచే నీరు వస్తుంది. ఉప్పు, కారం, పసుపు, అల్లంవెల్లుల్లి ముద్ద వేసి బాగా కలపాలి. నీరు సరిపోదు అనుకుంటే కొద్దిగా పోసి ఉడికించాలి. రొయ్యలు ఉడికిన తరవాత ఎండుకొబ్బరి, గరంమసాలా, కొత్తిమీర తురుము, గోంగూర ముద్ద వేసి బాగా కలిపి నూనె తేలేవరకూ ఉడికించి దించాలి.



## ప్రాన్స్ సాంబార్ మసాలా

**కావల్సినవి:**

నూనె నాలుగుటేబుల్‌స్పూన్లు, ఉల్లిపాయలు నాలుగు, కొబ్బరి తురుము పావుకప్పు, వెల్లుల్లి ముద్ద టేబుల్‌స్పూను, టొమాటోలు ఆరు, జీలకర్రపొడి చెంచా, పసుపు చిటికెడు, కారం చెంచా,సాంబార్ మసాలా చెంచా, నీళ్లు కప్పు, వెనిగర్ చెంచా, చక్కెర టేబుల్‌స్పూను, కొత్తిమీర కట్ట, ఉప్పు తగినంత.



**తయారీ:**

ముందుగా బాణలిలో నూనె వేడిచేసి ఉల్లిపాయ ముక్కలు వేయించాలి. అవి వేగాక వెల్లుల్లి ముద్ద వేయాలి. రెండు నిమిషాల తరవాత కొబ్బరి ముద్ద వేయించాలి. కొబ్బరి పచ్చివాసన పోయాక కాసిని నీళ్లు చల్లాలి. అందులో టొమాటో ముక్కలూ, తగినంత ఉప్పూ, జీలకర్రపొడి, పసుపు, కారం, సాంబార్ మసాలా వేసేయాలి. కొన్ని నిమిషాలకు ఇది గ్రేవీలా తయారవుతుంది. అప్పుడు శుభ్రం చేసిన రొయ్యలూ, నీళ్లూ, చక్కెరా, వెనిగర్ వేసి బాగా కలపాలి. రొయ్యలు ఉడికి ఇది గ్రేవీలా తయారయ్యాక కొత్తిమీర చల్లి దింపేస్తే సరిపోతుంది.

## చింతచిగురు రొయ్యల కూర

**కావల్సినవి:**

చింత చిగురు కప్పు, కాస్త పెద్ద రొయ్యలు పావుకిలో, ధనియాల పొడి చెంచా, జీలకర్రపొడి అరచెంచా, ఉల్లిపాయ ఒకటి, కొత్తిమీర కట్ట, వెల్లుల్లి రేకలు ఐదారు, నూనె మూడు టేబుల్‌స్పూన్లు, గసగసాల పొడి చెంచా, దాల్చిన చెక్కపొడి అరచెంచా, అల్లం వెల్లులి పేస్టు చెంచా, పసుపు చిటికెడు, ఉప్పు తగినంత, పచ్చిమిర్చి ఐదు, కారం చెంచా.



**తయారీ:**

ముందుగా రొయ్యలని శుభ్రం చేసి పెట్టుకుని అందులో పసుపూ, కొద్దిగా ఉప్పూ, సగం అల్లంవెల్లుల్లి పేస్టు వేసి వాటికి పట్టేట్టుగా కలిపి పెట్టుకోవాలి. ఇప్పుడు కడాయిలో నూనె వేసి అది వేడెక్కాక తరిగిన ఉల్లిపాయముక్కలూ, పచ్చిమిర్చీ వేసి దోరగా వేయించుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు వేగాక అందులో రొయ్యలు కూడా వేయాలి. పచ్చివాసన పోయేవరకూ వేయించి అప్పుడు మూత పెట్టి మరికాస్త సేపు మగ్గనివ్వాలి. ఇప్పుడు చింతచిగురుని అరచేతుల్లో వేసి బాగా నలిపితే పొడిలా తయారవుతుంది. దీన్ని రొయ్యల్లో వేసి మిగిలిన అల్లంవెల్లుల్లి పేస్టూ, వెల్లుల్లిరేకలూ చేర్చాలి. తర్వాత ఉప్పూ, కారం, గసగసాలపొడీ, జీలకర్రపొడి, దాల్చిన చెక్కపొడి, ధనియాలపొడి వేసుకోవాలి. అవన్నీ వేసి బాగా కలిపిన తర్వాత కాసిని నీళ్లు పోసి మూతపెట్టేయాలి. ఇందులో ప్రత్యేకించి మసాలా వేయాల్సిన అవసరం లేదు. కూర దగ్గరకు వచ్చిన తర్వాత దింపేసి, కొత్తిమీరతో అలంకరిస్తే చాలు.

## రొయ్యల కిచిడీ

**కావల్సినవి:**

శుభ్రం చేసి, కారం, ఉప్పు పట్టించిన రొయ్యలు కప్పు, పసుపు అరచెంచా, సాంబార్ పొడి చెంచా, పచ్చిమిర్చి తరుగు చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు చెంచా, ఉప్పు తగినంత, కరివేపాకు రెబ్బలు రెండు, టొమాటో, బంగాళాదుంప ఒక్కోటి చొప్పున, కొబ్బరితురుము రెండు చెంచాలు, ఉల్లిపాయలు రెండు, బియ్యం రెండుకప్పులు, నాన బెట్టిన పెసరపప్పు టేబుల్‌స్పూను, మినప్పప్పు టేబుల్‌స్పూను(నానబెట్టుకోవాలి), నెయ్యి రెండు టేబుల్‌స్పూన్లు.



**తయారీ:**

కుక్కర్‌ని పొయ్యిమీద పెట్టి నెయ్యి వేయాలి. అది కరిగాక ఉల్లిపాయముక్కలు వేయించాలి. అవి వేగాక పచ్చిమిర్చి తరుగూ, అల్లంవెల్లుల్లి ముద్ద, టొమాటో ముక్కలూ, కరివేపాకు రెబ్బలూ, కొబ్బరితురుమూ, బంగాళాదుంప ముక్కలూ, రొయ్యలు వేయాలి. రొయ్యలు కొద్దిగా వేగాయనుకున్నాక కడిగిన బియ్యం, పెసరపప్పు, మినప్పప్పు, తగినంత ఉప్పూ, పసుపూ, సాంబార్‌పొడి, నాలుగున్నర కప్పుల నీళ్లు పోసి మూత పెట్టేయాలి. మూడు కూతలు వచ్చాక దింపేస్తే చాలు.

## వంటకు నియమాలున్నాయి

- స్త్రీలు వంటచేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకొంటే ఇంటిలోని వారంతా ఆరోగ్యంగా ఉంటారు.
- పప్పుదినుసుల్ని, కూరగాయల్ని వాడేదానికి ముందు, ఉడికించిన తర్వాత సరైన పద్ధతులు పాటించి పోషక పదార్థాలు నష్టపోకుండా జాగ్రత్త పడాలి.
- వంట చేయబోయే ముందు చేతుల్ని శుభ్రంగా కడుక్కోవాలి. చేతిని తుడుచుకోడానికి మంచిగుడ్డ కాని నాప్‌కిన్ గాని వాడాలి.
- కూరలు తరగటానికి ఉపయోగించే చాకు, కత్తిపీట వంటి వాటిని కడిగిన తర్వాతే వాడాలి.
- ఆకుకూరలనూ, కాయగూరలనూ కూడా తరిగే ముందు కడగాలి.చి వంట పాత్రలను మంచినీటితో కడిగిన తర్వాతే వాటిని వాడాలి.



- పదార్థాలని ఉడికించేటప్పుడు వాటికి తగినన్ని నీళ్ళు మాత్రమే పోయాలి. ఎక్కువ నీళ్ళు పోస్తే దాంట్లోని పోషకాలు నశిస్తాయి.
- ఆవిరి మీద ఉడికించిన (లేక కుక్కరులో వండిన) పదార్థాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి.
- పదార్థాల్ని ఏవిధంగా ఉడకబెట్టినా వాటిపై తప్పక మూతలు ఉండాలి.
- ఆకు కూరలలో గడ్డి, పీచు మొదలైనవి లేకుండా చూడాలి. ఒక్కొక్క సారి ఆకుల వెనుక వైపున పురుగు గుడ్లు కూడా ఉంటాయి. అందుకే వాటిని చాలా జాగ్రత్తగా కడగాలి.
- వంటయింట్లోకి గాలి, వెలుతురు బాగారావాలి. తలుపు లెప్పుడూ మూసి ఉంచకండి. మూసి ఉంచినట్లైతే ఒక విధమైన వాసన వస్తుంది. బొద్దింకలు, సాలీళ్ళు మొదలైన క్రిములెన్నో చేరతాయి.
- వంట ఇంటిలో తడి బూజులు లేకుండా చూసుకోవాలి.
- కిచెన్‌లో రాత్రి పూట ఒక చిన్న బల్బును వేసి ఉంచితే బొద్దింకలు, పురుగులు చేరవు.
- పప్పులు కడిగిన నీళ్ళు, కూరలు ఉడికించిన నీళ్ళు సింక్‌లో పోస్తే వెంటనే మంచినీరు పోసి కడగాలి. తర్వాత కొద్దిగా డెటాల్ నీళ్ళను గాని, ఫినాయిల్ కలిపిన నీళ్ళుగాని పోస్తే మురికి వాసన ఉండదు.
- కిచెన్‌లో వంటచేసే చోటును (లేదా స్టౌ పెట్టే గట్టును) సింక్‌ను తరచుగా డెటాల్‌తో కడుగుతుండాలి.
- ఒక అరబకెట్ నీళ్ళలో 2, 3 చుక్కలు డెటాల్ వేస్తే చాలు. ఫినాయిల్ వాసన కిట్టనివారికి ఇది మంచిది.
- కూరలు తరిగేటప్పుడు వచ్చిన పై పొట్టు (లేక పెచ్చులు) ఆకుకూరల మొదళ్ళు వెంటనే తీసుకెళ్ళి డస్ట్‌బిన్‌లో వేస్తుండాలి.
- వెట్‌గ్రైండర్, మిక్సీజార్‌లను వాడిన వెంటనే కడిగి శుభ్రపరచాలి.
- సింక్‌లో కలరాఉండలు వేసి ఉంచితే పురుగులు,బొద్దింకలు రావు.
- మీ పెంపుడు జంతువుల్ని ఎప్పుడూ వంటగదిలోకి రానీయకండి. గ్యాస్ స్టవ్ గురించి జాగ్రత్తలుచి గ్యాస్ స్టవ్‌ని నేలకు రెండున్నర అడుగుల ఎత్తైన బల్లపై గాని అరుగుపై గాని పెట్టి ఉంచాలి.చి స్టవ్‌కు క్రిందుగా రెండు అడుగుల దూరంలో సిలెండర్ అమర్చుకోవాలి.
- సిలెండర్‌ను ఎప్పుడూ నిటారుగా నిలబెట్టే ఉంచాలి. అంతేగాని ఏటవాలుగా గాని , అడ్డంగా గాని పెట్ట కూడదు.
- గ్యాస్ స్టవ్‌ని లైటర్‌తోనే వెలిగించడం మంచిది. అగ్గి పెట్టెవద్దు.
- గ్యాస్ స్టవ్ దగ్గర్లో పెట్రోలు, కిర్సనాయిల్ లాంటి మండే పదార్థాలేమీ ఉండకూడదు. కొద్దిపాటి వేడికే అవి అంటుకొంటాయి. కనుక చాలా ప్రమాదం.
- స్టవ్ బర్నర్ స్విచ్‌లను కట్టివేసి రెగ్యులేటర్ కూడా కట్టివేయాలి. అప్పుడు గ్యాస్ లీకేజీకి అవకాశం ఉండదు.
- మీరు వంటిల్లు తెరిచేసరికి గ్యాస్ వాసన వస్తోంటే అగ్గిపుల్ల వెలిగించడం, లైట్ స్విచ్ వేయడం చేయకండి. కిటికీలూ, తలుపులూ అన్నీ తెరచి మెకానిక్ ను పిలవండి. – గ్యాస్ స్టవ్ వెలిగించమనో, ఆర్పివేయమనో పిల్లలని పురమాయించకండి. అసలు పిల్లల్ని స్టవ్ సమీపంలోకే రానివ్వవద్దు. – వంటచేసేటప్పుడు ఎప్పుడూ కాటన్ బట్టలే ధరించండి. – గ్యాస్ స్టవ్ మీదనుండి పాత్రలను, మూకుడు, మొదలైన వాటిని దింపడానికి పట్టకారు ఉపయోగించండి.

## తాపాన్ని తగ్గించే ఫ్రూట్ యోగర్ట్

ఎండలు మండిపోతున్నాయ్. అలా అరగంట బయటికి వెళ్లొస్తే చాలు... ఒంట్లో సగం నీరు బయటికిపోతున్నట్టే అనిపిస్తుంది. అందుకే సమ్మర్ సీజన్లో తీసుకోవాల్సిన ఆహారం వేరే ఉంటుంది. ఒంటికి చల్లదనాన్ని అందించే ఆహారాన్ని తీసుకోవాలి. ఇదిగో ఈ ఫ్రూట్ యోగర్ట్ చేసుకుని తినండి.

**కావాల్సిన పదార్థాలు**

పుచ్చాకయ ముక్కలు రెండు కప్పులు, పెరుగు (చిక్కనిది) ఒక కప్పు, చక్కెర రెండు టీస్పూనులు, తేనె ఒక టేబుల్ స్పూను, కండెన్స్ డ్ మిల్క్ క్రీమ్ రెండు టీస్పూనులు, నిమ్మరసం అర టీస్పూను

**తయారుచేసే విధానం:**

పుచ్చకాయల గింజలు తీసేసి ముక్కలు కోసుకోవాలి. మరీ చిన్నవి, పెద్దవి కాకుండా మీడియం సైజులో ఉండాలి ముక్కలు. వాటిని ప్లాస్టిక్ కవర్ లో వేసి డీఫ్ ఫ్రిజ్ లో రాత్రంతా పెట్టాలి. అవి మంచుముక్కల్లా ఫ్రీజ్ అవుతాయి. ఇప్పుడు మిక్సీ గిన్నెలో ఈ పుచ్చకాయ ముక్కలు, పంచదార, మిల్క్ క్రీమ్, పంచదార, నిమ్మరసం వేసి బాగా తిప్పాలి. మెత్తటి పేస్టులా అవుతుంది. దీనిని తీసి ఒక గిన్నెలో వేసి డీఫ్రీజ్ లో గంటసేపు ఉంచాలి. ఆతరువాత మళ్లీ బయటికి తీసి మిక్సీలో వేయాలి. ఆ పేస్టు ఇంకా మృదువుగా అవుతుంది. దానిని గిన్నెలో వేసి మళ్లీ డీప్ ఫ్రిజ్ లో పెట్టాలి. ఇలా రెండు మూడు సార్లు ఫ్రిజ్ లో పెట్టి తీసి, మిక్సీ వేసి ఇలా చేస్తుంటే అది ఐస్ క్రీములా తయారవుతుంది. అంతే ఫ్రూట్ యోగర్ట్ సిద్ధమైనట్టే. దానిలో చిన్న పండ్ల ముక్కలు వేసుకుని తింటే భలే టేస్టీగా ఉంటుంది.



## 'కందిపొడి' రుచికి ఫిదా అవ్వాల్సిందే..!

తినడానికి ఎన్ని రకాల పదార్థాలున్నా... వాటిలో కొన్నింటిని తింటే మాత్రం మళ్లీ మళ్లీ తినాలనే అనుభూతి కలుగుతూ ఉంటుంది. ఆ కోవకు చెందిందే మన తెలుగు వంటకం 'కందిపొడి'. ప్రతి ఒక్కరు ఎంతో ఆస్వాదిస్తూ తినగలిగే వాటిల్లో ఇదీ ఒకటి. వేడివేడి అన్నంలో కందిపొడి కలిపి అందులో కాస్తా నెయ్యివేసి తింటే ఆ రుచి వర్ణించలేనిది.... మరెందుకు ఆలస్యం 'ఆంధ్ర స్పెషల్ కందిపొడి'ని వెంటనే చేసేద్దాం...

కందిపొడి తయారీకి కావాల్సిన పదార్థాలు...

కందిపప్పు కప్పు, పుట్నాల పప్పు కప్పు, మిరపకాయలు 10 నుంచి 12, జీలకర్ర 3 టీ స్పూన్లు, మెంతులు అర స్పూను, వెల్లుల్లి 10, ఉప్పు సరిపడినంత, కరివేపాకు సరిపడినంత, ఇంగువ కొంచెం.

**తయారీ విధానం...**


* పొయ్యిమీద బాణలి పెట్టి మొదట కందిపప్పును, కాసేపటి తర్వాత పుట్నాల పప్పును వేసి చక్కగా వేయించి పక్కన పెట్టుకోవాలి.

* బాణలిలో స్పూన్ నూనె వేసి..అందులో జీలకర్ర, ఎండుమిర్చి, మెంతులు, కరివేపాకు.. చివరగా వెల్లుల్లి వేసి వేయించుకోవాలి. సన్నని మంట మీద మాత్రమే వేయించుకోవాలి. మాడిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.

* బాగా వేగాక ఈ మిశ్రమాన్ని మిక్సీ జార్‌లో వేసి..సరిపడా ఉప్పు, కొంచెం ఇంగువ వేసి మరీ మెత్తగా కాకుండా మిక్సీ చేసుకోవాలి.

* తర్వాత ఈ మిశ్రమానికి వేయించుకుని పెట్టుకున్న కందిపప్పు, పుట్నాల పప్పు జతచేసి పొడిగా అయ్యేవరకు మిక్సీ చేసుకోవాలి.

* కందిపప్పుతోపాటు, కందులు కూడా కలిపి వాడితే మరింత రుచిని ఆస్వాదిస్తారు.





* ఈ పొడిని ఇడ్లీతోపాటు ఇతర టిఫిన్లతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

గమనిక: కందులు, మెంతులు అదనపు రుచికోసం వినియోగించవచ్చు.

**కందిపొడి అన్నం...**

బాణలిలో రెండు లేదా మూడు స్పూన్ల నెయ్యివేసి, అందులో కరివేపాకు వేసి వేయించుకోవాలి. తర్వాత పైన తయారు చేసి పెట్టుకున్న కందిపొడిని నెయ్యిలో వేసి బాగా కలపాలి. తర్వాత అన్నం వేసుకుని కందిపొడి సరిగా కలిసేవరకు కలుపుకోవాలి. పొయ్యి ఆర్పివేసి... కొద్ది సేపటి తర్వాత తింటే రుచికరమైన కందిపొడి అన్నం తిన్న అనుభూతి మీ సొంతం.

### కొత్త అనుభూతిని పంచుతూ అందరినీ

## మెప్పించే చిత్రం 'టిల్లు స్క్వేర్' : మల్లిక్ రామ్



తెలుగునాట యువతలో కల్ట్ ఫాలోయింగ్ సంపాదించుకున్న సినిమాలలో 'డీజే టిల్లు' ఒకటి. టిల్లుగా స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ పంచిన వినోదాన్ని ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. టిల్లు మాటలు, చేష్టలు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్ గా 'టిల్లు స్క్వేర్' వస్తోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. మార్చి 29న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా దర్శకుడు మల్లిక్ రామ్ మీడియాతో ముచ్చటించి చిత్ర విశేషాలను పంచుకున్నారు. సిద్ధుతో నాకు ఎప్పటి నుంచో పరిచయం ఉంది. దాదాపు ఇద్దరం ఒకేసారి సినీ ప్రయాణం మొదలుపెట్టాం. మేమిద్దరం కలిసి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. నా మొదటి సినిమా నరుడా ఓ నరుడా. ఆ తర్వాత అద్భుతం అనే సినిమా చేశాను. మధ్యలో పెళ్లి గోల అనే వెబ్ సిరీస్ కూడా చేశాను. అది చాలా పెద్ద హిట్ అయింది. డీజే టిల్లు, అద్భుతం సినిమాలు ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయి. ఆ తర్వాత నేను, సిద్ధు కలిసి ఒక సినిమా చేయాలి అనుకున్నాం. అదే సమయంలో నాగవంశీ గారు 'టిల్లు స్క్వేర్' చేస్తే బాగుంటుందని చెప్పడం, డీజే టిల్లు దర్శకుడు విమల్ కృష్ణ ఇతర కమిట్ మెంట్స్ తో బిజీగా ఉండటంతో నేను ఈ ప్రాజెక్ట్ లోకి వచ్చాను. మొదట కాస్త సంకోచించాను కానీ కథ బాగా వచ్చేసరికి ఇక వెనకడుగు వేయలేదు. అద్భుతం సినిమాకి కూడా కథ నాది కాదు. ప్రశాంత్ వర్మ ఇచ్చిన కథకు నేను దర్శకత్వం వహించాను. నరుడా డోనరుడా కూడా రీమేక్. నాకు ఆ కథ బాగా నచ్చి చేశాను. నేను కథలు రాయగలను.. అలాగే ఇతరులు రాసిన కథలను తెరకెక్కించి వాటికి న్యాయం చేయగలను. అలాగే సిద్ధుకి పేరు వస్తుందంటే నాకు ఆనందమే. ఎందుకంటే నేను, సిద్ధు, ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా మేమంతా ఈ స్థాయికి రావడం కోసం దాదాపు 12 ఏళ్లుగా కష్టపడుతున్నాం. ఇప్పుడు కలిసి సినిమాలు చేస్తున్నాం. కాబట్టి ఎవరికి క్రెడిట్ వచ్చినా సంతోషమే. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ కి వ్యత్యాసం ఉంటుంది. డీజే టిల్లు డెడ్ బాడీ నేపథ్యంలో సాగే బ్లాక్ కామెడీ. కానీ టిల్లు స్క్వేర్ అలా ఉండదు. ఒక కమర్షియల్ సినిమాలా ఉంటుంది. టిల్లు పాత్ర తీరు అలాగే ఉంటుంది. రాధిక పాత్ర ప్రస్తావన ఉంటుంది. మొదటి భాగాన్ని ముడిపెడుతూ కొన్ని సన్నివేశాలు ఉంటాయి. డీజే టిల్లుని గుర్తు చేస్తూనే టిల్లు స్క్వేర్ మీకొక కొత్త అనుభూతిని ఇస్తుంది.

## సోషల్ మీడియాలో సరికొత్త రికార్డు సృష్టించిన ఐకాన్ స్టార్



ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్ ఫాలోయింగ్, ఆయనకున్న క్రేజ్ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పుష్ప చిత్రంతో అంతర్జాతీయంగా అభిమానులను సంపాందించుకున్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ రోజు రోజుకు తన పాపులారిటీని పెంచుకుంటూనే పోతున్నాడు. ప్రతి విషయంలో తనకంటూ ఒక బలమైన మార్క్‌ను క్రియేట్ చేసుకంటున్నాడు. ఇటీవల ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డ్‌తో అందుకున్న తొలి తెలుగు హీరోగా రికార్డ్ క్రియేట్ చేసిన అల్లు అర్జున్ అన్ని విషయాల్లోనూ అందర్ని దాటి ముందుకు దూసుక వెళు తున్నాడు. తాజాగా తన సోషల్ మీడియా ఇన్‌స్టా అకౌంట్ ఫాలోవర్స్ విషయంలో ఐకాన్‌స్టార్ కొత్త రికార్డును నెలకొల్పాడు. అల్లు అర్జున్ ఇన్‌స్టా అకౌంట్‌ను కోట్ల మంది ఫాలో అవుతున్నాడు. ఇన్‌స్టాలో ఎప్పుడూ యాక్టివ్‌గా వుండే ఈ ఐకాన్‌స్టార్ 25 మిలియన్ల ఫాలోవర్స్ ను చేరుకున్నాడు. ఇన్‌స్టాలో ఇంత మంది ఫాలోవర్స్ వున్న మొదటి సౌత్ హీరో అల్లుఅర్జున్ కావడం విశేషం. ఈ విషయాన్ని ఐకాన్‌స్టార్ తన అకౌంట్‌లో తెలుపుతూ మీ అభిమానానికి ఎప్పటికి థ్యాంక్స్ అంటూ పోస్ట్‌ను పెట్టాడు. ఇక ఈ విషయంలో తమ హీరో క్రియేట్ చేసిన రికార్డు విషయంలో ఐకాన్‌స్టార్ అభిమానులు ఫుల్ ఖుషీలో వున్నారు. అంతేకాదు అల్లు అర్జున్ నటిస్తున్న తాజా చిత్రం పుష్ప ది రూల్ (పుష్ప-2) ఎన్ని రికార్డులు క్రియేట్ చేయనుందో అంటూ లెక్కలేసుకుంటున్నారు ఐకాన్‌స్టార్ అభిమానులు.

## వైభవంగా "తలకోన" ప్రి రిలీజ్

అక్షర క్రియేషన్ పతాకంపై నగేష్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్ రెడ్డి ( చేవెళ్ల) నిర్మాతగా అప్సర రాణి ప్రధాన పాత్రలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ "తలకోన" . ఈ చిత్రం అన్ని హంగులు పూర్తి చేసుకుని మార్చి 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఫిల్మ్ ఛాంబర్ లో ప్రి రిలీజ్ వేడుక నేడు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా ప్రముఖ నిర్మాతలు రామసత్యనారాయణ, సాయి వెంకట్, %ణం% రావు, ప్రముఖ హీరో రమాకాంత్ ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ పార్థు రెడ్డి



తదితరులు పాల్గొని చిత్ర యూనిట్ కు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత శ్రీదర్ రెడ్డి మాట్లాడుతూ.. మా హీరోయిన్ అప్సర రాణి ఇప్పటివరకు చేయని వెరైటీ సబెక్ట్ ఇది.అవుట్ అండ్ అవుట్ యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ కథాంశం మొత్తం ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో ఉండబోతోంది. అయితే ఫారెస్ట్ అనగానే కేవలం ప్రకృతి అందాలే కాదు అందులో ఇంకో కోణం కూడా వుంటుందని చూపించాం.అదే విదంగా పాలిటిక్స్, మీడియాను సైతం మిక్స్ చేసి చూపించడం జరుగుతుంది. అందుకు తగ్గ టీమ్ ను, టెక్నికల్ టీమ్ కూడా సినిమాకు తీసుకోవడం జరిగింది. అలాగే థ్రిల్లింగ్ సస్పెన్స్ తో మార్చి 29 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అన్నారు. దర్శకుడు నగేష్ నారదాసి మాట్లాడుతూ.. అప్సర రాణీ నీ చూస్తే కాశ్మీర్ యాపిల్ ల కనిపిస్తుంది.కానీ ఈ సినిమాలో తను కాశ్మీర్ మిర్చి లా నటించింది . చాలా వెరైటీ స్టోరీ ఇది .షూటింగ్ "తలకొనలో అద్భుతంగా జరిగింది అని అన్నారు. హీరోయిన్ అప్సర రాణీ మాట్లాడుతూ"నా కెరీర్ లో ఈ చిత్రం డెఫినెట్ గా ఓ మైలు రాయి గా నిలుస్తుంది.
నేనింతవరకు చేయని ఫైట్స్ ఈ చిత్రంలో చేయడం జరిగింది. మాస్ & క్లాస్ ఆడియన్స్‌కు కావలసిన అన్ని అంశాలు ఈ చిత్రంలో వున్నాయి. కచ్చితంగా ఈ సినిమా హిట్ అవుతుందని ఆశిస్తున్నాను" అని అన్నారు.

### తిరుపతిలో డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ ఓపెన్ చేసిన

## యంగ్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని




ఊర్వశివో రాక్షసివో, బేబి, అంబాజీపేట మ్యారేజి బ్యాండు వంటి విజయవంతమైన చిత్రాలతో సక్సెస్ ఫుల్ యంగ్ ప్రొడ్యూసర్ గా టాలీవుడ్ లో పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన ప్రొడ్యూసర్ గానే కాదు సక్సెస్ ఫుల్ డిస్ట్రిబ్యూటర్ గా పలు సూపర్ హిట్ సినిమాలను పంపిణీచేస్తున్నారు. బేబి, గుంటూరు కారం, హనుమాన్, గామి వంటి బ్లాక్ బస్టర్ మూవీస్ ను పంపిణీ చేసి డిస్ట్రిబ్యూషన్ రంగంలో దూసుకెళ్తున్నారు ధీరజ్ మొగలినేని. ఆయన తాజాగా సీడెడ్ ఏరియా పంపిణీ రంగంలోకి అడుగుపెట్టారు. ప్రముఖ సీడెడ్ డిస్ట్రిబ్యూటర్ యతితో కలిసి తిరుపతిలో డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ ఓపెన్ చేశారు ధీరజ్ మొగిలినేని.

ప్రస్తుతం ఆయన శ్రీ విష్ణు హీరోగా నటించిన 'ఓం భీమ్ బుష్', సిద్ధు జొన్నలగడ్డ 'టిల్లు స్క్వేర్'తో పాటు మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. తిరుపతిలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ ఆఫీస్ ఓపెన్ సందర్భంగా ఆయనకు ఇండస్ట్రీ మిత్రులు, శ్రేయోభిలాషులు, సన్నిహితుల నుంచి శుభా కాంక్షలు అందుతున్నాయి.

### ప్రైమ్ వీడియోస్ సంచలనం...

# 70కిపైగా సిరీస్‌లు

ప్రైమ్ వీడియో, భారతదేశం అత్యంత ఇష్టపడే వినోద గమ్యస్థానం, ఈ రోజు తన రెండవ ప్రైమ్ వీడియో ప్రెజెంట్స్ ఇండియా షోకేస్‌లో దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మరియు విభిన్నమైన కంటెంట్ స్లేట్‌ను ఆవిష్కరించింది, దాదాపు 70 సిరీస్‌లు మరియు చలనచిత్రాలు ఉన్నాయి, వాటిలో ఎక్కువ భాగం ఈ సేవలో తదుపరి 2 సంవత్సరాలు ప్రీమియర్ అవుతాయి. 40 ఒరిజినల్ సిరీస్‌లు మరియు చలనచిత్రాలు మరియు 29 భారతదేశంలోని అతిపెద్ద మరియు అత్యంత అంచనాలు ఉన్న చలనచిత్రాలలో కొన్నింటితో, కొత్త స్లేట్ కస్టమర్‌లను ఆహ్లాదపరిచేందుకు మరియు నిమగ్నమవ్వడానికి అత్యుత్తమ భారతీయ వినోదాన్ని అందజేస్తుందని హామీ ఇచ్చింది. ప్రైమ్ వీడియో రాబోయే ఒరిజినల్‌లు ఇంటిలోని ప్రతి ఒక్కరికీ ఏదో ఒకదానిని అందిస్తాయి, ఇందులో హిందీ, తమిళం మరియు తెలుగులో అనేక రకాలైన అనేక రకాల సిరీస్‌లు మరియు చలనచిత్రాలు ఉన్నాయి. ఉత్కంఠభరితమైన థ్రిల్లర్‌లు మరియు ఆకట్టుకునే డ్రామాల నుండి పక్కటెముకలను కదిలించే కామెడీలు మరియు వెన్నెముకను చిలికిపోయే భయానక, చమత్కారమైన స్క్రిప్ట్ లేని షోలు, యువకులకు మనోహరమైన కథనాలు, హై-ఆక్టేన్ యాక్షన్ మరియు ఆకట్టుకునే సంగీత నాటకాల వరకు, విభిన్నమైన స్లేట్ ఉత్తమ




స్థానిక కథలను తెరపైకి తెస్తుంది.

ఇది భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫిల్మ్ స్టూడియోలలోని కొన్ని భాషల సినిమాలకు అదనం.



### పృథ్వీరాజ్ సుకుమారన్

## "ది గోట్ లైఫ్" లిరికల్ సాంగ్

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా ఈ నెల 28న పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమాను బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా భారీ బడ్జెట్ తో నిర్మించింది. డబుల్ ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతాన్నందించిన "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా నుంచి 'తేజమే రెహమానేనా..' అనే లిరికల్ సాంగ్ ను ఇవాళ విడుదల చేశారు. 'తేజమే రెహమానేనా..' లిరికల్ సాంగ్ కు రాకేందు మౌళి లిరిక్స్ అందించగా జితిన్ రాజ్ పాడారు. ఏఆర్ రెహమాన్ ఎప్పటిలాగే బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. 'తేజమే రెహమానేనా తేజమే రహీమ్, యాడున్నావో యాడున్నావో గుండె తడవగ వానై పో..ఉప్పే లేని కన్నీరొలికి, ఆవిరి పెదవుల తాకగ రా..ఆటు పోటుల ఆకలి ఎడారిలో చూడన చూడన నీ కలకై...' అంటూ ఎడారి కష్టాల్లో ఉన్న హీరో తన ప్రేయసిని తల్చుకుంటూ పాడే ఎమోషనల్ సాంగ్ ఇది. ఈ పాటలో రెహమాన్ కనిపించడం విశేషం. ఈ సినిమా షూటింగ్ జరిగిన ఏడారికి స్వయంగా వెళ్లిన రెహమాన్ ..అక్కడ హీరో క్యారెక్టర్ పడే సంఘర్షణను, ప్రకృతిని తానూ అనుభూతి చెందుతాడు. ఆ ఫీల్ తోనే ఈ పాట కంపోజ్ చేసినట్లు రెహమాన్ లిరికల్ వీడియోలో వెల్లడించారు.



# మంత్రి పొన్నం... నోరు అదుపులో పెట్టుకో

### ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్. కుమార్

హైదరాబాద్, (వెలుతురు):
అధికారం మదంతో కండ్లు నెత్తికెక్కి అహంకారంతో మంత్రి పొన్నం బీజేపీ నాయకుల గురించి మాట్లాడుతున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్. కుమార్ అన్నారు. బీజేపీ విధానాలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలియవన్నారు. బీజేపీలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పార్టీ అధ్యక్షుడిని మార్చుతారని బండి సంజయ్ మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం పార్టీ అధ్యక్షుడిగా పని చేశారని ఆయన గుర్తు చేశారు. పార్టీ ఆదేశాల మేరకే బండి సంజయ్‌కి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవినిచ్చి గౌరవించిందన్నారు. మంత్రి పోన్నం సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల సంఘటనను గుర్తుతెచ్చుకో పోన్నం అన్నారు. అప్పుడు నీవు ఎక్కడ దాక్కున్న అప్పుడు అధికారంలో ఉన్న టీఆర్ఎస్ దళితులపై లారీలతో ఎక్కించి తొక్కించిన ఘటన మరిచిపోయావా అన్నారు. ఆ సంఘటనను జాతీయస్థాయిలో తీసుకువెళ్లి ఎస్సీ కమిషన్‌ను పిలిపించి న్యాయ పోరాటం చేసిన వ్యక్తి బండి సంజయ్ అన్నారు. పార్టీ సిద్ధాంతాల కోసం విధానాల కోసం ప్రజా సమస్యలపై పోరాడిన నాయకుడు బండి సంజయ్ అన్నారు. ముందు మంత్రి శ్రీధర్ బాబు నీ మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పరిష్కరించుకో ఆ తర్వాత బీజేపీ గురించి మాట్లాడు అని పేర్కొన్నారు.

# ఢిల్లీలో కుప్పకూలిన రెండంతస్తుల బిల్డింగ్

### ఇద్దరు మృతి, ఆరుగురు కార్మికులకు తీవ్ర గాయాలు

న్యూఢిల్లీ,మార్చి21(వెలుతురు):
ఢిల్లీలోని కబీర్ నగర్ లో ఘోర ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న భవనంలోని ఒక భాగం ఇవాళ (గురువారం) తెల్లవారు జామున 2. 30 గంటల సమయంలో కుప్పకూలి పోయింది. భవనం కూలిన టైంలో అందులో కార్మికులు పనులు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు చనిపోగా.. ఆరుగురు కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు ఘటన స్థలికి



చేరుకొని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సహాయంతో సహాయక చర్యలు కొనసాగించారు. గాయపడిన వారిని స్థానిక జీటీబీ ఆస్పత్రికి తరలించగా.. అయితే, అర్షద్, తౌహీద్ లు చికిత్స పొందుతూ మరణించారు. రెహాన్, అరుణ్, నిర్మల్, జలధర్ లు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు వెల్లడించారు.ఇక, భవనం కూలిన టైంలో అందులో 13 మంది కార్మికులు పని చేస్తున్నారని డీసీపీ రాజేష్ డియో చెప్పారు. భవన నిర్మాణంకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ పర్మిషన్ తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, భవనం కూలిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. కాగా, ఢిల్లీ అగ్నిమాపక శాఖ అధికారి అనుప్ మాట్లాడుతూ.. సమాచారం వచ్చిన వెంటనే అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వచ్చినట్లు పేర్కొన్నారు. వారు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు.. భవనం శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురు కూలీలను బయటకు తీసినట్లు పేర్కొన్నారు. గాయపడిన వారికి చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించామన్నారు.

# రజాకార్ సినిమా నిర్మాతకు బెదిరింపులు

### సీఆర్పీఎఫ్ భద్రత కల్పించిన కేంద్రం

హైదరాబాద్,మార్చి21(వెలుతురు):
రజాకార్ సినిమా నిర్మాతకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీనిపై ఆయన పోలీసులతో పాటుగా కేంద్ర హెూంశాఖకు కూడా ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కేంద్రం నిఘా వర్గాల ద్వారా దర్యాప్తు జరిపి ఆయనకు భద్రతను కల్పిస్తున్నట్లు వెల్లడించింది. పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా ప్రస్తుతం థియేటర్స్ లో సందడి చేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదలకు ముందే సంచలనంగా మారిన సినిమా రజాకార్. ఈ చిత్రం మార్చి 15న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాను బేజీపీ నేత, సినిమా నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు.అయితే ఈ చిత్రాన్ని నిలుపుదలచేయాలని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిర్మాత నారాయణ రెడ్డికి బెదిరింపు కాల్స్ చేశారు. తనకు దాదాపు 1,100 బెదిరింపు కాల్స్ వచ్చినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆయన కేంద్ర హెూంశాఖకు కూడా ఫిర్యాదు చేశారు. నారాయణ రెడ్డి ఫిర్యాదుపై వెంటనే కేంద్రం స్పందించింది. ఆయనకు 1o1 సీఆర్పీఎఫ్ భద్రతను కల్పిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. నిఘా వర్గాల ద్వారా తమకు అందిన సమాచారం మేరకు నారాయణ రెడ్డికి 1o1 సీఆర్పీఎఫ్ భద్రతను కల్పిస్తున్నట్లు కేంద్ర హెూంశాఖ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ విముక్తి పోరాటం నేపథ్యంలో దర్శకుడు యాటా సత్యనారాయణ రజాకార్ చిత్రాన్ని తెరకెక్కించారు. నిజాం కాలంలో హైదరాబాద్ లో జరిగిన దారుణ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కించాడు.ఈ సినిమాలో ప్రముఖ యాంకర్ అనసూయ భరద్యాజ్ కీలక పాత్రలో పోషించారు. ఈమెతో పాటుగా బాబీ సింహా, వేదిక, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే, అనుష్యా త్రిపాఠి కీలక పాత్రలు పోషించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ చిత్రం విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల దృష్ట్యా విడుదల కాలేకపోయింది. దీంతో ఈ సినిమాను మార్చి 15న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. ఈ సినిమా విడుదలకు ముందే దీన్ని విడుదల ఆపాలని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు.

# ప్రధాని మోడీ సభలో భద్రతా వైఫల్యం

### నివేదిక కోరిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,మార్చి21(వెలుతురు): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యంపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. దీనిపై నివేదిక ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాను కోరింది. త్వరగా విచారణ పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 17న చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో భాజపా, తెదేపా, జనసేన కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రజాగళం' సభలో ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభలో పోలీసుల వైఫల్యం అడుగడుగునా కనిపించింది. పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తన యంత్రాంగంతో బందోబస్తు విధులు సమర్థంగా చేయించటంలో విఫలమయ్యారని విపక్షాలు ఆరోపించాయి. ప్రధాని సభలో జరిగిన తొక్కిసలాట, రభసే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నాయి. ప్రధాన వేదికకు సమీపంలో ఉన్న గ్యాలరీలోనే నీళ్ల సీసా విసరడం, వేదిక ముందు తోపులాట చోటుచేసుకున్నా పట్టించుకోలేదు.

# బీఆర్ఎస్ పార్టీ ఖాళీ ఖావడం ఖాయం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్, (వెలుతురు):
బీఆర్ఎస్ పార్టీ నాయకులు అరచిగీపెట్టినా, కాంగ్రెస్ పార్టీపై లేని ఆరోపణలు చేస్తున్నా ఆ పార్టీ ఖాళీ ఖావడం ఖాయమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు విలేఖరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు అధికార కాంక్షతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఖాళీ ఖావడం ఖాయం, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గల్లంతు అవుతుందన్నారు. ఒక్క సీట్ కూడా గెల్వుడు గగనమే. రానున్న రోజుల్లో ఆ పార్టీ మూతపడుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అకాల వర్షాల పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిని రైతన్నలు నష్టపోయారు. రైతులు ఎవరు కూడా నిరాశ నిస్పృహలకు గురికావద్దుని, నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు సోదరుల ఆత్మైస్థైర్యం దెబ్బతినొద్దని ఆలోచించి సీఎం రేవంత్‌రెడ్డి పంట నష్టంపై సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టం జరిగిన రైతులకు ఎకరానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. రైతుల సంక్షేమం కోసం పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నామని రైతులకు భరోసా ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కరువు వచ్చిన, వరదలు వచ్చిన, అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న గత పదేళ్లలో ఏనాడు కూడా పంట నష్టం కింద సాయం చేయలేదు. రైతులను ఆదుకోలేదు. కనీసం పంట నష్టంపై నివేదికలు కూడా తెప్పించలేదు. రైతు భరోసా పథకం ద్వారా 3.5 ఎకరాల లోపు ఉన్న రైతులకు ఇప్పటికే రూ. 4295 కోట్లు నగదు బదిలీ చేశాం. 69.86 లక్షల రైతులకు గాను 58.66 లక్షల మంది రైతులకు రైతు భరోసా నగదు బదిలీ చేశాం. మిగిలిన రైతులకు కూడా వారం రోజుల్లో డబ్బులు వారి ఖాతాల్లో వేస్తాం. ఓ పక్కన రైతు సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటూనే మరోవైపు మూడు నెలల స్వల్ప కాలంలోనే ఆరు గ్యారంటీలను అమలు చేసింది. 30 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. ఒకటో తారీకునే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి 8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయిన, అధిక వడ్డీ భారమైన ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే.. ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# ఆందోళన వద్దు అండగా ఉంటాం : మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్, (వెలుతురు):
రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయంగా ముందుకుపోతుందని రైతుల సంక్షేమం విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, అన్ని విదాలుగా అండగా ఉంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో మంత్రి గురువారం స్వయంగా పర్యటించి పరిశీలించారు. రైతులకు ఎకరానికి రూ.10 వేల పరిహారం ఇస్తాం అన్నారు. ముఖ్యమంత్రి ప్రతి నిర్ణయం పేదల కోసమేనన్నారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సిరికొండ మండలం కొండూరు, పెద్ద వాల్గోట్ గ్రామాల్లో అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలను, కల్లంలో తడిసిన ధాన్యాన్ని ఆయన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకుని రైతుల్లో ధైర్యం నింపారు.

ప్రకృతి ప్రకోపంతో తల్లడిల్లుతున్న రైతులకు భరోసా ఇవ్వడం కోసం పంట నష్టపోయిన ప్రాంతాలకు వచ్చానని మంత్రి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిరంతరం రైతుల పక్షానే నిలబడుతుందన్నారు. ఉచిత కరెంటు, రైతు భరోసా, పంటల బీమా పథకం, రైతు నేస్తాం లాంటి పథకాలతో రైతుల్లో భరోసా నింపుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు రూ. 4,295 కోట్లలను రైతుభరోసా ( రైతుబంధు) పథకం క్రింద రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేశామని, 4 ఎకరాలకు పైన ఉన్న రైతులకు వారం రోజుల్లో నగదు బదిలీ




చేస్తామని వెల్లడించారు. పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, రైతులకు వచ్చే సబ్సిడీలు, పంటల బీమా లాంటి అనేక పథకాలకు చరమగీతం పాడిందని వెల్లడించారు. పంటల బీమా పథకాన్ని తమ ప్రభుత్వం పునరుద్ధరించిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేశామని వెల్లడించారు.

# బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్

### భారీ నౌకలో 25వేల కిలోల డ్రగ్స్ స్వాధీనం

విశాఖపట్టణం,మార్చి21(వెలుతురు):
బ్రెజిల్ నుంచి విశాఖ సీ పోర్టుకు వచ్చిన ఓ భారీ నౌకలో ఉన్న సరుకును చూసి సీబీఐ అధికారులకు మైండ్ బ్లాంక్ అయింది. ఏకంగా పాతిక వేల కేజీల డ్రగ్స్‌ను దేశంలోకి డంప్ చేసేందుకు ప్రయత్నించారు. ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటి సారి. అంతర్జాతీయ స్థాయిలో డ్రగ్స్ ముఠాల్ని పట్టుకోవడానికి.. ఈ రాకెట్ ను చేధించడానికి ఆపరేషన్ గరుడ ను సీబీఐ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నిఘా పెట్టినప్పుడు విశాఖ పోర్టుకు పెద్ద ఎత్తున డ్రగ్స్ పంపిస్తున్నట్లుగా సమాచారం తెలిసింది. దీంతో నిఘా పెట్టిన సీబీఐ అధికారులు షిప్ వైజాగ్ పోర్టుకు రాగానే పట్టుకున్నారు. డ్రగ్స్ కంటెయినర్‌ను బ్రెజిల్ లోని శాంటోస్ పోర్టులో బుక్ చేసుకున్నారు. విశాఖ పట్నంలో డెలివరీ ఇచ్చేలా ఈ బుకింగ్ జరిగింది. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కంపెనీ ఈ కన్‌సైన్ మెంట్ అందుకోవాల్సి ఉంది. బీర్‌ను తయారు చేయడానికి ఉపయోగించే కొన్ని రకాల గింజలను ఎగుమతి చేసినట్లుగా పత్రాలు సృష్టించారు. ఒక్కో బ్యాగులో ఇరవై ఐదు కేజీల చొప్పున మొత్తం వెయ్యి బ్యాగుల్లో ఇరవై ఐదు వేల కేజీల సరుకును పంపినట్లుగా పత్రాల్లో ఉంది. నార్కోటిక్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు.. ఈ సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో బీరు తయారు చేసే గింజలతో పాటు పెద్ద ఎత్తున ఇతర డ్రగ్స్ పదార్థాలును కూడా సరఫరా చేసినట్లుగా గుర్తించారు. మొత్తం కన్ సైన్ మెంట్ ను




సీబీఐ అధికారులు సీజన్ చేశారు. కేసు నమోదు చేశారు. సరుకును తెప్పించుకున్న వారిపైనా.. ఈ స్మగ్లింగ్ లో భాగం అయి గుర్తు తెలియని వ్యక్తులపైనా కేసులు పెట్టారు. ఈ ఆపరేషన్ గరుడ ద్వారా అంతర్జాతీయ డ్రగ్ రాకెట్‌ను ..ముఖ్యంగా పోర్టుల ద్వారా డ్రగ్స్ రవాణా చేస్తున్న వారిని పట్టుకున్నట్లుగా సీబీఐ చెబుతోంది. ఇతర పదార్థాలతో కలిసి ఎవరికీ అనుమానం రాకుండా డ్రగ్స్ సరఫరా చేస్తూ.. ఈ అంతర్జాతీయ ముఠా ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరా చేస్తోంది. ఇంటర్ పోల్ అందించిన సమాచారంతో సీబీఐ.. ఇలాంటి తఆపరేషన్లను తరచూ నిర్వహిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి ముఠాల ఆట కట్టించడానికి ఎప్పుడూ ప్రత్నిస్తోంది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది. కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. విశాఖ పోర్టులో గతంలో డ్రగ్స్ ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ లభించలేదు. మొదటి సారి దొరికాయా లేకపోతే.. ఇంతకు ముంద విశాఖ పోర్టు ద్వారా సిటీలోకి ఏమైనా డ్రగ్స్ వచ్చేశాయా అన్నదానిపై వివరాలు బయటకు రావాల్సి ఉంది. ఇప్పటికే గంజాయి .. విశాఖ మన్యం ప్రాంతం నుంచి దేశవ్యాప్తంగా సరఫరా అవుతోందన్న విమర్శలు ఎదుర్కొంటోంది. ఇప్పుడు ఏకంగా బ్రెజిల్ నుంచి వేల కిలోల డ్రగ్స్ నేరుగా విశాఖకే దిగుమతి కావడం.. సంచలనం అవుతోంది.

# సీఎం రేవంత్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం

### అనుములకి ఎనుములకి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారు

### ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపాటు

హైదరాబాద్,మార్చి21(వెలుతురు):
బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు సీఎం రేవంత్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, అనుములకి ఎనుములకి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారంటూ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చిత్రపురి సొసైటీలో జరిగిన అవినీతికి సీఎం రేవంత్ రెడ్డికి ఏంటి సంబంధమని ఆయన ప్రశ్నించారు. ఎప్పుడైనా రేవంత్ సోదరులో మహేంద్ర రెడ్డి అనే పేరు విన్నారా..? అని ఆయన ప్రశ్నించారు. నిజంగా మీ దగ్గర ఆధారాలు ఉంటే ప్రభుత్వానికి ఇవ్వండి తప్పకుండా వారిపై మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నిజంగా తప్పు చేస్తే మా కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరిని వదిలిపెట్టదన్నారు. కానీ అనవసరంగా కావాలని ఆరోపణలు చేస్తే చూస్తూ ఉరుకోమని, బీఆర్ఎస్ కి చిత్తశుద్ధి ఉంటే



మీరే కదా గతంలో ప్రభుత్వం ఉంది మరి ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా..'అసలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు మేము ఏమి చేయలేదు అన్నట్లు మాట్లాడుతున్నారు. గతంలో మీడియా ను ,సోషల్ మీడియా ను బీఆర్ఎస్ కేసీఆర్ ఎలా అణిచివేశారో అందరికి తెలుసు. హుజురాబాద్ లో నా ఫోన్ తీసుకొని కేస్ పెట్టింది మర్చిపోయారు. పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరిన మిర్చి రైతులకు సంకెళ్లు వేసిన సంఘటన అప్పుడే మర్చిపోయారా.. ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తి చూపుతారని ధర్నా చౌక్ ఎత్తేసినప్పుడు మాట్లాడని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఇంట్లోకి వచ్చి అరెస్ట్ లు చేసిన సంఘటనలు మర్చిపోయారా.. నేను మాజీ సీఎం కేసీఆర్ గారి పుట్టిన రోజు చేస్తే.ఒక గాడిదకు ఫోటో వేస్తే గడిగా దొంగతనం జరిగిందని సుమోటోగా కేసులు పెట్టారు. నేను చేసిన కార్యక్రమం ఒకదగ్గరైతే సుమోటోగా రెండు చోట్లా కేసులు పెట్టారు. పోలీస్ స్టేషన్ తీసుకెళ్ళకుండా ఒక అధికారి ఇంటిపై రూమ్ లో లాక్ చేసి పెట్టారు. ఈ రోజు మీ పోస్ట్ పై ఫిర్యాదు చేస్తూ పోలీసులు వారిపని వారు చేశారు. మాది ప్రజా ప్రభుత్వం మీ బీఆర్ఎస్‌ల కాదు.. తప్పు చేసింది ఎవరైనా ఉరుకోము. కానీ ఆధారాలతో రండి ఊరికే బురదజల్లే ప్రయత్నం చేస్తే మాత్రం చూస్తూ ఉరుకోము. మేము బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ లుగా ఉన్నాము ఏమైనా మాట్లాడొచ్చు అంటే కుదరదు%ా% లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఉరుకోదు తనపని తను చేసుకుపోతుంది. భజనలు చేయడం మానుకోండి. అనవసరంగా మా సీఎం గారి పై లేనిపోని ఆరోపణలు చేస్తే వదిలిపెట్టము. క్రిశాంక్ అన్న మీరు ఎప్పుడు మాలగా చెప్పలేదు. నేను మీడియా ముందు చెప్తున్నాను ఆధారాలు తీసుకొని అమరవీరుల స్థూపం వద్దకు రండి. డీజీపీ ఆఫీస్ కు వెళ్దాం..ఎవరు తప్పు చేసిన చర్యలు తీసుకుంటారు. క్రిశాంక్ అన్న కాంగ్రెస్ లో ఉన్నపుడు ఇద్దరం కలిసి ఉద్యమాలు చేస్తే ఇద్దరి పై కేసులు పెట్టిన విషయం మర్చిపోయారా.. అవస్తవాలు చెప్పడం మానుకోండి.. మీరు కేటీఆర్ ,కవిత ఆ కుటుంబం మెప్పు పొందలనుకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఎలాంటి అభివృద్ధి జరుగాకపోయి జరిగిందని చెప్పుకోండి. మీకు కావాల్సిన ఎమ్మెల్యే టికెట్ కోసం ఇలా మా ప్రభుత్వం పై అవస్తవాలు మాట్లాడడం మానుకోండి. కానీ మా సీఎం గారికి పై అనవసరంగా ఆరోపణలు చేయకండి. ఇలా అనవసరమైన ఆరోపణలు సోషల్ మీడియా లో చేస్తే ప్రభుత్వం తన పని తాను చేసుకొనిపోతుంది.' అని బల్మూరి వెంకట్ వ్యాఖ్యానించారు.

# అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాభాగమే

### మరోసారి స్పష్టంచేసిన అగ్రరాజ్యం అమెరికా

అరుణాచల్‌ప్రదేశ్,మార్చి21(వెలుతురు):
అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారత్‌లోఅంతర్భాభాగ మేనని అగ్రరాజ్య అమెరికా మరో సారి స్పష్టం చేసింది. అరుణాచల్‌ను తాము భారత భూభాగంగా గుర్తిస్తున్నామని తెలిపింది. అరుణాల్‌ను దక్షిణ టిబెట్‌గా అభివర్ణిస్తున్న చైనా.. అది తమదేనంటూ ఆ దేశ సైన్యం ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలో అరుణాచల్ భారత్‌లో అంతర్భాగంగా వాషింగ్టన్ గుర్తిస్తున్నదని అమెరికా రక్షణ శాఖ డిప్యూటీ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ వెల్లడించారు. సైన్యం లేదా పౌరులు వాస్తవాధీన రేఖ అవతల ఆక్రమణలకు పాల్పడటానికి ఎలాంటి ప్రయత్నాలు చేసినా తాము దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఇక, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర తమదేనంటూ డ్రాగన్ కంట్రీ చైనా మొండిగా వ్యవహరించి.. తన వక్రబుద్ధిని బయట పెట్టింది. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సేలా సొరంగ మార్గాన్ని ప్రారంభించారు. దీనిపై చైనా రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. జాంగ్నాన్ తమదే, సేలా సొరంగాన్ని భారత్ చట్టవిరుద్ధంగా స్థాపించిందంటూ రక్షణ శాఖ అధికార ప్రతినిధి సీనియర్ కల్నల్ జాంగ్ షియాగాంగ్ గత శుక్రవారం పేర్కొన్నారు. అయితే, దీనిపై భారత్ దేశం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. చైనా ప్రకటన అసంబద్ధమైనది..

అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగమే అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా అరుణాచల్ భారత్‌లో అంతర్భాగంగా గుర్తిస్తున్నామని అమెరికా వెల్లడించింది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com